ఆంధ్రసచిత్రవారపత్రిక



27-10-72

50 పైసలు


వెంకన్న కోట్లు
బొమ్మలకథ: బాపు
22
ఏవేఁయ్ అప్పలాయ్! మా రాజీ మీ రవణా అస్తమానం కబురులాడుకుంటున్నారేఁయ్ – కాబట్టి ఇద్దర్నీ ఒకచోట కట్టిపడేస్తే బావుంటుంది ఏవంటావ్?
మా వాడికింకా ఉద్యోగం దొరకలేదు అప్పుడే పెళ్లేవిటయ్యా
అయినా ఉద్యోగం లేనివాడికి పెళ్లిచేస్తే వూరేళ పిల్లల్నికంటూ కూర్చుంటాడు - అది నేరం!
నాన్నోఁయ్! నాకు ఝులూబు కంపెనీలో ఉద్యోగం వచ్చింది జీతం ఆరొందలు!
కంగ్రాచులేషన్సు అల్లుడూ!
ఇదుగో రెడీగా వుండండి! కళ్లేలు-అదే తాంబూలాలు పుచ్చుకుందాం - ఏర్పాట్లు చేసి వస్తాను!
ఒరేఁయ్! నువ్వు చెప్పక పోయినా నా కన్నీ తెలుసుగాని, మాటిమాటికీ నిన్ను బాదే ఆపిల్లనెలా చేసుకుంటావురా! అసలా పిల్లకి నువ్వు ఇష్టవో కాదో కనుక్కుంటూ వుండు!
(ఇంకా ఉంది)

అహంకారం ఆత్మాభిమానం కాదు. అనురాగం దానికి ఓడిపోదు



అన్నపూర్ణ ఆర్ట్ పిక్చర్స్

విచిత్రబంధం

ఈస్ట్‌మన్ కలర్



నిర్మాత:
D.మధుసూదనరావు B.A.

దర్శకుడు:
ఆదుర్తి సుబ్బారావు

కథ: సులోచనారాణి (యద్దనపూడి)
మాటలు: ఆచార్య ఆత్రేయ
సంగీతం: కె.వి.మహదేవన్
కెమెరా: సెల్వరాజ్

NVKR

ఉత్తరాలు

కథలు

పతి వ్రత కథలో 'కనకం'కున్నన్ని ధైర్యం, తెలివి, సౌందర్యము లేదు. అందుకే ఆమెకు అన్యాయం జరిగింది. అయినా కనకం శ్రీధరకు పొందదగ్గ న్యాయం అందుతుందా? లేదా అన్న ప్రశ్న మదిలో మెదులుతుంది.

'అన్వేషి'లో శాంతమ్మ సత్యంను గుర్తించే దశలో పొరపాటు వచ్చింది.

యస్. యుగంధర్, వల్లి (కతేంపటి)

* * *

ఈ 22—9—72 నాటి పత్రికలో ప్రచురించిన కథ 'ఇంకోసారి విహరించండి' 'ఇంకోసారి చదవకుండ ఉండలేము' కథలో ప్రస్తుతము ప్రపంచములోనున్న వడవడి, అలవాట్లు, పోకడలు రూపములో ఉన్నది. అంతేకాకుండగ హాస్య, వ్యంగ్య, శృంగార, రస మిళితము— 'ఇంకోసారి విహరించండి.'

మంథా వెంకటాచారి, (సోంపేట)

* * *

'అన్వేషి' కథలో రచయిత శరత్ 'దేవదాసు'ను జ్ఞాపకం చేశారు.

మారుతిరావ్, (విశాఖపట్నం)

మీకు తెలుసా?

సినిమా శీర్షికలో 'మీకు తెలుసా?' అనే శీర్షిక క్రింద 'పండంటి కాపురం' చిత్రాన్ని శ్రీ ఆదుర్తి సుబ్బారావు గారు హిందీలో నిర్మిస్తారని చదివి చాలా సంతోషించాను. ఈ సందర్భంలో శ్రీ ఆదుర్తి గారికి నా సలహా ఇవ్వదలచుకొన్నా. ఏమిటంటే మన తెలుగు చిత్రంలో రంగారావు, గుమ్మడి, జమున, దేవికగార్లు పోషించిన పాత్రలను హిందీలో వరుసగా అజిత్, బలరాజ్ సహానీ, మాలా సిన్హా, దేవికగార్లయితే బాగా రాణింపు చేస్తారని, కాబట్టి ఆయా పాత్రలకు వారినే బుక్ చేయవలసినదని, కోరుతున్నాను. 'పండంటి కాపురం' చిత్రాన్ని హిందీలో నిర్మించాలనే తలంపు కలిగిన శ్రీ ఆదుర్తిగారికి నా హృదయపూర్వకమైన శుభాకాంక్షలను మీ పత్రిక ద్వారా తెలియ జేయవలసిందిగా కోరుతున్నాను.

గుంటకల్ వెంకటరమణ, (పెద వోగిరాల)

సినిమా

చిత్రాల్లో పాటలు వ్రాసేటప్పుడు తమకు కలిగిన అనుభవాలను, ప్రముఖుల పరిచయాలను కొసరాజుగారు చక్కగా వివరించారు. వారన్నట్లు మాటల్లో అయితే ఒక జోకువేసి తప్పుకొని తప్పించవచ్చు. పాటలో అలా చెయ్యాలంటే చాలా కష్టం! నిజమే! అయితే, అలాంటి తమాషైన పాటలు వ్రాయడంలో మాత్రం కొసరాజుగారికి సాటి ఎవరూ లేరని నిర్ణయంగా చెప్పవచ్చు.

వసారె బ్రదర్స్, జ్యోతిప్రియ, (ద్రాక్షారామం)

అక్టోబరు 26న విడుదల

శ్రీ ఉమా ప్రొడక్షన్స్

కత్తుల రత్తయ్య

ఈస్ట్‌మన్ కలర్



వెలవెలా పోయిన ఒలింపిక్ జ్యోతి

నవ్వుతూ కేరింతలు కొట్టే
ఒలింపిక్ క్రీడాకారులు
విషాదంతో వున్నారు.
అక్కడ జరిగిన పైశాచిక కృత్యానికి
అన్యాయంగా పదునొకండు మంది
బలి అయ్యారు పాపం ఈర్ష్యాద్వేషాలకు
కాంతులు వెదజల్లే ఒలింపిక్ జ్యోతి
చిన్నపోతుంది ఈ విషాద సంఘటనకి.
సిగ్గుతో తలవాల్చుకుంది.
మానవత్వంనశించిపోతూన్నందుకు. ఈ ప్రపంచంలో
క్రీడాకారులపై ఏల ఈర్ష్యాద్వేషాలు,
అర్భిష్టులపై ఏల ఈర్ష్యాద్వేషాలు?
వాళ్ళు పుట్టింది దేశం కోసం
కాదు ప్రపంచం కోసం
దేశం కీర్తి ప్రతిష్ఠల కోసం.
ప్రపంచం సామరస్యత కోసం
వాళ్ళని కోల్పోతే ఏదేశమైన అధోగతిపాలవుతుంది
ఆటల్లో వెనుకబడి పోతుంది.
విప్లవ వీరులారా, మీ విప్లవం వీరిపైనా?
సిగ్గు చేటు, సిగ్గుచేటు,
మానవతకే సిగ్గుచేటు.
దమ్ముంటే ప్రభుత్వంపై తిరగ బడండి.
మీరు అనుకున్నది సాధించండి.
క్రీడాకారులతో సామరస్యంగా మెలగండి.

ఉత్తరాలు

విదార్శనా! ఏదేశం వారైనా!
ఆరిపోబోతున్న ఒలింపిక్ జ్యోతిని వెలిగించండి,
మీ సామరస్యభావంతో అహం విడనాడి.

ఎస్. ఎస్. ఎస్. శర్మ, (విజయవాడ)

* * *

ఈసారి జరిగిన ఒలింపిక్ క్రీడోత్సవాల ఫలితాలు చూస్తుంటే చాల ఆశ్చర్యం కలుగుతోంది. భారత్ 'సోది'లోకి కూడ లేకుండాపోవడం శోచనీయం. ఇంతవరకు బంగారు, రజిత పతకాల మాట దేము డెరుగు. కనీసం ఒక్క కాంస్య పతకాన్ని కూడ భారత్ గెల్చుకోలేకపోవటం సిగ్గుచేటుగావుంది. ప్రపంచ స్థాయిలో హాకీ ఆటకు ప్రసిద్ధిగాంచిన భారత్ యీసారి తన పేరు ప్రతిష్ఠలను నిలుపుకోలేకపోవుట చాల విచారం కలిగిస్తోంది. ఇంతవరకు జరిగిన ఒలింపిక్ క్రీడలలో అమెరికా, రష్యాలు పోటీకేసి బంగారు, రజిత పతకాలను గెల్చుకుని అన్నింటిలోను తమదే పైచేయి అని మరోసారి నిరూపించుకున్నాయి. కోల్పోయిన పేరు, ప్రతిష్ఠలను భారత్ తిరిగి ఎలా గడించుకుంటుందో!

ఏ. ఎస్. చక్రవర్తి, (హైదరాబాదు)

ఆంధ్రపత్రిక వారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938 – 1972)
శుక్రవారం : 27–10–72
శ్రీవరీదావినామసం॥ ఆశ్వయుజమాసం॥ బ॥షష్ఠి
సంపుటము : 60 సంచిక : 7
స్థాపితము 1908
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీథి, మద్రాసు - 1
విడి ప్రతి వెల 50 పైసలు

విషయానుక్రమణిక


ఆర్థిక క్లిష్టపరిస్థితి
అవినీతి
నీతినియమాలక్షీణింపు
ధరల పెరుగుదల
నిరుద్యోగ సమస్య
ఉత్పత్తి తగ్గుదల
ప్రపంచం దుయ్యబడితే నేం? రష్యా మద్దతుఉంది!
అమిన్
ఒక రాజకీయ నాయకుని హాబి
గొప్ప సమైక్యతా కథ
సి.ఐ.ఏ కథ
పిల్లల్లారా భూమికి దిగి రండి. మీరుకాలయాపన చేస్తున్నారు.
తీవ్ర వాదులు
సాహసం

హైదరాబాద్ నోట్‌బుక్

తిరుమల రామచంద్ర

అర్ధగాడిదలు

అబిద్‌షాప్ దారాస్తాలోను, ఇతర త్రోవల వచ్చిపోయేవాళ్ళకు అడ్డంగా నిలబడి ఏదో ఆలోచిస్తూ, వివరికోసమో ప్రతీక్షిస్తూ ఉన్నట్టు కనిపించే గాడిదలను చూస్తుంటే నాకు అపర్యాంకన్నా విచారమే ఎక్కువగా కలుగుతుంది. అంత జన సమ్మర్దంలో అవి వివరికోసం ప్రతీక్షిస్తున్నట్టు? బ్రహ్మచర్య వ్రతభంగమైనవాడు—అవకీర్ణి—ప్రాయశ్చిత్తార్థం చతుష్పథంలో రాత్రిపూట గార్దభయాగం చేయమన్నారు మనువు, కాత్యాయనుడు మొదలయిన స్మృతికారులు. కాని, ఏవో యాగాలు, హవనాలు జరుగుతున్న జంట నగరాలలో గార్దభయాగం ప్రసక్తిగాని, బ్రహ్మచర్య వ్రతభ్రష్టులమయిపోయామనే యువకుల ఆందోళనకాని వినిపించదు. ఓర్పునకు, స్వామిభక్తికి ఉదాహరణమయిన ఈ జీవిని, సింధ్ మొదలయిన ప్రాంతాలలో ఆస్తిగా పరిగణితమయ్యే ఈ అమూల్య జంతువును, సుశ్రుతుడు మొదలు వైద్యులందరూ వస్తుగుణ పట్టికలో ఎంత గానో వర్ణించిన ఈ ప్రాణిని విచ్చలవిడిగా వీథులలో వదలిపెట్టక కట్టుబాటు చేయడానికి అవకాశాలు లేవా?— అనిపిస్తుంది.

క్షమాపణ సమ్మేళనం

రోజా చేసిన తప్పులకు రోజా సింహావలోకనం చేసుకొంటూ సరిదిద్దుకోవాలని భారతనీతి. ఉపాకర్మాంగ భూతమయిన కామోకార్షీజ్జపమనేది ఒక కర్మ. కాముడే చేశాడు. కోపమే చేసింది. నేనేమీ చేయలేదు. కనుక కామక్రోధాలు నాకు దూరంగా ఉండండి — అని ప్రార్థనా రూపం ఇది. నేడిది కేవలం జపంగా మాత్రమే నిలిచిపోయింది. ఈ ఆత్మపరీక్ష వంటిదే జైనుల క్షమాపణ సమ్మేళనం. దీనిని ప్రతి క్రమణదినం, ప్రాయశ్చిత్త దినం అని అంటారు. ఇది భాద్రపద శుద్ధ చతుర్దినాడు ఏటా జరుగుతుంది.

ఈ సమ్మేళనం ఇటీవల విక్రాంత్ థియేటరులో, మునిసిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి శ్రీ పి. ఎస్. శాస్త్రి ప్రధానాతిథిగా జరిగినప్పుడు, జైన సాధ్వీ సాధువుల, ఇతరుల పరస్పర క్షమాపణ దృశ్యం మనసులోని సాత్త్విక భావాలను ఉద్దీపితం చేసింది. అధ్యక్షత వహించిన శ్రీ పి. వి. భండారి క్షమాపణ దీక్ష ప్రాముఖ్యం వివరించగా, సాధ్వీమణులు వీరభద్రశ్రీజీ, సుమంగళశ్రీజీ ఈ పద్ధతిని జాతీయ అంతర్జాతీయ వ్యవహారాలకూ వర్తింపజేయాలన్నారు. జైన సేవా సంఘం అధ్యక్షుడు శ్రీ ప్రేమ్‌రాజ్ ముణోత్ కాకతీయ సామ్రాజ్య పతనానంతరం ఆంధ్ర దేశంలో జైనం క్షీణించిందన్నారు. ఈ సమ్మేళనం మరొక విశేషం ఏడు మొదలు 22 రోజులు ఉపవాస వ్రతం చేసినవారికి అభినందన తెల్పడం.

కళా ప్రదర్శనం

ఆధునిక కళా ప్రదర్శనాలు చూస్తున్నప్పుడు, యువకుల భావన, కల్పన ఎంత పనలు సాగుతున్నవో అని ఆశ్చర్యం కలుగుతుంది. సెప్టెంబర్ 23 నుండి అక్టోబర్ 15వరకు లలిత్‌కళా అకాడెమీ కళాభవన్‌లో ఏర్పాటుచేసిన 11 వ కళాప్రదర్శనం ఈ ఆశ్చర్యాన్ని, విశ్వాసాన్ని ఇనుమడింప జేసింది. వజీర్‌సుల్తాన్ టొబాకో కంపెనీ చెయిర్మన్ శ్రీ ఎ. ఎం. లాల్ దీనికి ప్రారంభోత్సవం జరిపారు. ప్రదర్శనంలో పెట్టడానికి 203 కళాఖండాలు వస్తే, వాటిలో ఉత్తమోత్తమమయినవి 76 మాత్రం ఎన్నిక చేశారు.

లలితకళా అకాడెమీ అధ్యక్షుడు, ప్రదర్శనమాలి వీక్షకలో అన్నట్టు ప్రతి కళాఖండం వేళ్ళా స్థానిక భూమిలో ఉంటాయి. పూవులు దిగంతాలకు సౌరభాలు వరపినట్టు జాతీయతా ఆలవాలంలో దిట్టంగా నిలిచినవే అంతర్జాతీయ ప్రశంసలూ పొందుతాయి. ఈ ప్రదర్శనంలో శ్రీ వై. యాదగిరిరావు కోళ్ళపోరు, శ్రీమతి మరుచిచంద్ 'ఓమ్' చాల ప్రశంసలు పొందాయనవచ్చు. కోళ్ళపోరు ఇనుపరేకుల కత్తిరింపుల శిల్పం. ఓమ్ ఒక ప్రక్రియలో వెలుతురులో కప్పాపై నీడలుపడి విచిత్రరూపాలు ఏర్పడుతాయి. ఇలాటిది ఓంకారం. విజ్ఞానశాస్త్రజ్ఞులు తమ భౌతిక వస్తు పరిశోధనలలో [illegible] [illegible] [illegible] కాటి



ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ ఇబ్రహీం అలీ అన్సారీ కుమారుడు మహమ్మద్ అషక్ అలీ అన్సారీకీ [illegible] [illegible] [illegible] శ్రీ [illegible] [illegible] [illegible] వి. వి. [illegible] [illegible]

నిరూపణ ప్రయత్నం శ్రీ క్లైమెట్ చేశారు. ఆయన భౌతికశాస్త్ర పరిశోధకుడు.

విదేశాలలో ఆయుర్వేద వైద్యం

పారిస్‌లోని భారత విషయ పరిశోధన సంస్థ డైరెక్టరు ప్రొఫెసర్ జీన్‌ఫిల్లోజాట్ సెప్టెంబరు 23 న ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో ప్రసంగిస్తూ, ఆయుర్వేదం సజీవమైన శాస్త్రమని, మానవకళ్యాణానికి బహుముఖాలుగా ఉపయోగపడగల శక్తులు కలిగినట్టిదని, భారత సంస్కృతిచరిత్ర అధ్యయనం చేయడానికి ఆయుర్వేదం ప్రధానాధారమని, అన్నారు. 'వస్తుతం విదేశాలలో ఆయుర్వేదంపట్ల ఆసక్తి ఎక్కువయింది. మూలికలతో సిద్ధపరచే మందుల పునరుద్ధరణ ప్రయత్నాలూ తీవ్రమవుతున్నాయి. ఆయుర్వేదం ఈ విషయంలో చాల ప్రముఖంగా వినియోగపడుతుంది' అన్నారు. ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాలు డాక్టర్ బి. సంజీవరావు తమ సంస్థ కృషిని వివరించి, ఫిల్లోజాట్ భారత విషయాధ్యాయనంలో, ముఖ్యంగా ఆయుర్వేదంలో చేసిన కృషిని ప్రశంసించారు. డాక్టర్ డి.వి. సుబ్బారెడ్డి, ఆయుర్వేదం మానవజాతి గర్వించదగిన వారసత్వమని; డాక్టర్ మేల్‌కోటే; ఆయురారోగ్యాభివృద్ధికి యోగాభ్యాసం అవసరమని, ఆయుర్వేదాన్ని ఆధునిక పద్ధతులలో అధ్యయనం చేయాలని విద్యార్థులను కోరారు.


అసిధారావ్రతం

అప్పయ్య దీక్షితులవారు రాజసేవ అసిధారావ్రతమని, సింహాన్ని కౌగలించుకోడం వంటిదని, నాగుబామును ముద్దులాడడం వంటిదని అన్నమాట పోలీసుశాఖ వారికి పూర్తిగా వర్తిస్తుంది. ఇప్పుడు ప్రజలే రాజులు గనుక వారు అడుగడుగునా, ప్రజలకు జవాబు చెప్పవలసి ఉంటుంది; ప్రభుత్వానికైతే సరేసరి. కొంచెం దుడుసుతనం చూపారా, ప్రజలు విరుచుకొని పడుతారు. మెత్తదనం అవలంబించారా, నేరగాళ్లు నామాలు దిద్దుతారు. పోలీసు డిప్యూటీ కమిషనర్ శ్రీ కె. విజయరామరావుగారిని ఎప్పుడు కలుసుకున్నా ఇవన్నీ మనసులో మెనవేసుకొంటుండగా, విద్యార్థి నాయకులతో, ఇతరులతో, ఆయన ప్రవర్తించే తీరు, సంభాషించే చాతురి, చూచినప్పుడెల్లా, నేను 'క్షురస్య ధారా నిశితా దురత్యయా దుర్గం పథంతత్ కవయో వదంతి' అన్న ఉపనిషద్వాక్యాన్ని మననం చేసుకొంటూంటాను.

శ్రీ విజయరామరావుగారు మద్రాసు క్రైస్తవ కళాశాల విద్యార్థి. 19 వ ఏట రాజనీతి శాస్త్రంలో ఆనర్సు పట్టభద్రులు. తర్వాత రెండేళ్లు కరీంనగర్ కళాశాలలో ఆచార్యత్వం పిదప ఐ. పి. ఎస్. పోలీసుశాఖోద్యోగం. ఇటీవల విద్యార్థి ఉద్యమాలు, గణేశోత్సవాలు జంటనగరాలలో ప్రశాంతంగా జరుగడానికి పోలీసుశాఖ చేసిన కృషిలో ఈయనపాత్ర అతిముఖ్యమని వేరే చెప్పనక్కరలేదు.

ఉపశ్రుతి

'ఎందుకు బస్సులు నిదానంగా పిల్ల నడకలు నడుస్తున్నాయి?' అని అడిగాను. 'కండక్టరు టికెట్లు కేటాయిస్తున్నాడు' అన్నాడు పక్క ప్రయాణికుడు. 'అంటే?' అన్నాను అర్థంకాక. 'అంటే, వెనక టికెట్ అడిగితే మొగం చూచి నవ్వేవాడు. ఇప్పుడు ఏమయిందో, టికెట్లు మనం అడగకపోతే కోప్పడుతున్నాడు, టికెట్లు కేటాయిస్తున్నాడు. అందుకే ఆలస్యం!' వివరించాడు.


TERENE
Chaitra-CAFI 62 Tel

అనామధేయుడి ఆత్మకథ

సీరియస్‌లెస్ హాస్యరచన — ఆత్రేయ

13

మేమంతా విఘ్నేశ్వరుడి మీద మా యావద్భారం విడిచిపెట్టి మీనమేషాలు లెక్కబెడుతూ కూర్చున్నాము. పది గంట లయింది. పదకొండు కూడా కొట్టేశారు.

ఇంతట్లో ఒకమూల పెద్ద గలభా లేచింది. ఒట్టి కేకలుతప్ప మరేమీ విన బడటంలేదు. అందులో ఒకడు గట్టిగా కేకలు వేశాడు; 'రండిరోయ్! రండి రోయ్!!' అవి. పామో తేలో అని మేము పరుగెత్తి, ఆ గలభా వున్నచోటికీ వెళ్తాం డగా 'వస్తున్నాంరోయ్, వస్తున్నాంరోయ్!' అని ఇంకొకడు గావుకేక పెట్టేడు. ఇంతలో వాళ్ళా చేరుకున్నారు. వెనకాతల కావిళ్ళా, కావిళ్లతో సీనులూ, డ్రెస్సులూ!

ఆనాడు కృష్ణుడు అర్జునుడిని చూడగానే ఎంత ఆనందం పుట్టి—'బావా, ఎప్పుడు వచ్చితివి?' అని ఆవేశంతో గెంతులేశాడో, అంతకంటే ఎక్కువ ఆనందంతో డేన్సు చేసేం.

ఆదరా బాదరాగా సీనులూ అవీ తగి లించేసి, డ్రెస్సులు వేసేసుకొని — ఆ పాళంగా నాటకం ప్రారంభించేం.

ఎదుట హంసతూలికా తల్పం (నులక మంచానికి మేకప్పు) మీద కృష్ణుడు నిద్ర నటిస్తున్నాడు. దుర్యోధనుడు దర్పంగా వచ్చి తలదగ్గర కూర్చున్నాడు. నిద్ర పోవడం నటిస్తూన్న కృష్ణుడు ఉండుండి ఊసుపోక అటునుంచి ఇటు, ఇటునుంచి అటు దొర్లుతున్నాడు. నల్లులనుంచి నిద్ర సరిగా పట్టకపోతే అట్నించిటూ ఇట్నించటూ దొర్లడం సహజమే! కాని, కేవలం నిద్ర నటిస్తున్న (నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్నా — కాదు!) కృష్ణుడు యిలా దొర్లడం కొంత విడ్డూరంగా కనబడింది. తలకింద చెయ్యి కడుపుమీద పెట్టుకున్నాడు. కడుపుమీది చెయ్యితీసి మళ్ళా తలకింద పెట్టుకున్నాడు. ఈ నిద్రాభినయాన్ని చూస్తున్న ప్రేక్షకులు: 'కృష్ణుడు గాఢ నిద్ర అభినయించటం లేదు. మగత నిద్ర అభినయిస్తున్నాడు కాబోలు!' అనుకుంటున్నారు. దుర్యోధనుడి సంగతి — తల పక్క కూర్చున్నవాడు కాళ్ల దగ్గరికి వచ్చి కూర్చున్నాడు. నిద్రపోతూన్న కృష్ణుడు ఎప్పుడు లేస్తాడా, ఎప్పుడు పలకరిద్దామా —అని కృష్ణుడివేపు చూస్తూ వుండవలసిన దుర్యోధనుడు, అర్జునుడు ఎప్పుడువస్తాడా అన్నట్టు తెరవేపు చూస్తూ కూర్చున్నాడు. ఈ నాటకం అంతా ఏమిటో అర్థంకాక జనం అలజడి పడిపోతున్నారు.



ఎట్టకేలకు, అర్జునుడు వేంచేసేడు. తన స్థానమయిన కృష్ణుడి కాళ్లదగ్గర దుర్యోధనుడు కూర్చోవడంచూసి, కింకర్తవ్యతా విమూఢుడై గత్యంతరం లేక కృష్ణుడి తలదగ్గరకు వెళ్లి నిలబడ్డాడు. ఇదంతా క్రీగంటనే గమనిస్తున్న వాడిలా కృష్ణుడు తటాలునలేచి నిటారుగా నిలబడి, గిరుక్కున తిరిగి అర్జునుడిని మహా ఆప్యాయంగా ఆభాసనటన (ఓవర్ ఏక్షన్) అనిపించే రీతి దోతగా కౌగలించుకొని —

'బావా! ఎప్పుడు వచ్చితివి...' సగంలో ఆపేసి 'అబ్బా' అని తన తొడమీద ఒక్క దెబ్బ కొట్టుకొన్నాడు.



రేడియోపైన మహత్తర క్షణాల కోసం ఎస్ట్రెలా

యొక్క శక్తివంతమైన రేడియో బ్యాటరీలు



ఎస్ట్రెలా యొక్క శక్తివంతమైన రేడియో బ్యాటరీల అద్భుతావహకరమైన రేడియో వాణిని అధిక-శక్తివంతమైన ఎస్ట్రెలా బ్యాటరీలను ఉపయోగించుటవల్ల వింతవడియైన సంపూర్ణమగు విస్పష్టమైన ధ్వనితో ప్రసారం చేస్తాయి. కాగితపు, ప్లాస్టిక్ మరియు లోహపు జాకెట్లలో అమర్చబడియున్న బ్యాటరీలలో కావలసినవి ఎంచుకోండి. అవి లీక్-ప్రూఫ్ మరియు చాలా ఎక్కువ కాలం ఉపయోగ పడతాయి. అవి కాంతిగల వెలుగునకు, నమ్మకముగా పనిచేయుటకు,

ఎస్ట్రెలా బ్యాటరీస్

అధిక శక్తి అధిక ఉపయుక్తం

ఎస్ట్రెలా బ్యాటరీస్ లిమిటెడ్, బొంబాయి-19

అనామధేయుడి...

'మోఖుతే భ్రాతల్ సఖుల్ చుట్టు ముల్...' 'అన్నా' అని వీపుమీద ఒక్కటి చరుచుకున్నాడు.

నటన ఖూనీ అయిందన్న సంగతి మరిచిపోయేడు. పద్యం తికమక అయిందన్న మాటే స్ఫురించినట్లు లేదు. యమ బాధ పడిపోతున్నాడు.

దుర్యోధనుడు ముఖాన్ని వికృతంగా పెట్టి ఘోరంగా వున్నాడు. అర్జునుడు సరేసరి, భగవద్గీతలోవున్న విషాద యోగాభ్యాసం చేస్తున్న వాడిలా వికార ముఖ భంగిమ ప్రదర్శించడం ప్రారంభించేడు. కరుణాలవాలుడైన కృష్ణుడితో 'మీ బాధే మిటి మహాత్మా?' అన్నాడు అర్జునుడు.

'అబ్బ...నల్లి బాధ' అన్నాడు కృష్ణుడు.

'నా కోటునిండా నల్లులే!' అన్నాడు అర్జున పాత్రధారి.

'నా కోట్లోనే కాదు; నా కిరీటంలో కూడా నల్లులే!' అన్నాడు దుర్యోధన పాత్రధారి.

దాంతో ప్రేక్షకులందరూ లేచి ఏక గ్రీవంగా ప్రార్థించేరు: 'నాయనలారా! నటశిఖామణులారా!! ఆ డ్రెస్సులూ సీనులూ కాస్త ఎండలోవేసి, ఆ తర్వాత మరీ నాటకం వెయ్యండి. లేకపోతే మీకు బాధ. మీ బాధ చూడలేక మాకు బాధ!' అంటూ మంగళహారతి పాడకుండానే హాలు ఖాళీ చేసేరు. పురజనుల కోరికమీద మేము కూడా నాటకాన్ని ఆ రోజుకి విరమించేం.

* * *

అనాడు— గణేశ చతుర్థినాడు— విరమించిన నాటకాన్ని మరో సందర్భంలో వేశాం. అనాటి పాత్రధారుల్లో చాలామంది అతిరథులూ, మహారథులూ అయిన సభ్యేతరులున్నారు, వారంతా కూడా గానగంధర్వులు. నారదతుంబురులు. అపరిమితమైన ఉత్సాహవంతులు. కాని భాషాజ్ఞానం మాత్రం క్వచితు. క్వచితు.

'క్వచితు. క్వచితు' అంటే నాకొక కథ జ్ఞాపకం వస్తూంది. వెనకటికి ఇద్దరు అంగాలు రోడ్డుమీద కలుసుకున్నారుట. ఒకరు అన్నారుట. 'దండంబు దండంబు అంగంబు దేవరా! తామరకి చీమలా?'

రెండవవాడు వెంటనే ప్రత్యుత్తర మిచ్చేరట: 'మీ అప్ప కొప్పాల కిచకిచలు.'

వీడి భాష వాడికి అర్థం అయింది, వాడిభాష వీడికి అర్థం అయింది. మనకి మాత్రం అర్థం కాదు. అలాగని ఈ భాష ప్రాకృతంగాని పైశాచికంగానీ కాదు... మొదటివాడి ఉద్దేశం: 'తమరికి క్షేమములా?' అని. రెండవవాడి వుద్దేశ్యం: 'మీ యొక్క కృపవలన క్వచితు క్వచితు (కొంచెం కొంచెం)' అని. అలా తెల్లబోతారేం? ఇదంతా గ్రాంధికభాషకి వాళ్ల నోట్లో పట్టిన గతి! అలాంటి అతిరథులూ, మహారథులూ మా నాటకంలో పాల్గొన్నారు.

నాటకం జరుగుతూంది...

భీమసేనుడు కృష్ణుడి మీద మహా కోపంతో వున్నాడు, ఉన్నాడేమిటి? పట్టరాని మహాగ్రహావేశంతో ఊగిపోతున్నాడు. అప్పుడంటాడు: 'అంబువు లింకుగాక, ప్రళయాంతము వచ్చిన వచ్చుగాక, లోకంబులు సూర్యచంద్రులడగం దలక్రిందగుగాక, గొప్ప కాష్ఠంబులు మూడుగాక—'

'ఔనూ. ఔనూ' అన్న ఆడియెన్స్ కేకల్తో బెదిరిపోయి తెరపడిపోయింది.

అందులోనే దుర్యోధనుడు అంటాడు:

'అదియుం గాక—

అయిదుగురు మాకు శత్రువు లంతెగాక

క్రీడి యొనర్చిన క్రీడు గలదె?'

ఇంక, ప్రేక్షకుల గోల. 'క్రీడు యేవిటిరోయ్? క్రీడూ??' అనీ— 'ప్రాడు చేశావ్—ప్రాడు!' అనీ 'నీ కీడు తీసేస్తాం!' అనిన్నీ ప్రారంభించేరు.

ఈ రణరంగ కోలాహల మధ్యస్థంలోంచి ఎలాగోలాగ నాటకరథం సాగుతూంది... నాటకం మాంఛి రసపట్టులో పడింది. రాయబారఘట్టం. కృష్ణుడు కౌరవ్య రాజన్య దర్బారులో దౌత్యధర్మాన్ని నెరవేరుస్తున్నాడు. ఆఖరి ముక్కలు నాలుగూ గట్టిగా చెబుతున్నాడు.' చెల్లియొ చెల్లకో' పద్యాన్ని దంచికొట్టి పాడేశాడు. రెండో పద్యాన్ని ఎత్తుకున్నాడు: 'అలుగుటయే యెరుంగని మహామహితాత్ముడజాతశత్రుడే— అలిగిననాడు సాగరములన్నియు నేకము గాకపోవు— శత్రుడే కర్ణులు పదివేవురైన నని— 'నెత్తురు'— జత్తురు రాజరాజ...'

ఇంతలో ఎవడో 'వన్స్‌మోర్' అన్నాడు.

దానితో మనవాడు ఉబ్బి తబ్బిబ్బయి 'కర్ణులు పదివేవురైన నని నెత్తురూ— జత్తురూ...' అని తారస్థాయిలో రాగ ప్రస్తారంచేసి భాషని ఖూనీ చేయడంతో ఆడియెన్స్‌లో హాహాకారాలు చెలరేగేయి. ఈ 'నెత్తురు'ని కళ్లతో చూడలేక, చెవులతో వినలేక కొందరు అర్భకులు మూర్ఛపోయేరని కూడా విశ్వసనీయవర్గాలద్వారా తెలిసింది.

ఏదెలావున్నా నాటకం మాత్రం చకచకా సాగిపోతూంది. 'ఈ నాటకం ఎప్పటికేనా చల్లగా తెల్లవారుతుందా' అని గ్రీన్ రూమ్‌లోవున్న మేమందరం, తెరపక్కనే వున్న 'శ్రీ సీతారామాంజనేయ భరత శత్రుఘ్నుల' బొమ్మకి నమస్కారబాణాలు వదులుతున్నాం.

అదే సమయంలో, యుద్ధఘట్టంలో— ధర్మరాజు ద్రోణాచార్యుల వారిమీద నమస్కార బాణాలు విసురుతున్నాడు. అప్పుడు ధర్మరాజు అంటాడు:

'తనలో వీరే ద్రోణులు. సమీపించి సాష్టాంగ నమస్కార మొనర్చి, అటుపిట చూసి —

ద్రోణాయ! శిష్యకోటి

త్రాణాయ! ధనుష్మదధిక దర్పాపహార

ప్రాణాయ! శిఘ్రకల్పిత

బాణాయ!...'

అంతే! ప్రేక్షకులు అంతవరకే వెళ్లనిచ్చేరు. ఆ తరువాత లేచిన ప్రొద్దో— ఏటవ్‌ — బాంబుల పరికుల సమరరంగ ధూళి ధూసరిత ఘోషలలో నాటకం మరి సాగలేదు. తెర శాశ్వతంగా (ఆ రాత్రికి మాత్రమే సుమండీ) పడిపోయింది. ప్రేక్షకులు చెల్లాచెదరై పారిపోయేరు.

అందరమూ కుక్కిన పేలలాగ నోట మాటరాక ఖిన్నాతి ఖిన్నులమై ఊరుకున్నాం. ఇకముందు నాటకాలు వెయ్యగలమా, లేమా? 'నాటక కళ' భవిష్యత్తు అంధకారంలో పడిపోతుందా? నాటకరంగస్థలం ఎక్కడం మాకందరికీ ఇదే ఆఖరుసారి అవుతుందా? — అని ఆలోచిస్తూ వున్న మా ఆలోచనకి అంతరాయంగా, మా కృష్ణ పాత్రధారి — 'ఎందుకు ప్రేక్షకులు అలా గోలెత్తారు?' అని శంక జేసాడు.

'ఓరి వెర్రికుట్టా! — 'నెత్తురు—

జత్తూరు' కాదు: నొత్తూరు—జత్తూరురా' అని ఒక పరోపకారపారీణుడు శంకా నివృత్తి చేశాడు.

వీడన్నాడు గదా! 'ఏడిచేరు. నెత్తూరు అయినా నొత్తూరు అయినా ఒక్కటేః అసలు యుద్ధరంగంలో 'నొత్తూరు' ఏమిటి? చప్పచప్పగా వుంది. నెత్తూరు కళ్ళజూస్తారు అనడమే కరకట్టు!'

ఇది విని ధర్మరాజుకి (అంటే ధర్మ రాజు పాత్రధారికి) కాస్త ధైర్యం వచ్చింది. 'నేను చేసిన తప్పేమిటి?' అని మాటిమా అడిగేశాడు.



'(బాణాయ ఏమిటి? నీ మొహంలా వుంది. 'బాణాయ' అనాలిగానీ!' అని మరో పెద్దమనిషి తెలియజేసేడు.

'వెధవది ఈ పూళ్ళోవాళ్ళకి పొట్ట కోస్తే అక్షరం ముక్కలేదు. అంచేత ఏది తప్పో ఏది ఉప్పో (ఒప్పో) తెలీదు. ద్రోణాయ్య తరువాత ద్రాణాయ్య, ఆ తర్వాత ప్రాణాయ వున్నప్పుడు — నాల్గోది తప్పకుండా '(బాణాయ' అవుతుంది. కాని కరారాఃవుడు లేకుండా, బాణాయ ఎట్లా అవుతుంది?' అని తన తర్కశాస్త్ర పారీణతా, భాషాశాస్త్ర వైశద్యతా మా మీద గుప్పేడు.

'మరి, అచ్చు పుస్తకంలో కరారాఃవుడు లేదే!' అని శంకించేడొక యదార్థవాది.

'నీకేం తెలుసునోయ్? అచ్చు పుస్తకంలో వున్నదే రైటనీ, వార్తాపత్రికల్లో పడిందే నిజమనీ తలకాయమీద మెడవున్న— కాదు కాదు— మెడమీద తలకాయ వున్న వాడెవడూ అనుకోడు!' అని వుద్రేకంతో ధర్మరాజా కేకలు వేశాడు.

'ధర్మరాజాకి అంతకోపం పనికిరాదోయ్. తగ్గు తగ్గు. అయినా పద్యం ఎలాగుంటే అలా యేడవాలి గాని, మధ్యని నీ సొంత కవిత్వం ఏమిటోయ్, పానకంలో పుడక లాగ!?' అని కోప్పడ్డాడు ఓ ముక్కుకి మాటిగాపోయే మొనగాడు.

'అయితే, పద్యంలో తప్పుంటే — ఆ తప్పులతడకే చదవాలని శాస్త్రమా?'

ఇది ధర్మజ ఉవాచ!

తిరుపతి వేంకటకవులను విమర్శించే పాండిత్యం మాతో విదరికి లేక అంతటితో

అనామధేయుడి ...

ఈ వాగ్వివాదాన్ని ఆపుచేశాం. ఉన్న సంగతి చెప్పాలి కదా! ఇక్కడితో దీన్ని ఆపు చెయ్యకపోతే ఇంకెలా పరిణమిస్తుందో?! వినాయకుడిని చెయ్యబోతే కోతి అయిందట. కోతిని చెయ్యబోతే అది కొండముచ్చు కావొచ్చు!

అదే విధంగా నాటకం వెయ్యబోతే అది అంతర్‌నాటకంలోకి దిగింది. వాగ్వివాదం అంతటితో ఆపు చెయ్యకపోతే ఏ గ్రీన్ రూమ్— అంతర్భాగ— అపూర్వ నాటకం లోకి దిగిపోతుందో అని మా భయం!

* * *

పలుగురిని చంపితేనేగాని డాక్టరు కాడు. నాలుగు సిగరెట్లు తగలబెడితేగాని ధూమ పానశాస్త్ర నిష్ణాతుడు కాదు. నాలుగు నాటకాలు పాడుచేస్తేనే కాని నటశిఖామణి కాడు. ఆ విధంగా ఎంతో అనుభవం 'నాటక రంగం' లో గడించుకొన్నాము. అందుచేత పురజనులు — మా మానాన్న మేమూరుకున్నా — నాటకాలు వెయ్యమని వేధిస్తూండేవారు. పొద్దున్నలేస్తే మొగాలు చూసుకోవలసిన వాళ్ళం. వాళ్ళ మాట కొట్టేస్తే యెలా?

నాటకం ఇలా అవడంకూడా ఒకరకం అంటారు తెలిసిన పెద్దలు. దానిని 'రస భంగ' మని, 'రసాభాస' మని అంటారట. ఇంకా తెలిసిన పెద్దలు ఏమన్నారంటే; 'రసపోషణకంటే 'రసాభాస పోషణ' కష్ట తరంబు' అని!

ఈ నాటకాల్లో అసలు నాటకంకన్నా అంతర్నాటకాలె రక్తి కట్టించేవి. మేమెంత వద్దు వద్దన్నా ప్రజలు తండోపతండాలుగా మా 'రసాభాస పోషణ' ని శతధా సహస్రధా ప్రశంసించేవారు.

పురజనుల కోరిక మేరకు మరోసారి వేస్తున్న 'కురుక్షేత్రం' లో— కురురాజ సభలో — ద్రౌపదీ మాన సంరక్షణ ఘట్టంలో — వికర్ణుడిలా అంటాడు. ప్రాజ్ఞులు ధర్మ నిర్ణయము కాయరా?

ఎందుకు మీ తపంబు —
ఏందుకు మీ జపంబు
ఏందుకు మీ తపంబు —
ఏందుకు మీ జపంబు
ఏందుకు మీ తపంబు...'

ముందు ముక్క పాపం, మానవుడికి అందలేదు కాబోలు. యమయాతన పడి పోతున్నాడు. ముందు ముక్క దొరక్క ప్రాంప్టరుగాడు అందివ్వకపోతే—అప్పుడు ఆ నటుడి బాధ పరమశత్రువుకేనా వద్దు. ఇది నా స్వానుభవం!

కాని, ఇప్పుడు ప్రాంప్టరు తప్పు ఎంత మాత్రం లేదు. తెర వెనకనుంచి అతగాడు గొంతు చించుకుంటున్నాడు. కాని, ఇతను ముందు ముక్క అందుకోడానికి తెర దగ్గ రికి వెళ్ళాలంటారా? అహాఁ. ఎంతసేపూ స్టేజిమీద ప్రేక్షకులికి దగ్గరగా, తెరకి దూరంగా పచార్లుచేస్తూ అవసోపాలు పడ డమేగానీ ఒక్కడుగు వెనక్కి వెయ్యడు. అవును ఎలా వేస్తాడు? భారత వీరుడు గదా! ఒక్కడుగు వెనక్కి వెయ్యడమే! పోనీ, ప్రాంప్టరు తెరలోపలి నుంచి వొచ్చి వాడి చెవిలో ఆ ముందు ముక్క వూదెయ్య



చూడడూ? అహో! అది బాగుండదా! ఇదంతా మహా బాగుంది కాబోలు!

వికర్ణుడు ఎంత బుర్ర కొట్టుకున్నా ఎన్నిమార్లు వల్లించినా ముందు ముక్క దొరకదు.

'ఎందుకు మీ తపంబు—
ఎందుకు మీ జంబు
ఎందుకు మీ తపంబు —
ఎందుకు మీ జపంబు...'

ఇంతలో ఒక ప్రేక్షక మహాశయుడు అందుకున్నాడు: 'ఎందుకు నాటకంబు?' అని రాగయుక్తంగా.

ఇంకొకడందుకున్నాడు. 'ఇంకా యెందుకు స్టేజిమీద?'

మరొకడందుకున్నాడు. 'పదరా పెద్దమ్మా!'

ఇంకో మహాపాడు, మరి భరించలేక పెద్ద పొలికేక పెట్టేడు. 'పోవేలరా, డింభకా?!'

దాంతో మనవాడు '—అక్కటా!' అని ఆఖరిముక్క అనేసి తెరలోకి తుర్రున జారుకున్నాడు.

తెర పడిపోయింది.

కాని, ప్రేక్షకుల — 'అక్కటా' — 'కట్టా' — 'కటకటా' — 'అయ్యో' — 'అక్కటకటా' అన్న ఆర్తనాదాలు ఇప్పటికీ నా చెవుల్లో గింగురుమంటున్నాయి.

మేమెప్పుడు నాటకం వేసినా 'పాండవోద్యోగ— విజయం' తప్ప మరేమీ వేసేవాళ్లంగాదు. కారణం: అది మాకు బాగా వలిగిపోయింది. కొత్తది వేస్తే రాణిస్తుందో రాణించదో అని భయం! అది అలాగ పేటెంటు (హక్కుభుక్తం) అయిపోయింది. అదిగాక నవరసాలు, నానా రాగాలు కురిపించగల నాటకాల్లో ప్రముఖమైనదని అప్పటికి మా అభిప్రాయం. అంతేగాక దీని రసపరిపుష్టి మాకు అనుభవైకవేద్యం. ఆ రసతన్మయతలో ప్రేక్షకులు మోక్షానందం పొందేవారు. నటులు తాదాత్మ్యమే పొంది తరించేవారు. నాకు మొదటి నుంచీ రాయబారాలంటే ఆసక్తి. అసలు ఆ కాలంలో నేను కాలేజీలో చేరుదామనుకుంటూ మానేసిన రోజుల్లో, దేవరాజు వెంకటకృష్ణారావుగారు రచించిన 'సంజయ రాయబారం', 'శ్రీకృష్ణరాయబారం' — కాలేజీలో పాఠ్యగ్రంథాలుగా వుండేవి. అవి చదివిన దగ్గరినుంచీ రాయబారాలంటేనే నాకా మోజు కలిగింది, శ్రీ కృష్ణరాయబారం అంటే ప్రేమలాసక్తి కలిగింది. మా 'నాటక విభాగ' సభ్యులకికూడా ఈ 'కురుక్షేత్ర' నాటకరసం ఎంత జార్చినా అవని తీరేదికాదు! మా పాత ప్రేక్షకుల సరేసరి!!

(ఇంకా వుంది)

ప్రశ్నోత్తరం

...కె. రామలక్ష్మి...

టి. ఆర్. టి, రాజమండ్రి

ఆడది తెల్సుకోవ్సింది ఏమిటి? సిగ్గు విడిచిపెట్టడమా? బరితెగించడమా? లేక చిన్నచూపు చూస్తే లాభం లేదనా? ఏమైనా మీరు ఆడవారిని స్పైకెత్తాలని విశ్వప్రయత్నం చేస్తున్నారు. మీరు ఆడువారు కనుకనా?

ముందు మీ కోపానికి కారణం తెలుసుకోవాలని కుతూహలంగా వుంది. పడివుంటే అణగదొక్కుతారు ఆత్మగౌరవం తెలుసుకొనివుంటే—కొంచెం మీరే తగ్గుతారు—మీలాంటి మగవాళ్లు చదువుకున్న ఆడదాన్ని మాటలు నేర్చిన కుక్కగా చూచేదీ, ట్రీట్ చేసేదీను. మీలాంటి ఏ ఒకో ఆలో మనిషి చాలు— ఎందరో మహాను భావులు తాపత్రయపడి, శ్రమించి, సంఘ వైమనస్యాన్ని అపహాస్యాలనీ ఎదుర్కొని, ఆడదాన్ని ఒక మనిషి చేయాలని చేసిన కృషి అంతా వమ్ము అయి బూడిదలో పోసిన పన్నీరు కాడానికి. చూడండి తోటగారూ! తలెత్తి తిరుగనేర్వడం—సిగ్గు విడవడం కాదు—ఆత్మ స్థైర్యం అలవరచుకోవడం. తనెవరో తెలియ చెప్పుకోవడం—బరితెగించడం కాదు. జ్ఞానోదయం పొందడం. మహానుభావులు కందుకూరి వారి ఊరునుంచా మీ రడిగిన యీ ప్రశ్న!? ఎంత తెలివి తక్కువ!!!

ఎ. వి. ఎక్, కొల్లిపర

మీ జీవిత ధ్యేయం?

పిల్లైనంత సాఫీగా బ్రతికేయడం. బ్రతికి వుండగానే వో వెజిటబుల్‌లా అయిపోకుండా యాక్టివ్‌గా వుండడానికి ప్రయత్నించడం.

జి. ఎస్, హైద్రాబాదు

మీరు చెప్పిన బంగాళాదుంప పరోటా చేసి చూశాము. బాగా కుదిరింది. ప్రతి వారం ఒక ప్రశ్న తగ్గించి ఒక వంట రాయండి.

అలాగే చూదాం సోదరీ, అసలు 'మామూలు విషయాలు' కతీతంగా నేను రాయడంలేదు—ఈ ప్రశ్నావళిలో అనే చాలామంది కోప్పడుతున్నారు. ఇంక రెగ్యులర్‌గా వంటలు చెప్తే—నేలబారు చేసేశాను అంటారు (తినడానికి అభ్యంతరం ఉండదుకాని కొందరికి వాటిని గురించి రాస్తే అమూల్యమైన స్థలం వేస్టు అనిపిస్తుంది!)

వి. జె, తెనాలి

అక్కా, లావే స్వయంగా నా హృదయంలో చోటు చేసికొంది...

కాను బాబూ, ఆడ దెప్పుడూ—వెర్రివాలోకం,

వి. ఎన్. ఆర్, గుంటకల్

అందం ఆకర్షణ ఈ రెండూ అతివలకు వరాలు అంటారు. మరి అవి లేనివారు బాధపడతారా?

పడతారు. కాని అది అనవసరం. ప్రవర్తన, మాటచాతుర్యం, సహృదయత మొదలైనవి కూడా అందం ఆకర్షణలకంటే—ఎక్కువగా ఎదుటివారిని ఆకట్టుకుంటాయి.

కె. వి. ఆర్, కందివలస

ఆకలికంటే అధికమైన బాధ మరొకటి వుందా?

కేం.

అడిగేదానికి సూటిగా జవాబు యివ్వండి— ప్రేమకు నిర్వచనం ఏమిటి?

సెక్సు సెంటిమెంట్లు కలయిక ప్రేమ.

పి. ఆర్. ఆర్, మద్రాసు

మీ రాష్ట్రంమీద ఎంత విముఖతవున్నా చివరకు యిక్కడికే రావలసి వచ్చింది — ఇంద్రాజవరంనుంచి.

ఎందుకబ్బా అంత విముఖత?! మద్రాసులాంటి పట్నం యింకోటి లేదు—అని నా నమ్మకం.

కె. ఎస్. కె, తాడేపల్లి గూడెం

సిస్టర్ మీకు మైనస్‌లు ఎన్ని ప్లస్‌లు ఎన్ని?

అన్ని ప్లస్‌లే కమలా, మైనస్సులు లేరు. ఈ రోజుల్లో—ఆడపిల్లవి అయివుండీ యింకా ఆడపిల్లలు మైనస్‌లని అనుకుంటున్నావా? అర్థం లేని మాట. నేన్ను అబ్బాయిలకే యిస్తాను మైనస్.

జె. వి. ఆర్, కాకినాడ

చదువుకోడం ఎందుకు?

మన తెలివి తక్కువని దాచుకుందుకు!

ఆర్. వి. కె. ఆర్; బి. బి. హెచ్. ఎస్, వేట్లపాలెం

వారపత్రికలలో ప్రచురింపబడిన నాటికలను వాటి రచయితలు తమ స్వంత హక్కులతో పుస్తకరూపంలో ముద్రించుకో వచ్చునా?

ముద్రించుకో వచ్చును.

టి ఆర్, కడప

మీలోవున్న సమయస్ఫూర్తికి నేను ఎప్పుడూ ఆశ్చర్యపోతూ వుంటాను.


థ్యాంక్యూ, ఒకొక్కప్పుడే సమయస్ఫూర్తి ఎదుటివారికి 'వాత'లా తగిలి— నా ప్రాణానికి తెస్తూంటుంది!

కె. వి. ఆర్, గోపవరం

'ఎవరికివారే — యమునాతీరే' అన్న దానికి మీరు సమాధానం యిచ్చారు. కాని నా ఉద్దేశ్యంలో 'తీరే' అంటే 'మాదిరిగా' అని చెప్పుకోవాలి. ఎవరికివారే యమున మాదిరిగా అని చెప్పుకోవాలి. గంగా యమునా నదులు కలిసినప్పటికి — వాటి నీరుమాత్రం ఒకదానితో ఒకటి కలవదు.

తీరేకి మాదిరిగా అనే అర్థం ఎక్కడ పుట్టించారు? తీరు కాదిది— తీరే. అయినా సంగమం దగ్గర మూడో నదిని మరిచిపోతే ఎలా?

కౌగిలి సంస్కారం



రగ్గులను కూడా కొరికే పుష్యమాసపు చలి ఉదయం ఏడుగంటలైనా ఇంకా తగ్గుముఖం పట్టలేదు.

కిటికీతలుపులూ గదితలుపులూ మూసుకుని ఆరడుగుల మనిషి మూడడుగులై రగ్గుమీద రగ్గు కప్పుకుని పడుకున్నాడు మూర్తి.

అతని చెల్లెలు సంధ్య వచ్చి కాఫీ తాగడానికి రమ్మని లేపింది.

'ఊఁ...' అంటూ ముసుగు తన్నాడేకాని లేవలేదు మూర్తి.

పదినిముషాల తర్వాత బయట ఎవరిదో అపరిచితమైన స్త్రీ కంఠం వినిపించింది. మెల్లగా ముసుగు తీశాడు. కండ్లు నులుముకుంటూ బయటకు వచ్చాడు.

అతని చెల్లెండ్లతో మాట్లాడుతూ ఒకామె నిలుచుంది. ఆమెవరో మూర్తికి తెలియదు, వయసు ఇరవైరెండుకు పైననే ఉంటుంది.

మూర్తి గదినుండి బయటకురాగానే ఆమె మాట్లాడ్డం ఆపేసింది. ఒక్కక్షణం మూర్తివైపు సూటిగా చూసి సంధ్యవైపు ఎంక్వైరీ పోజ్ వేసింది.

మూర్తి సాధారణంగానే ఆమెవైపు చూసి వంటింట్లోకి వెళ్ళిపోయాడు.

'సంధ్యా! కాసిని వేడినీళ్ళు తీసుకరా' అని మూర్తి వంటింట్లోనుండే కేక వేశాడు.

సంధ్య వంటింట్లోకి వచ్చింది.

'ఆమె వెళ్ళిపోయిందా?' అడిగాడు మూర్తి.

'పోయింది' అంది సంధ్య.

'ఎవరామె?' ఆత్రుతగా అడిగాడు మూర్తి.

సంధ్య అన్నయ్యవైపు అదోలా చూసింది.

'పేరు కరుణ. ఊరు పేరేదో చెప్పింది జ్ఞాపకం లేదు. వాళ్ళాయనకు ఈ మధ్యే మన ఊరికి బదిలీ అయిందట. మన వీధిలోనే మీనాక్షమ్మగారింట్లో అద్దెకుంటున్నారు. చాలా సోషల్‌గా ఉంటుందన్నయ్యా' అంది సంధ్య.

మూర్తి కాఫీ తాగి ఓ నవల చేతిలో పట్టుకుని ఇంటి ముందు బీరెండకు కూర్చున్నాడు.

రాత్రి చదవడం ఆపి మలకవేసిన పేజీ తీసి నాలుగు పంక్తులు చదివాడు. ఇంతలో మీనాక్షమ్మ ఇంటిముందు కూరగాయల బండివాడిని పిలుస్తున్న కరుణకంఠం ఖంగున మోగింది.

పుస్తకం పేజీ మలువకుండానే చటుక్కున మూశాడు. బేరం చేస్తున్న కరుణ వైపే చూస్తూండిపోయాడు.

బండి వెళ్ళిపోయింది. చేతిలో వంకాయలు పట్టుకొని అలాగే నిలుచుని చిరునవ్వు నవ్వుతుంది కరుణ.

ఆ చూపులో ఏదో వెచ్చదనం వచ్చి మూర్తి చలిని తగ్గించినట్లుగా పైన కప్పుకున్న టర్కీ టవల్‌ను తీసివేశాడు.

మూర్తి ఖచ్చితమైన బ్రహ్మచర్యంతో ఇరవై అయిదు వసంతాలు గడిపాడు.

నిశ్చలమైన అతని మనస్సులో కరుణ చూపులూ, చిరునవ్వులూ రాయివేసిన నీటి అలలలా కలవరపరిచాయి.

తనలో కలిగిన వికారానికి తనే ఆశ్చర్యపోయాడు. ఇన్ని సంవత్సరాలుగా ఆడవాళ్ళతో కలసి మెలసి పని చేసినా తనలో ఇటువంటి ప్రేరణ ఎన్నడూ కలుగలేదు.

ఇంతలో కరుణను పలుకరిస్తూ మరో అమ్మాయి వచ్చింది. కరుణ చూపుల సరళరేఖవెంట పరుగులుపెట్టిన ఆ అమ్మాయి చూపులు మూర్తినిచేరి ఆగిపోయాయి.

మూర్తి ఠకీమని మళ్ళీ పుస్తకం తెరచాడు. ఏదో పేజీ—అసలు పేజీలనుండి అతని మనస్సు ఎగిరిపోయింది.

ఆ అమ్మాయీ, కరుణా లోపికి వెళ్ళారు.

మూర్తి విసుగుతో పుస్తకం మూశాడు.

మధ్యాహ్నం భోజనంచేసి దినపత్రిక తిరగవేస్తూ కూర్చున్నాడు. కరుణ విచిత్ర ప్రవర్తన గురించే ఆలోచించసాగాడు.

'సంధ్యా!' అని పిలుస్తూ మళ్ళీ వచ్చింది కరుణ.

పేపర్లోనుండి తలను బయట పెట్టాడు మూర్తి.

చెల్లెండ్లందరూ స్కూలుకు పోయారు. నాన్న ఇంట్లో లేడు. మూర్తి తల్లిని ఎప్పుడో పోగొట్టుకున్నాడు.

'సంధ్య స్కూలుకు వెళ్ళిందండీ' అన్నాడు మూర్తి. ఆ మాటలు పొడి

కౌగిలిసంస్కారం

పొడిగా అనిపించాయి కరుణకు.

ఆమె తిరిగిపోలేదు. అలాగే నిలుచుంది. ఏమో మాటాడాలని తాపత్రయ పడుతోంది.

'మీరు రాస్తారట' అంది తలను ఒరగావంచి, చిరునవ్వు నవ్వుతూ.

'ఆఁ...అబ్బే. నాకేం అంతగా రాయడం రాదండీ, ఏదో అప్పుడప్పుడు ఉబుసుపోక కలం ఆడిస్తాను. అంతే' అని ఆరంభ రచయితల సహజ ధోరణిలో చెప్పక పోయాడు మూర్తి.

కరుణ నిలుచునే ఉంది.

సహజంగా ఏ విషయాన్నైనా నిర్మొహమాటంగా, తేలిగ్గా ఆలోచించే మూర్తిలో ఏదో తికమక కలిగింది.

'అరె! నిల్చునే ఉన్నారేం. కూర్చోండి' అన్నాడు.

కరుణ మేజాబల్లమీద కూర్చుంది.

పొడిపొడి సమాధానం చెప్పి పంపాలనుకున్న మూర్తి తానెందుకు ఆమెను కూర్చోమన్నాడో తనకే బోధపడలేదు. ధారాళంగా మొహమాటం లేకుండా మాటాడగలిగే మూర్తికి ప్రస్తుతం భాషా దారిద్ర్యం సంభవించింది.

ఆ నిశ్శబ్దంనుండి తేరుకునేలోగా కరుణే అంది.

'మీరో సహాయం చేయాలి నాకు' అని.

మూర్తి నరాలలో నెత్తురు ప్రాకి వచ్చింది.

తడబడుతూనే 'చెప్పండి' అన్నాడు.

'మీరు ఉదయమేదో పుస్తకం చదువుతున్నారు' ఏమిటది.

'ఓ నవల.'

'మీరు స్త్రీ రచయితల నవలలు కూడా చదువుతారా?'

'అదే దానికేం? మీకెందుకా సందేహం కలిగింది?'

'స్త్రీ రచయితల నవలల గురించి మీ అభిప్రాయం ఏమిటి?'

'సన్నివేశాలు సరళంగా నడుస్తాయి. తీవ్రమైన భావాలనూ గాఢమైన సన్నివేశాలనూ, ఉదాత్తమైన శిల్పంతో రాయలేక పోతున్నారు. పక్షపాత వైఖరి కూడా సమృద్ధిగా ఉంటోంది.'

'మరైతే ఆ శిల్పం ఏ రచయితలో ఉందంటారు.'

కరుణ సాహితీ జ్ఞానానికి ఆశ్చర్యపోయాడు మూర్తి.

'మీరు శరత్ నవలలు చదివారను కుంటాను' అన్నాడు.

'శరత్ స్త్రీ పాత్రల గురించి మీ అభిప్రాయం ఏమిటి ?'

'అంత చక్కని పాత్ర సృష్టి మరెవరు చేయగలరు ?'

'అలాంటి పాత్రలు వాస్తవ జగత్తులో కూడా ఉంటాయంటారా ?'

'తప్పక. కాని అరుదుగా ఉంటారు. ఎంత ఆత్మస్థైర్యం ఉంటే అంతటి సంస్కారాన్ని సంపాదించుకుంటారు.'

'ఆ స్త్రీల సంస్కారాన్ని మీరు సహిస్తారా ?' అని సూటిగా చూస్తూ అడిగింది కరుణ.

'అదేం అలా అడుగుతారు. సంస్కారం అలవరచుకోవడమే చిత్తశుద్ధి అయినప్పుడు, దాన్ని సమర్థించలేకపోవడమేమిటి ?'

'అటువంటి సంస్కారవంతురాండ్రైన స్త్రీలను మీరు ఆదరిస్తారా ?'

ఈ ప్రశ్నకు కాస్త తికమక పడ్డాడు మూర్తి.

'గౌరవిస్తాను' అన్నాడు.

'అయితే ఆదరించరన్న మాట. మీరు నమ్మిన సిద్ధాంతాలను గౌరవిస్తారు కానీ, ఆచరణ విషయం వచ్చేవరకు సమాజానికి భయపడి వెనకాడతారు. అంతేనా ?'

కరుణ ఎందుకివన్నీ అడుగుతోంది. తనను ఎక్కడికి తీసికెళుతోంది. అయినా జవాబు చెప్పాడు:

'మీరు అపార్థం చేసుకుంటున్నారు. 'ఆదరించడం' అనడానికే . మరికొంత విలువనిచ్చి 'గౌరవిస్తాను' అని అన్నానని ఎందుకు అనుకోగూడదు.'

ఆ మాటకు కరుణ ఏమీ జవాబు చెప్పలేదు. 'సరే వస్తానండి. మావారొచ్చే వేళైంది. వారు ఇంటికొచ్చేవేళకు నేను ఇంట్లో లేకుంటే నాకే రోజంతా చాలా బాధగా ఉంటుంది' అంటూ పోబోయింది.

'ఆగండి. మీరేదో సహాయం అన్నారు.'

'ఆఁ ... మరచేపోయాను. సాయంత్రం వస్తాను. మీరు కొన్ని పుస్తకాలివ్వాలి. బొత్తిగా తోచడంలేదిక్కడ' అంది. మరేమో

షేవర్ స్విష్ పునరాగమనం



ఇప్పుడు! మీ అభిమాన పాత్రమైన స్విష్ స్టెయిన్‌లెస్ స్టీల్ బ్లేడ్లనే తిరిగి వాడండి.
అవి మళ్ళీ లభిస్తున్నాయి...కొల్లలుగా!

కౌగిలి సంస్కారం

సమాధానాన్ని ఆశించిన మూర్తి,

'అంతేనా. ఆగండి. ఇప్పుడే పుస్తకాలు తీసికెళ్ళండి. పగలు చదువుకుందురుగాని' అన్నాడు.

'వద్దండీ. పగలంతా ఇంటిపనితోనే సరిపోతుంది. ఇల్లు శుభ్రంగా లేకుంటే మావారు అసహ్యించుకుంటారు. అంతే కాకుండా సాయంత్రం వస్తే మళ్ళీ కాస్సేపు మాట్లాడ్డానిక్కూడా అవకాశ ముంటుంది గదా! వస్తా...' అంటూ నవ్వే చూపులు రువ్వుతూ వెళ్ళిపోయింది.

మూర్తికి కరుణ ధోరణి ఏమీ అర్థం కాలేదు. కాని ఆమెలోగూడా ఎంతో 'బరువు' ఉందని గ్రహించాడు.

తానామెను అపార్థం చేసుకోవడం లేదు గదా! ఏమో... అతడో స్థిరమైన నిర్ణయానికి రాలేకపోయాడు.

'కరుణ స్త్రీ సంస్కారాన్ని గురించి అంత ఎందుకు మాటాడింది. ఆమె జీవితంలో భయంకర రహస్యాలేమైనా దాక్కున్నాయా?' అనే ప్రశ్న లెన్నెన్నో మూర్తిని వెంటాడినాయి.

'ఆమెను గురించి తెలుసుకోవలసిన అవసరం నాకేమిటి?' అని మరోసారి అనుకున్నాడు.

అనుకున్నాడేగాని అతనికే తెలియకుండా అతని సుప్తచైతన్యం కరుణను వెంటాడుతూనే ఉంది.

సాయంత్రం కాఫీతాగి అలా షికారుకు బయల్దేరాడు మూర్తి. ఇంతలో నలుగురు మిత్రులుకూడా కలిశారు. అందరూ కలిసి ఏటిఒడ్డుకు వెడదామనుకొని బయల్దేరారు.

మిత్రులతో మాట్లాడుతూ వెడుతున్న మూర్తికి 'నమస్కారమండీ!' అనే గొంతు హఠాత్తుగా వినిపించేసరికి ఆ ప్రసార కేంద్రంవైపు చూశాడు... 'కరుణ.'

చిరునవ్వుతో, నిండైన ఆప్యాయతతో 'షికారుకు వెడుతున్నారా' అంది మళ్ళీ.

'అవునండీ' అని రాని నవ్వును తెచ్చుకుని మిత్రులతోబాటు కదలిపోయాడు మూర్తి.

అతని మనస్సులో మళ్ళీ కలవరం చెలరేగింది.

ఏమిటీ ధైర్యం ... ఏమిటీ ప్రవర్తన ఏమీ అర్థం కాలేదు.

మిత్రుల ముఖాల్లో చూపుల్లో ముసిముసి నవ్వుల పోకడలు కనిపించాయి మూర్తికి.

వాళ్ళతో వెళ్ళికూర్చున్నాడేగాని వాళ్ళ బాతాఖానీలో పాలు పంచుకోలేకపోయాడు.

ఒక రాయిని నీటిలోకి విసిరాడు. సమాంతర వృత్తాలుగా కదలిపోతున్న అలలను అలాగే చూస్తూ ఉండిపోయాడు.

'ఒరేయ్! చూడంగ్రా?! ఈ రోజు మనవాడు కరుణను లీనం చేసుకున్న బుద్ధమూర్తిలా జీవిత సమస్యకు పరిష్కారం వెతుకుతున్నాడు!' అని ఓ చణుకు విసిరాడో మిత్రుడు.

మిత్రుని మాటతో మూర్తి మనస్సులో గూడా అలలు చెలరేగాయి. ప్రతివృత్తంలోనూ కరుణ రూపమే కనిపించింది అతనికి.

మూర్తి ఇంటికి వచ్చేసరికి రాత్రి ఎనిమిది దాటింది. ఇంటి ముందుకొచ్చేసరికి తలుపు వేసి ఉంది. తలుపు మీద కొడుతూ 'సంధ్యా ... సంధ్యా...' అని పిలిచాడు. లోపలినుండి ఎవరూ పలుకలేదు. బిగ్గరగా పిలిచాడు. లాభంలేదు.

అంతవరకూ తాళం వేసుందేమోననే అనుమానమే అతనికి రాలేదు. ఆ చీకట్లో పైకి తడిమి చూశాడు. అంత లావు తాళం చేతికి తాకింది.

పక్కింటివారికి తాళాలిచ్చారేమో అడుగుదామనుకొని వెనక్కి తిరిగి ఓ సిగరెట్ ముట్టించాడు.

సిగరెట్ అంటుకున్న తర్వాత ఆర్పబోయిన అగ్గిపుల్లను అలాగే పట్టుకుని నిర్ఘాంతపోయాడు.

అగ్గిపుల్ల వెలుతురులో చిరునవ్వు నవ్వుతూ, తాళాలు చూపిస్తూ కరుణ కనిపించింది.


'మీవాళ్ళంతా సినిమా కెళ్ళారండీ. మీరొస్తే తాళాలిమ్మని సంధ్య నాకిచ్చిపోయింది. ఇవిగో' అంది తాళాలు అందిస్తూ.

'థాంక్సండీ.' అంటూ తాళాలు ఆమె చేతిలోనుండి తీసుకున్నాడు. ఆ తీసుకోవడంలో ఆమె మెత్తని చేయి మూర్తి చేతికి తాకింది. అతని శరీరంలో గగుర్పాటు కలిగి పరవశించిపోయాడు.

వెనకవైపున ఉన్న కరుణను చూస్తూనే ముందుకు తిరిగి తాళం తీశాడు.

అతని వెనుకనే కరుణ కూడా లోపలికి వెళ్ళింది. లైట్లు వేసే ఉన్నాయి. అతనో ఈజీచైర్లో వాలిపోతూ—

'చూశారాండీ ఇదీ అవస్థ: ఇంత ఆక



లితోవస్తే కలవంలో కీ ముద్ద వడవేయ డానికి ఎవరూ లేకుంటే ఎలా ఉంటుంది చెప్పండి' అన్నాడు.

'అవును బాధగానే ఉంటుంది. పోనీ మీకేమీ అభ్యంతరం లేకపోతే నేను వడ్డిస్తాను మీకు' అంది కరుణ.

'వొద్దండీ. మీకెందుకు కష్టం. తాళాలు కూడా మీరే తెచ్చారు. మీరు అనవసరంగా శ్రమ పడుతున్నారు' అన్నాడు సానుభూతితో.

'మీరు మరో భావంతో చెప్పినా నిజమే చెప్పారు. నాకు ఇతరులతో అవసరం కలిగి నప్పుడే వారికి సహాయపడడం నా మనస్తత్వానికి గిట్టనిది. సహాయం చేస్తున్నంత సేపూ 'అవసరం' మనల్ని వెక్కిరిస్తూనే ఉంటుంది' అంది కరుణ మూర్తి కళ్ళలోని భావాన్ని గమనిస్తూ.

ఆ మాటలకు మూర్తి ఏమీ సమాధానం చెప్పలేదు. కరుణే మళ్లీ ఇలా అంది.

'మరి మీరు పెళ్లెందుకు చేసుకోలేదు.'

కరుణ ఈ ప్రశ్న అడిగిన తీరు మూర్తికి గిలిగింతలు పెట్టింది.

'ఊరికేనే' అన్నాడు.

'అంటే.'

'అంటే...ఎలా చెప్పేది. ఏమీ లేందే ?'

'మీ వివాహ సమస్య అంత హేతువాదాని కందని రహస్యమా.'

'చంపేస్తున్నారు. అవేమీ కావండి. వీటికి అవకాశం ఇంకా రాలేదు. ఇంకా ఆ తలంపే రావడంలేదు.'

'చూస్తే అలా అనిపించరే మీరు' అంది నిలదీసి అడిగే చూపు చూస్తూ.

'నా బలహీనతేమైనా మిమ్మల్ని బాధిస్తే మీరు సీరియస్‌గా తీసుకోవద్దని కోరుతున్నాను.'

'తీసుకుంటే...' అంది సీరియస్‌గానే చూస్తూ.

మూర్తిలో అభిమానం చెలరేగింది.

'తీసుకుంటే...ఏం చేస్తాను ... తీసుకోండి. ఆ మాటకొస్తే మీరేం తక్కువ తిన్నారా' అన్నాడు తడబడుతూ తొందరలో.

ఆ మాట వినగానే కరుణ ఫక్కున నవ్వింది.

'ఎంత తిన్నానో, ఎలా తిన్నానో వివరంగా చెప్పగలరా' అంది నెమ్మదిగా.

'మీరు కూడా మొదట నన్ను......'

(వెనుక పేజీ చూడండి)

విద్యార్థి

తేజోవతి

సీరియల్



జరిగిన కథ

తల్లికి ఇష్టంలేకపోయినా ఎం. ఎ. లో చేరాడు విద్యార్థి. తన అన్నకూతురు లక్ష్మిని విద్యార్థి వివాహం చేసుకుని జీవితంలో స్థిరపడాలని ఆమె సంకల్పం. కాని, లక్ష్మి ఎవరినో ప్రేమిస్తున్నట్లు తెలుసుకున్న విద్యార్థి, మేనమామతో వాదం పెంచుకుని తిరిగి వచ్చేస్తాడు. మెడిసిన్ చదువుతున్న ఆనంద్ అతని రూమ్మేటు. అతని ద్వారానే సుందరి పరిచయమవుతుంది విద్యార్థి కి. మామయ్య అప్పు తీర్చేటప్పటికి బాంకులో డబ్బు అయిపోయింది. ఇక ముందు చదువుగతి ఏమిటని విచారంలో మునిగిపోతాడు విద్యార్థి. గదిలో జరిగిన దొంగతనంవలన వేరే గది తీసుకుంటాడు. నిత్యం కు అతన్ని పొదుపరిగా మారుస్తుంది. ప్రైవేటుగా ఎం. ఏ. చదివే జ్ఞానాంబతో అతని పరిచయం పెరుగుతుంది. లక్ష్మి మోస పోయిందని తెలుస్తుంది. జ్ఞానాంబ విద్యార్థిని బాగా ఆకర్షించింది. అందుకే చనువు పెంచుకో సాగాడు. జ్ఞానాంబ ఆశయం విన్న విద్యార్థి ఆశ్చర్యపోయాడు. జ్ఞానాంబ మాటలతో విద్యార్థి కి ధైర్యం వచ్చింది. లక్ష్మి తన కథంతా చెప్పింది జ్ఞానాంబతో. ముగ్గురూ ఒక్కటయ్యారు. కుటుంబానికి సంబంధించిన ఇబ్బందుల వల్ల విద్యార్థికి ఇంక చదవాలనిపించదు. కాని, జ్ఞానాంబ లక్ష్మిల బలవంతం మీద పరీక్షలకు కూర్చున్నాడు,

16

అనుకున్న ప్రకారమే ఆ ఆదివారం మధ్యాహ్నం వివేకబాబు, విద్యార్థి గదికి వచ్చి తలుపుతట్టాడు...అప్పటికే విద్యార్థి అన్ని సన్నాహాలూ పూర్తిచేసుకుని ఎదురు చూస్తున్నాడు ... గట్టిగా దబాయించగల కుర్రాళ్లని అయిదారుగుర్ని ఆ గది పరిస రాల్లో తచ్చాడు తుండమని చెప్పి వచ్చాడు, లక్ష్మికోసం కూడా అప్పుడే కబురు పెడ్తానన్నాడు విద్యార్థి...ఇప్పుడు కాదు. తర్వాత కబురు చెయ్యమని చెప్పాడు వివేకబాబు...

వాళ్ళు వెళ్లేసరికి కాఫీతాగి, సిగరెట్టు పొగరింగులు రింగులుగా వదులుతూ, కాబోయే అల్లుడు హోదాలో కూర్చుని వున్నాడు మధుబాబు...

మనిషి ఏమంతచాయ లేదు ... అంత భారీ విగ్రహం కూడా కాదు...కానీ ఆకర్షణ అంతా అతడి కళ్లల్లోనే వుంది···ఒకటికి పదిసార్లు కళ్ళు ఆర్పినా కళ్లవైపు చూస్తే చూపు మరల్చుకోలేని మెరుపో మత్తో ఏదో వుంది ఆ కళ్లల్లో...చిక్‌చిక్ మంటూ వెలుగుతూ ఆరిపోతుండే బల్బుల్లా వుంటయి ఆ కళ్ళు ... ఖరీదైన సిల్కుపాంటు మీద టెర్లిన్ బుష్‌షర్ట్ వేశాడు...బాగా ఆర్జిస్తున్నాడని తెల్పడానికి కావల్సిన సరంజామా అంతావుంది ఒంటి మీద...చాలా ఖరీదైన రిస్టువాచి...కళ్లకు కూలింగ్ గ్లాసెస్...

ఇంత టిప్‌టాప్‌గా వున్నవాడికి అద్దె గొట్టాల్సిన ఖర్మమేమి పట్టిందా అని విస్తుపొయ్యాడు క్షణంసేపు విద్యార్థి. బహుశా యిలాంటి వాళ్లకు ఎంత మందికి నామం పెట్టి యింత టిప్‌గా తయా రయ్యాడో అని సరి పెట్టుకున్నాడు...

'నా స్నేహితుడు విద్యార్థి ... అయినే మా కాబోయే బావగారు మధూగారు.' పరిచయం చేశాడు వివేకబాబు.

'నమస్కారం మధుబాబుగారూ...' అని చేతులుజోడిస్తూనే, 'మధుబాబుగార్ని మీరు పరిచయం చెయ్యాలానాకు? వారు అరండల్ పేటలో వున్నప్పుడూ నాకు తెల్సు...బ్రాడీ పేటలో వున్నప్పుడూ నాకు తెలుసు... మధూగారూ... నన్ను గుర్తుపట్టలేదా?' అని అడిగాడు విద్యార్థి చాలా చనువుగా...

'ఉహూ...సారీ అండీ...సారీ...నాకు... నాకు...' తడబడ్డాడు మధూ...ఎంత తన్ను కున్నా యీ ముఖంచూసినట్లు ఎక్కడా గుర్తు రావటంలేదు···

'అరె!···మీరీ వూళ్లో కొన్నాళ్లున్నారా! చెప్ప లేదేమండీ?' అన్నారు వివేకబాబు నాన్నగారు...

'అఁ...లేదండీ ... ఏదో కొద్దిరోజులు మాత్రమే ... కొద్దిరోజులు మాత్రమే...' కొంచెం యిబ్బందిగా ముఖంపెట్టి అన్నాడు ఏమనాలో తోచక నణుగుతూ...

'అదేమిటండీ యిక్కడ సంవత్సరన్నర పైనేవుండి, కొద్దిరోజు లంటున్నారు?... సరే నన్నే యీ మాత్రం గుర్తుపడితే యింక మిగతా స్నేహితులందర్నీ ఏం గుర్తుపడ్తారు?...వాళ్లందరూ మీకోసం కలవరిస్తున్నారు...రండి ఒకసారి వాళ్లం దర్నీ పలుకరించి వద్దురుగానీ...'

'ఓహో చాలాసుంది స్నేహితులున్నా రన్నమాట ... వెళ్లిరండి ... వాళ్లందర్నీ ఒక్కసారి పలుకరించి రండి.' అన్నారు వివేకబాబు నాన్నగారు...


'అహఁ...వద్దులెండి.తర్వాత...తర్వాత.. ముందు...ముహూర్తం...ఏదో మాట్లాడా లన్నారుగా...'అన్నాడు మధూ...

'బావగారు ... ఘట్టివారే ... ఎటూ పెళ్ళంటున్నారు ... ఫ్రెండ్స్‌ంతా పార్టీ అడుగుతారని భయం వేసింది కాబోలు...' పరియాచకం మొదలెట్టాడు వివేకబాబు...

'మేము మిమ్మల్ని పార్టీ అడుగం లెండి ... మేమే యిప్పిస్తాం...రండి ... అందరూ మిమ్మల్ని చూడాలంటుంటే..' బలవంతం చేశాడు విద్యార్థి...

'మావాళ్ళు సాయంత్రానికి గానీ రారు... ఈలోపల వెళ్లి వాళ్ళను కలుసుకొని రండి...పాపం వాళ్ళందరూ మీ కోసం వెయిట్ చేస్తున్నట్లున్నారు...' అన్నారు వివేకబాబు నాన్నగారు.

ఆయన అన్నిసార్లు చెప్పాక వెళ్ళకపోతే బాగుండదని లేచాడు మధుబాబు ... అసలు బయటికెళ్ళి యితడెవరో ఏమిటో కనుక్కో వాలనిపించిందతడికి... కానీ తీరా బయటికి



వచ్చేసరికి అక్కడ టాక్సీ వెయిట్ చేస్తోంది. తమతోబాటు వివేకబాబు కూడా టాక్సీ ఎక్కేసరికి అతడికి ఏం మాట్లాడ డానికీ తోచలేదు.

టాక్సీ వెనక సీట్లో ఒకవైపు విద్యార్థి, ఒకవైపు వివేకబాబు మధ్యలో మధూ కూర్చు న్నారు...మధూకి యిదంతా ఏదో కుట్రలా అనిపిస్తోంది. కానీ తేల్చుకోవాలంటే పక్కనే కాబోయే బావమరది!...సరే కానీ చూద్దా మనుకున్నాడు...

'మధూగారు ఫ్రెండ్స్‌ను త్వరగా మర్చి పొయ్యేట్టున్నారే?' అన్నాడు విద్యార్థి టాక్సీ బయలుదేరగానే...

'కానీ నా నిజమైన ఫ్రెండ్స్‌ను మాత్రం నేనెప్పటికీ మర్చిపోను' అని జవా బిచ్చాడు మధూ వెంటనే.

'అయితే లక్ష్మినిగూడా మర్చిపోయి వుండరనుకుంటాను.'

బాంబ్‌షెల్‌లా తగిలింది మధూకి ... అటు తిరిగివున్న వివేకబాబు యిటు తిరిగి చూశాడు...మధూ నల్లకళ్ళద్దాలు అతడి భావాలను కప్పేసినా, మనిషి జర్క్ యిచ్చినట్లు అవడం వివేకబాబు గమనించక పోలేదు.

మెల్లిగా తడారిన పెదాలను తడుపు కుంటూ...

'లక్ష్మి! ... లక్ష్మి ఎవరో నాకు తెలి యదే...' అన్నాడు మధూ.

'మరేలెండి. ఫ్రెండ్స్ జ్ఞాపకముంటా రన్నారుగానీ ప్రేమించినవాళ్ళు, పెళ్ళి చేసుకుంటామని మాట యిచ్చినవాళ్ళు జ్ఞాపకముండాలని రూలు ఎక్కడుంది! ... పోని ఒక్కసారి జ్ఞాపకం చేస్తాను. గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నించండి. లక్ష్మి... జయలక్ష్మి... పచ్చగా అపరంజిబొమ్మలా... అందాలభరిణెలా వుండేది...కాలేజీలో బి.ఎ. చదువుతుండేది ... మీరు అరండల్‌పేటలో వున్నప్పుడు పరిచయం చేసుకుని, అక్క డంతా రగడ కాకుండా వుండేందుకు బ్రాడీ పేటకు మకాం మార్చారు చూడండి... ఆ అమ్మాయి...జ్ఞాపకం వచ్చిందా?'

'ఏయ్ మిస్టర్! ... అసలు ఎవరు నువ్వు? ఏమిటీ నాటకమంతా? ... లక్ష్మి ఎవ్వరు? ... నాకు తెలియడమేమిటీ? ... మతుండే మాట్లాడుతున్నావా?' దూకుడుగా అన్నాడు మధు...

'నేనెవర్నో ముందే చెప్పానుకదండీ ... ఇక మతి అంటారా ? ఎవరికి మతి వుంటుందో...ఎవరికి పోతుందో కొద్ది నిము షాలు వోపిక పట్టండి... ఇంత చెప్పినా లక్ష్మి జ్ఞాపకం రాకపోతే ...ఆ అమ్మాయిని చూసిన తర్వాతైనా రాకపోదు. అప్పుడూ

ఖ్యాపకం రాకపోతే మీ చేత్తో మీరు స్వయంగా రాసిన వుత్తరాలు చూసిన తర్వాతైనా గుర్తుపట్టగలరేమో ఒక్కసారి ప్రయత్నించుదురుగాని...కాసేపు కూచోండి' కరుకుగా వున్నయి విద్యార్థి మాటలు...

మధూ గుండెలు వేగంగా స్పందించడం మొదలెట్టాయి ... ఏమిటి దంతా?... ఏమిటి జరగబోతోంది? ... అందులోనూ వివేకబాబు సమక్షంలో...పరిస్థితి అయోమయంగా వుందతడికి ... నిజంగానే మతి పోయేలా వుంది కూడా...

'అయితే మీరుచెప్పే లక్ష్మి మీ కేమవుతుంది? ... మీ కెలాంటి పరిచయం?' అట్నుంచి నరుక్కు వద్దామనుకున్నాడు మధూ...

'అబ్బే!...మీలాంటి పరిచయం కాదండీ మాది...రక్తసంబంధం ... అందుకే మీలా మర్చిపో లేకపోతున్నాను ... లక్ష్మి మా మేనమామకూతురు.'

'ఓహో అయితే యింకేం? ... లక్ష్మికి యింకో ప్రియులన్నమాట!...' దెబ్బ కొట్టాననే అనుకున్నాడు మధూ...

'లక్ష్మికి ప్రియుణ్నే అయ్యుంటే యింత కథ యింతదూరం ఎందుకు వచ్చేది?... లక్ష్మి మీ చేతిలో ఎందుకు పడేది?...లక్ష్మి మీ మాటలన్నీ నిజమని నమ్మి, అయిన సంబంధం తిరస్కరించింది... తండ్రితెచ్చిన యింకో సంబంధం కాదని తిరగ్గొట్టింది... మరి మీరేమో పేరుకూడా మర్చిపోతిరి!.'

మధూకి ఏమీ పాలు పోవటంలేదు ... ఇక బుకాయిస్తే లాభం లేనట్లుగా వుంది...అతడికి ఒక్కసారిగా ఆవేశం వచ్చినట్లయింది ...

'మిస్టర్! ఏమిటీ ఆగడమంతా?... ఆపండి...టాక్సీ ఆపండి ... నేను వెళ్లి పోలీసులకు ఫోనుచేస్తాను,' డోర్ హాండిల్ మీద చెయ్యివేస్తూ అన్నాడు మధూ...

చెయ్యి పట్టుకున్నాడు విద్యార్థి.

'మధూగారూ ... మీకంతగా పోలీసుల దగ్గరకు పోవాలనివుంటే మాకేం అభ్యంతరం లేదు. డైరెక్టుగా పోలీసుస్టేషనులో దింపమన్నా దింపుతాము. కానీ ... ఇక మీరు అక్కడే వుండిపోవల్సి వస్తుంది ... ఎందుకంటారా ... మీ సోకాల్డ్ బిజినెస్ వుంది చూశారూ ... దాని రహస్యాలన్నీ నాకు తెలుసు ... పైగా మీరు వ్రాసిన వుత్తరా

విద్యార్థి

లన్నీ లక్ష్మిదగ్గర చాలా పదిలంగా వున్నయి.'

చాలా తాపీగా చెప్పాడు విద్యార్థి...

హతాశుడయ్యాడు మధూ ... అతడికి వొణుకు పుడుతోంది. చెమటలు పడుతున్నయి... కూలింగ్‌గ్లాసెస్‌తీసి రుమాలుతో మొఖం తుడుచుకున్నాడు...వివేకబాబు తన కేమీ పట్టనట్లే రోడ్డుమీదకు చూస్తూ కూర్చున్నాడు...

'ఇంతకూ మీరెక్కడికి తీసుకు వెళ్తున్నారు నన్ను? ... ఏమిటి మీ వుద్దేశం?' ఆఖరు ప్రయత్నంగా శక్తినంతా కూడగట్టుకుని గద్దించాడు మధూ...

'అబ్బే!... యిందాకే చెప్పారు గదండీ... మీరు మర్చిపోయిన మీ ఫ్రెండ్‌ను చూపించడానికని...ఇక వుద్దేశమంటారా ... మీరిచ్చి మర్చిపోయిన వాగ్దానం వుంది చూశారూ. ఆ వాగ్దానాన్ని మీచేత నిలబెట్టించడానికి...అంతే...మీకేమీ హాని తలపెట్టం... దిగులుపడకండి.'

'అంటే ఆ అమ్మాయిని పెళ్లిచేసుకోమంటారా?...అసంభవం ...భ్రమరం వెయ్యి పుష్పాలమీద వాలుతుంది ... వాలిన ప్రతి పుష్పాన్ని అంటిపెట్టుకొని వుండమంటే సంభవమా?'...మధు ముఖం కందగడ్డలా మారింది...మాటలు కటువుగా వున్నాయి...

విద్యార్థి ఒక్కసారి పెద్దపెట్టున నవ్వాడు...యింకా నవ్వుతూనే...

'భేష్!...మంచివారండీ మీరు!...ఇందాక లక్ష్మి ఎవరో తెలియనే తెలియదన్నారు... యిప్పుడేమో మీరు ఆస్వాదించిన సవాలక్ష పుష్పాల్లో ఒకటి అంటున్నారు. బావుంది కానీ ... యిదివరలో ఎన్ని పుష్పాలను ఆస్వాదించి వాటి ఖర్మానికి వాటిని వది లేశారు? మా లక్ష్మి ఎన్నోపుష్పం? ఇక ముందు ఎన్నిటిని ఆస్వాదించబోతున్నారు? అయితే ఆస్వాదించబో యేముందే నేను నీ మధువు కోసమే వచ్చాను ... నా తృష్ణ తీరగానే వెళ్లిపోతానని చెప్పక నిన్నే అంటిపెట్టుకు వుంటానని ఎందుకు ప్రమాణాలు చేశారు?...ఇంకా ఎంతమంది పూలబాలలకు యిలాంటి ప్రమాణాలు చేశారో కూడా శలవిస్తే...ఆనందిస్తాం...' అన్నాడు విద్యార్థి.

వివేక బాబు నవ్వుతూ ఒక్కసారి తల తిప్పిచూశాడు ... విద్యార్థి మాటలకంటే వివేక బాబు నవ్వు శూలంలా గుచ్చుకుంది మధూకు. అతడేం మాట్లాడలేదు. వచ్చిన కోపాన్నంతా ఉచ్ఛ్వాస నిశ్వాసల్లో వదులుతూ బుసకొట్టే పాములా కూర్చున్నాడు.

ఇంతలో టాక్సీ యింటిముందు ఆగింది...ఇల్లు చూడంగానే మధు గుండెలు మరింత వేగంగా కొట్టుకున్నయి.

'దిగండి'...అన్నాడు విద్యార్థి.

మధు దిగలేదు... తీక్షణంగా చూశాడు విద్యార్థివైపు ... ఫ్రంట్‌సీట్లో డ్రైవరున్నాడు... ఒక తలుపుపక్క విద్యార్థి... మరో తలుపుప్రక్క వివేకబాబు ... అతడిదివరలో ఎన్నో విషమ పరిస్థితులలో చిక్కుకున్నాడు కానీ...యిలాంటి నిస్సహాయ స్థితిలోమాత్రం ఎప్పుడూ లేడు...

'మర్యాదగా దిగండి... లేకుంటే ఘల్లు గలాయన్ను పిలుస్తాను. మీ యిష్టం...' అన్నాడు విద్యార్థి.

పెద్దగా నిట్టూర్చి మారుమాట్లాడకుండా దిగాడు మధూ...విద్యార్థి తలుపు తాళం తీసి తియ్యగానే, ఎలాంటి బెదిరింపులూ అక్కరలేకుండానే లోపలికివెళ్ళి కూర్చున్నాడు.

వాళ్ళిద్దర్నీ కూర్చోపెట్టి, బయటకు వచ్చి, టాక్సీడ్రైవరుతో మాట్లాడి, పని పిల్లను లక్ష్మిదగ్గరకు పంపించి వచ్చాడు. అప్పటికే పదిహేనుమందిదాకా పోగయిన మిత్రబృందాన్ని ఏదో సాకున లోపలికి పిలిచి, మధూకి పరోక్షంగా హెచ్చరిక యిచ్చి వాళ్ళను మళ్ళీ అల్లంతదూరంలో వుంచాడు. అదయ్యాక ఫ్లాస్కులో కాఫీని వొంచి అతిథుల కిస్తుండగా దగ్గరగా వేసి వున్న తలుపుమీద 'టక్‌టక్'మని కొట్టిన చప్పుడయింది.

తలుపు దగ్గరికివెళ్ళి తెరుస్తూ, 'రా లక్ష్మీ' అన్నాడు.

'ఎందుకు బావా అర్జంటుగా రమ్మన్నావుట మధూ రాసిన వుత్తరాలు తీసుకుని?' బయటే నిలబడి అడిగింది లక్ష్మి లోపలికి రాకుండానే...

మధూకి కాఫీ సయించలేదు ... కాఫీ కప్పు గప్‌చిప్‌గా క్రిందపెట్టేసి తలవంచుకుని కూర్చున్నాడు పట్టుబడిపోయిన దొంగలా...

'లోపలికి రా లక్ష్మీ...' మళ్ళీ పిలిచాడు


సింథెల్
వ్యానిషింగ్ క్రీమ్
కలుగనే,
తళుక్కున మెరిసే
ఆ సౌందర్యం కోసం


Cinthelle
Vanishing Cream
by Godrej

విద్యార్థి

విద్యార్థి:

'మళ్ళీ లోపలికెందుకులే బావా ... ఇంట్లో జ్ఞానాంబగారు కూడా లేరు. నీ చీటీ చూసి తలుపు తాళంపెట్టి వచ్చేశాను. ఏమిటో చెప్పు. త్వరగా వెళ్ళాలి' అంది లక్ష్మి.

'ఒక్కసారి లోపలి కడుగుపెట్టి చూడు లక్ష్మీ' అన్నాడు విద్యార్థి.

లక్ష్మి లోపల కడుగు పెడ్తూనే మధూని చూసి, 'మధూ!' అంది నిర్విణ్ణురాలై...

'మధూగారూ! ... యిదివరలో మీరు నన్ను ఎరిగున్నారా?' విద్యార్థి మధూ కళ్ళల్లోకి చూస్తూ సూటిగా ప్రశ్నించాడు.

మధూ తన అక్కసునంతా వెళ్ళబోసుకుంటూ,

'విన్నా! ... కనీసం నీ మొహాన్నికూడా చూడలేదు. మోసంచేసి యిక్కడికి తీసుకు వచ్చావు.' అన్నాడు.

'చూడు లక్ష్మి...ఆనాడు అనవసరంగా నామీద అభాండం వేశావు ... అన్నమాట ప్రకారం తీసుకు వచ్చాను. ఇదుగో నీ మధూ...'

లక్ష్మికి విద్యార్థి మాటలు వినబడటం లేదు. మొదట ఆశ్చర్యంతో పెద్దవైన ఆ కళ్ళల్లో క్రమక్రమంగా కోపం తావు చేసుకుంది. క్షణంలో రెండు కళ్ళూ నిప్పులు కురిపిస్తున్నయి.

'ఏం మధూ బాబూ జ్ఞాపకమున్నానా?' తీక్షణంగానే అడిగింది.

మధూ జవాబు చెప్పకుండా తలొంచుకున్నాడు ...

వివేకబాబు లక్ష్మి కోపంలోని నిజాయితీని పరిశీలనగా చూస్తూ కూర్చున్నాడు.

'అబ్బే! ఆయనకు నీ పేరుకూడా జ్ఞాపకం లేదు ... పాపం పెళ్ళికొడుకు కాబోతున్నాడులే...ఇలాంటివి ఏం జ్ఞాపకముంటయి?' అన్నాడు విద్యార్థి...

'పెళ్ళి చేసుకోబోతున్నారా?...పెళ్ళి!... ఏం ఏ అమ్మాయైనా కోరిక కట్నం, తండ్రి ఆస్థిలో వాటా తెస్తోందా?...' కడుపులో దాచుకున్న అసహ్యాన్నంతా వెళ్ళగక్కుతున్నట్లున్నయి ఆ మాటలు.

'అదేమిటి లక్ష్మి?' అన్నాడు విద్యార్థి ఆశ్చర్యంగా ...

'అదంతేలే బావా... నీకేం తెలుసు ... పిలిచి పిల్లనిచ్చి లక్షల కధిపతిని చేస్తానని మేనమామ అంటే వద్దని వచ్చిన వాడివి నువ్వు ... నీకు జ్ఞానాంబలో అందం అక్కరలేదు. ఆస్థి అక్కరలేదు ... గుణముంటే చాలన్నావు...కానీ పాపం మధూగారికి ... ఏమున్నా లేకపోయినా ఆస్తి, అందం వుంటే చాలు...మా నాన్నగారి పేరు వినగానే ప్రేమలో పడ్డారు. పెళ్ళి చేసుకుందా మనుకున్నారు...నాన్నగారితో నేను తగూలాడి వచ్చేశానని, ఆయన ఆ స్థితిలో ఒకవేళ ఆయన భాగం యిస్తానన్నా నాకు అక్కరలేదని నేనన్న రోజున, ఆయన ప్రేమ...గాలికి ఎగిరిపొయ్యే పేలపిండిలా ఎగిరిపోయింది ... లక్ష్మి సమేతంగా రావియా 'జయ' ఆయనకు అక్కరలేదు ... కావాలంటే ఆయన్నే అడుగు ...'

'ఏం మధూగారూ.. ఇదివరలో లక్ష్మికిచ్చిన మాట నిలబెట్టుకుంటారా?...నిలబెట్టుకుంటామంటే ... రండి...ఇంతకంటె మంచి రోజులేదు. టాక్సీ బయట సిద్ధంగా వుంది...కాకాని గుళ్ళో పెళ్ళి చేసుకుందురు గాని...' అన్నాడు విద్యార్థి.

'కానీ...యింకో అమ్మాయితో పెళ్ళి నిశ్చయమై పోయింది ... తీరా యిప్పుడు కాదంటే ... యింతదూరం వచ్చి పెళ్ళిందుకు ఆగిపోయిందని...ఆ అమ్మాయి జీవితం నవ్వులపాలు కాదా?...' ఇప్పటికి మాట పెగల్చుకుని అన్నాడు మధూ.

'మరి భ్రమరంలా మధువును జుర్రుకున్నారే?' ఈ అమ్మాయి మాటేమిటి?' విద్యార్థి సూటిగా అడిగాడు...

మధూ ఒక్క నిమిషం మాట్లాడలేదు...ఆ తర్వాత

'పెళ్ళికాకముందే నాకు లొంగిపోయిన పిల్ల...మరెందరితో...'

ఆమాట పూర్తి కాక మునుపే 'షటప్!' అంటూ సింహంలా మీద కురికాడు విద్యార్థి...మెరుపులా వచ్చి లక్ష్మి అడ్డుకోకపోతే మధూ చెంప 'ఫెడీలు' మనేదే...

'ఊరుకో బావా...వూరుకో... కాని— మధూగారూ.. జన్మలో ఒక్కసారి మీలాంటి వాళ్ళదగ్గర గుణపాఠం నేర్చుకున్న పిల్ల... యింకోసారి యిలాంటి బుద్ధి తక్కువ పనులు చెయ్యదు ... థాంక్యూ మిస్టర్ మధూ! జీవితాంతం దాకా పనికివచ్చే గుణపాఠం నేర్పారు మీరు ...'

'ఇదుగో... మిస్టర్ మధూ! ఆఖరు సారిగా చెబుతున్నాను ... మీరు మాట యిచ్చిన ప్రకారం లక్ష్మిని పెళ్ళిచేసుకు తీరాలి. అప్పుడు అమాయకురాల్నిచేసి లక్ష్మి దగ్గరనుండి తప్పించుకు పొయ్యారు. కాని యిప్పుడు మానుండి మాత్రం తప్పించుకు పోలేరు.' విద్యార్థి వార్నింగ్ లాగా యిచ్చాడు...

'చేసుకోకపోతే?' మధూ ప్రశ్న.

'చేసుకోకపోతే...' పళ్ళు పటపట కొరికాడు విద్యార్థి... 'మాశారుకదా యిందాక కుర్రాళ్ళను...ఎత్తి టాక్సీలో పడేసి, తీసుకెళ్ళి పెళ్ళిచేస్తాం. అందుకే రెడీగా ఒక



[illegible]

ఫోటోగ్రాఫరును కూడా ఏర్పాటుచేసి వుంచాను... ఫోటోలు తీయించి అన్ని పేపర్లలో వేయిస్తాను ... ఈ పెళ్ళిని ఎలా కాదంటారో అప్పుడు నేనూ చూస్తాను.'

మధూకి ఏమీ పాలుపోలేదు ... ఏమిటీ బలవంతం ?...తను యిక లక్ష్మిని పెళ్ళి చేసుకోక తప్పదా? ... బోలెడు కట్నంతో పిల్ల వస్తోంది...యిక తన బిజినెస్ మూడు పువ్వులూ ఆరు కాయలుగా సాగిపోతుందనుకుంటే శనిగాడులా వీడొకడు దాపురించాడు! ... మధూ ఆలోచనలో పడిపోయ్యాడు ...

ఇంతసేపూ మధూ ముఖకవళికల్ని పసిగడ్తూ నిలబడిన లక్ష్మి, మధూవాలకాన్ని, విద్యార్థి ఆవేశాన్నిచూసి చిన్నగా నవ్వుతూ,

'బావా ... నీ బలవంతం మీద మధూగారు నన్ను పెళ్ళి చేసుకోడానికి ఒప్పుకుంటారేమో గాని ... నేనుమాత్రం యీ పెళ్ళికి వొప్పుకోను.' అంది...

'లక్ష్మీ!...' పిడుగు పడ్డట్లుగా అరిచాడు విద్యార్థి ...

ఇంతదాకా తలవంచుకొని అందరి సంభాషణలూ వింటున్న వివేకబాబు ఒక్కసారి లక్ష్మి ముఖంలోకి చూశాడు ఆసక్తిగా...

ఒక్క మధూ మాత్రమే మరీ యిదిగా తలవంచుకున్నాడు భూమిలోకి కృంగిపోతున్నట్లు ...

'అవును బావా ...నేనతన్ని పెళ్ళి చేసుకోను ... నేను దేవతను కాను బావా ... మామూలు ఆడపిల్లను ... ప్రేమా—పగా, దయా—ద్వేషం, అభిమానం — అసహ్యం వున్న మామూలు ఆడపిల్లను! ... నన్ను ప్రేమిస్తే నేను ప్రేమిస్తాను ... నన్ను మోసం చేసిన వాళ్ళను ప్రేమించలేను బావా...అంతకంటె నా జీవితాన్ని యిలాంటి మోసగాళ్ళ చేతిలో పెట్టలేను.' అంది నిశ్చలస్వరంతో...

'మరి ... మరి నీ జీవితం లక్ష్మీ?' యింకా ఆ విభ్రాంతినుండి తేరుకోకుండానే అడిగాడు విద్యార్థి.

'అయితే యీయన చేతుల్లో నా జీవితం సురక్షితంగా వెళ్ళిపోతుందనుకుంటున్నావా బావా?...బలవంతాన తాళికట్టినవాడు ... రేపు యింకో శ్రీమంతుల అమ్మాయి కనబడితే ... నన్ను నట్టేట ముంచి పోడని నమ్మకమేమిటి?...అప్పుడింకా పిల్లా జల్లలతో నానా అగచాట్లూ పడవద్దా? ... వొద్దు బావా...వొద్దు...నన్నిలా బ్రతకనీ' అంది దృఢసంకల్పాన్ని వ్యక్తంచేస్తూ ...

'భేష్! లక్ష్మీగారూ!... మీ నిర్ణయం నాకు చాలా బాగా నచ్చింది...' అన్నాడు వివేకబాబు.

'అలాగని...మిస్టర్ మధూ!...నా జీవితాన్ని నాశనం చేసి మీరు సుఖపడగలమని అనుకోవద్దు... ఇవిగోండి ... మీరు వ్రాసిన వుత్తరాలు, నా దగ్గరే వున్నాయి. ఇక ముందు మీరు మభ్యపెట్టి ఏ ఆడపిల్లనూ పెళ్ళి చేసుకోగలననుకోకండి. మీకంటే ముందే వెళ్ళి, మీ గురించి చెప్పేస్తాను... అన్నీ తెలిశాక ఆ పిల్ల ఒప్పుకుంటేనే మీ పెళ్ళి జరుగుతుంది...'

'మీ కభ్యంతరం లేకపోతే లక్ష్మిగారూ... ఒక్కసారి ఆ వుత్తరాలు యిస్తారా?' అని అడిగాడు వివేకబాబు.

లక్ష్మి వుత్తరాల కట్టను అతడి చేతిలో పెట్టింది.

వివేకబాబు, కట్టను తొడమీద పెట్టుకుని, ఒక కవరు తీసి...

'అవును ... యిది మధూగారి హాండ్ రైటింగే...' అంటూండగా,

'ఏవీ?...' అంటూ ఠపాలున ఆ వుత్తరాలకట్టను లాక్కోబొయ్యాడు మధూ...

'మిస్టర్ మధూ!' మెరుపులా అతడి

పాపపుణ్యాల అనుభవం



ధర్మపథం—బుల్లుసు వేంకటరమణయ్య

తన సోదరులూ, ద్రౌపదీ మార్గ మధ్యంలో విగతజీవులయి పడిపోయినా, ధర్మరాజుమాత్రం స్వర్గానికి వెళ్ళగలిగాడు. మొదటినుంచీ వారివెంట వస్తున్న శునకం అతనితో ఉన్నది. ఇంద్రుడు అతన్ని మర్యాదగా ఆహ్వానింపగా, ఆ కుక్కను మొదట గౌరవించాలనీ, అంత వరకూ తన కెట్టి సుఖాలూ అక్కర్లేదనీ అన్నాడు. దానికి ఇంద్రుడు మెచ్చుకున్నాడు. ఆ శునకం నిజస్వరూపంతో యముడుగా మారి యుధిష్ఠిరుణ్ణి అభినందించాడు.

ఆ తర్వాత కూడా ధర్మరాజు స్వర్గ సౌఖ్యాలను అనుభవించడానికి వెంటనే సమ్మతించలేదు. 'నావాళ్లు ఎక్కడ ఉన్నారో, మొదట వాళ్లను చూడాలి. ఆ తర్వాత గాని, నాకీ మర్యాదలు సమ్మతాలు కావు' అని అన్నాడు. ఇంద్రుడు, ధర్మరాజును తనవారి దగ్గరకు తీసుకుని వెళ్లడానికి కొందర్ని పంపాడు. వారితో నారదుడు కూడా వెళ్లినాడు.

దేవతలతో వెళ్ళుతున్న ధర్మరాజుకు మొదట దుర్యోధనుడు కనబడ్డాడు. అక్కడ కూడా అతని రాజభోగాలు, ఠీవి తగ్గలేదు. దాసదాసీజనాల పరిచర్యలు స్వీకరిస్తూ, సుఖంగా ఉన్నాడు. అతన్ని చూడగానే ధర్మరాజుకు అసూయ కలిగింది. తన సోదరులకంటె ముందు అతడు కానరావడాన్నీ, అతడు సౌఖ్యాలను అనుభవించడాన్నీ సహించలేకపోయాడు, ధర్మరాజు. అప్పుడు నారదుడు 'ఓ యుధిష్ఠిరా! ఈ లోకానికి వచ్చినా, నిన్ను రాగద్వేషాలు విడువలేదా? వాటికి ఇక్కడ స్థానం లేదు' అని అన్నాడు.

తర్వాత వారందరూ దుర్గంధపూరితమైన ప్రదేశంలోంచి ప్రయాణం చెయ్యవలసి వచ్చింది. ఎన్నో రోదనధ్వనులూ, హాహాకారాలూ, అతనికి వినబడసాగినవి, వారు యమలోకానికి వెళ్లారన్నమాట! అక్కడివారు పడుతున్న బాధలు ధర్మరాజు చూడలేకపోయాడు. కొంతదూరం పోగా—అతనికి బాధలతో మూలుగుతున్న తన సోదరులు కనబడ్డారు. ధర్మరాజుకు మూర్ఛ వచ్చినట్లయింది.

కొంతసేపటికి తెలివి తెచ్చుకొని 'ఇదేనా ధర్మం? ఇదేనా న్యాయం? మా రాజ్యాన్ని మోసంచేసి అపహరించి, ద్రౌపదిని అవమానపరచి క్షత్రియనాశానికి కారణమైన దుర్యోధనుడు సుఖాలనుభవించడం న్యాయమార్గాన్ని అనుసరించిన పాండవులు నరకబాధలు పడడం న్యాయమేనా?' అని గట్టిగానే అన్నాడు

అప్పుడు దేవత ఇలా అన్నాడు. 'అయ్యా! తొందరపడకు. ప్రతి ప్రాణి పుణ్యంతోపాటు పాపం చెయ్యడం, సహజం. వాళ్లలో భేదం ఉంటుంది. పుణ్యంపాలు ఎక్కువగా, పాపంపాలు తక్కువగా ఉన్నవారు మొదట పాపఫలాన్ని అనుభవించి, ఆమీద స్థిరమైన స్వర్గసౌఖ్యాన్ని అనుభవిస్తారు. పాపంపాలు ఎక్కువ, పుణ్యంపాలు స్వల్పంగానూ ఉన్నవారు మొదట స్వల్పకాలం సుఖాలను అనుభవించి, ఆ తర్వాత స్థిరంగా నరకవాసం అనుభవిస్తారు. మీ సోదరులు ప్రస్తుతం బాధ పడుతున్నా, పాపఫలం అనుభవమయ్యాక స్థిరమైన సుఖాన్ని అనుభవిస్తారు. అందువల్ల వు ఎంతమాత్రం విచారించవద్దు. నీకు కూడా కొంచెం పాపఫలం అనుభవించవలసి ఉండినది. అందువల్లనే నీకు నరకాన్ని చూపించాం. నీ పాపఫలం తీరిపోయింది. ఇక స్వర్గానికి వచ్చి సుఖాలు అనుభవించు.'

ఇలా చెప్పి అతణ్ణి తృప్తిపరిచి తిరిగి స్వర్గానికి తీసుకొని వెళ్ళారు. ●

విద్యార్థి

చెయ్యిపెట్టేసి, ఉత్తరాలకట్టను లాక్కుని, ఒక్కసారి గర్జించాడు వివేకబాబు,

'జాగ్రత్తగా ప్రవర్తించండి ... పిచ్చి పిచ్చిగా ప్రవర్తించారంటే ... గుంటూరు ఎల్లలు దాటరు... జ్ఞాపకం పెట్టుకోండి' అన్నాడు.

'మీరూ మీ చెల్లెలు భవిష్యత్తు గుర్తు పెట్టుకోండి...ఇప్పుడు నేను కాదంటే ... మీ చెల్లెలు జీవితం ఎంత అల్లరిపాలవుతుందో గ్రహించారా? ... మీ చెల్లెలికి ఇక జన్మలో పెళ్ళవుతుందేమో ... ఆలోచించండి' అన్నాడు మధూ కోపంతో వూగిపోతూ...

'హుం...బెదిరిస్తున్నారా?.. ఈ తాటాకు చప్పుళ్ళకు బెదురుతామనుకున్నారా ? ... లక్ష్మిగారూ ... మీరొక్కరేకాదు ... నేను కూడా యిటగాడు మళ్ళీ మళ్ళీ యిలా ప్రవర్తించకుండా నిఘావేసి వుంచుతాను... ఇలాంటివాళ్ళు తప్పక శిక్ష అనుభవించాల్సిందే ... విద్యార్థిగారూ ... మీకు చాలా థాంక్స్ ... మాకు మహోపకారం చేశారు... ఇక వస్తాను ... నాకోసం యింట్లో అంతా ఎదురుచూస్తుంటారు...మిస్టర్ మధూ!... మీ రిటునుండీ యిటే వెళ్ళిపోవడం వుత్తమం ... మా నాన్నగారికి కోపంవస్తే పట్టలేము' అంటూ లేచాడు వివేకబాబు, వుత్తరాలకట్ట లక్ష్మిచేతికి తిరిగియిచ్చేస్తూ.

'లక్ష్మి ... నా వుత్తరాలు నాకిచ్చెయి... నువ్వురాసిన వుత్తరాలు కూడా తగలపెట్టేస్తాను' అన్నాడు మధూ ప్రాధేయపడుతున్నట్లు నటిస్తూ...


'ఫరవాలేదు మధుగారూ ... నా వుత్తరాలు నాకిచ్చెయ్యండి...అప్పుడు నేను కూడా మీటిని తగలపెట్టేస్తాను.'

'పోనీ పోస్టులో పంపిస్తాను.'

'అలాగే...మీ పోస్టు అందున్నాక, నేనూ మీటిని పోస్టులోనే పంపిస్తాను.'

ఇక మాట్లాడలేదు మధు... విసుగ్గా లేచి వెళ్ళిపోయాడు.

(ఇంకా ఉంది)



BD. 5117 A

మీ అందముయొక్క ముచ్చటైన వివిధ రూపములు

మీకే ప్రత్యేకముగా బొంబే డైయింగ్ వారు వారి క్రొత్త రకములు చీరలను అందచేస్తున్నారు. మృదువైన, వనితల అందమునకు వన్నెయిచ్చే 100% 'టెరీన్'. జరజరలాడే 'రేలిక' బొంబే డైయింగ్ వారి ప్రత్యేకమైన ముడుతలుపడని నూలు చీర, కట్టుకొందుకు చక్కగా ఉంటుంది. ముచ్చటవేసే స్విస్ వాయిల్స్. చల్లని, హుందాయైన వాయిల్స్. కళ్లు చెదరే రంగులలో అధమం 100 వివిధ డిజైనుల రకములనైనా మా ప్రత్యేకమైన షాపులలో దేనిలోనైనా చూడండి.

బొంబే డైయింగ్

మావలె మరెవ్వరూ:
వనితాభీష్టమును గ్రహింపజాలరు.

సినిమా

కొడుకు—కోడలు

పద్మశ్రీ పిక్చర్స్ ఈస్ట్‌మన్‌కలర్‌లో నిర్మిస్తున్న చిత్రానికి 'ప్రేమకోసం' అన్న పేరును మార్చి, 'కొడుకు— కోడలు' నామధేయాన్ని స్థిరపరిచారు. అనేక విజయవంతమైన చిత్రాలను సృష్టించిన పి. పుల్లయ్యకి యిదొక లెక్కా? రషస్ చూసిన వాళ్ళు 'ఒహో, ఆహా' అంటున్నారు.

ఈ చిత్రానికి ఆచార్య ఆత్రేయ రచన్ను, కె. వి. మహదేవన్ సంగీతాన్ని, కె. ఎస్. ప్రసాద్ ఛాయను, కృష్ణారావు కళను నిర్వహిస్తున్నారు. పద్మశ్రీ నిర్మించే పదవ చిత్రం యిది. ముఖ్యపాత్రలను ఎస్వీరంగారావు, గుమ్మడి, సత్యనారాయణ, రాజబాబు, శాంతకుమారి, నిర్మల, రమాప్రభ పోషిస్తున్నారు. ఎన్టీఆర్ కొడుకుగా ఏ. ఎన్. ఆర్., కోడలుగా వాణిశ్రీ నటిస్తున్నారు. డాక్టరుగా జగ్గయ్య, నర్సుగా లక్ష్మి కనిపిస్తారు. ఈ చిత్రం అవుట్‌డోర్ దృశ్యాలు వూటీ, వైగై, కొడై కెనాల్‌లో చిత్రీకరింపబడ్డాయి. డిశంబరులో శ్రీ ఫిలింస్ ద్వారా యీ చిత్రం విడుదలవుతుంది.

జెమినీలో వాణిశ్రీ

హిందీలో బహుళ ప్రజాదరణపొంది, సిల్వర్ జూబ్లీ జరుపుకున్న 'ఆరాధన' చిత్రాన్ని, జెమినీ సంస్థ తెలుగులో నిర్మిస్తారట. శర్మిలా వేషాన్ని, వాణిశ్రీ ధరిస్తుంది. 1973 లో షూటింగు ప్రారంభమవుతుంది. శోభన్ కథానాయకుడు.

సంఘంలో జమున

లోగడ ఏ. వి. ఎం. 'సంఘం' పేరిట ఒక చిత్రాన్ని నిర్మించి యున్నారు. అది అనేకచోట్ల శతదినోత్సవం జరుపుకుంది.


ఇప్పుడు సుభాషిణి ఆర్ట్ పిక్చర్స్ అక్టోబరులో ప్రారంభించబోయే సాంఘికానికి 'సంఘం' పేరును స్థిరపరిచారు. ఆ కథకి, యీ కథకి ఎలాంటి పోలికలు వుండవు. కథానాయకి జమునకి వెరైటీపాత్ర దొరికింది. నాయకుడు కృష్ణంరాజే.. మాటలను భమిడిపాటి, సంగీతాన్ని టి. వి. రాజు నిర్వహిస్తారు. నిర్మాత, దర్శకుడు కె. హేమాంబరధరరావు.

* * *

'వింత దంపతులు' అయిదారు కేంద్రాల్లో అర్ధ శతదినోత్సవం జరుపుకుంటుంది. ఈ చిత్రం మరింత బాగా ప్రదర్శింపబడి యుండేది. ఒకే సమయంలో మూడు చిత్రాలు దీనిపై పడ్డాయి. అయినప్పటికీ, ప్రజాదరణ పొంది, మంచి చిత్రం అన్న పేరును సంపాయించింది. ఈ సీజన్‌లో విడుదలైన చిత్రాల్లో 'వింత దంపతులు' యావరేజ్‌గా పోయింది.

వాసంతి చిత్రంలో కృష్ణంరాజు

'వింత దంపతులు' చిత్రం కృష్ణంరాజుకు కొత్త మార్కెట్టును తెచ్చిపెట్టింది. అంతవరకు విలన్ పాత్రలను పోషించిన కృష్ణంరాజుకు 'వింతదంపతులు'లో కథానాయకుడి వేషం లభ్యం కావడం, లభించిన పాత్రను ప్రతిభావంతంగా పోషించడం, తత్ఫలితంగా హీరోల లిస్టులో చేరడం పాఠకులకు తెలియనది కాదు.



'మాతృమూర్తి'లో రాజ్‌బాబు, రమాప్రభ.

ప్రస్తుతం దేవిక చిత్రంలో కృష్ణంరాజు హీరో పాత్రను పోషిస్తున్నారు. పూర్ణామూవీస్‌లో నాయకుడీయనే.


నటి, నిర్మాత వాసంతి తయారు చేస్తున్న చిత్రంలో జమున సరసన, కృష్ణంరాజు నటిస్తున్నారు. ఈ చిత్రానికి కె. బాపయ్య దర్శకుడు.

అక్టోబరులో కులగౌరవం


మీ అభిమాన సంస్థ నిర్మించిన చిత్రంయిది. ఎన్టీరామారావు మూడు పాత్రలను నిర్వహించిన చిత్రం యిది. కొత్తనటి ఆరతి, రామారావు సరసన నటించింది. కథానాయికగా జయంతిని చూస్తారు. ఒకే వ్యక్తి తాత, తండ్రి, మనవడుగా నటించడం అంటే మాటలా? ఎన్టీఆర్ మూడు పాత్రలకున్న వ్యత్యాసాన్ని అత్యద్భుతంగా చూపించారట. ఈ చిత్రంపై ప్రేక్షకులు కొండంత ఆశపెట్టుకున్నారు. దర్శకుడు: పేకేటి., విడుదల: విజయ.


అక్కినేని కొత్త చిత్రం

'బుద్ధిమంతుడు' చిత్రాన్ని నిర్మించిన చిత్రకల్పనకి నవంబరు నుండి, అక్కినేని కాల్ షీట్లు యిచ్చారు. 'సంపూర్ణ రామాయణం' లాంటి దృశ్య కావ్యాన్ని చిత్రీకరించిన బాపు యీ చిత్రానికి దర్శకుడు. కథ, మాటలను ముళ్ళపూడి, సంగీతాన్ని మహదేవన్ నిర్వహిస్తారు.



'విచిత్రబంధం'లో నాగేశ్వరరావు, మాస్టర్ రమేష్.


స్ఫూర్తినిస్తుంది వీవా
ViVA
The Double-Action Health Drink
FORTIFIES YOU FOR THE DAY...
RELAXES YOU FOR THE NIGHT



'రామరాజ్యం'లో బాబూరావు, సావిత్రి, జగ్గయ్య, ప్రభాకర్, రోజారమణి.

సినిమా

భద్రాచలం షూటింగు

ఈ చిత్రం అవుట్‌డోర్ షూటింగు నెలరోజుల పాటు భద్రాచలం సమీపాన జరుగుతుంది.

పి. ఏ. పి. ప్రారంభం

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్‌వారు కూడా నవంబరులో షూటింగును ప్రారంభిస్తారట. నాగేశ్వరరావు— జయంలిత ముఖ్యపాత్రధారులు. మాటలను భమిడిపాటి వ్రాశారు. దర్శకుడు: ప్రత్యగాత్మ. నిర్మాత: ఏ. వి. సుబ్బారావు. విడుదల: నవయుగ.



'కాలంమారింది'లో గీతాంజలి.

నాగేశ్వరరావుతో మంజుల

విజయభట్ మూవీస్‌వారి షూటింగు కూడా నవంబరులో ప్రారంభం అవుతుందట. తాతినేని రామారావు దర్శకత్వంలో అక్కినేని, మంజుల నటిస్తారు. ఎస్. ఎన్. భట్ నిర్మించే యీ చిత్రానికి అన్నపూర్ణా పంపిణదారులు.

అంటరాని పిల్లకు విప్రుని అభయం

మమత ప్రొడక్షన్స్‌వారి 'కాలం మారింది' షూటింగు పూర్తయింది. పత్రికా రచయిత వాశిరాజు ప్రకాశం నిర్మించిన యీ చిత్రానికి కె. విశ్వనాథ్ దర్శకుడు.

'మనిషి మనుగడకు మనోనైర్మల్యం, సహృదయం ప్రధానమేగాని కులం, మతం గాదు' అనెడి నీతిని ప్రబోధించే కథ యిది. పూజ్య బాపూజీకి అంకితం అయ్యే చిత్రం యిది.

అంటరాని పిల్లగా శారద, ఆమెకు అభయప్రదానం చేసిన విప్రకుమారుడిగా శోభన్ నటించారు. ముఖ్యపాత్రలను గుమ్మడి, అంజలీదేవి, సూర్యకాంతం, పుష్పకుమారి, గీతాంజలి, రావి కొండలరావు, చంద్రమోహన్, సాక్షిరంగారావు, రావు గోపాలరావు, పొట్టి ప్రసాద్ పోషించారు. ఈ చిత్రంలో ఎం. ఎల్. ఏ. ఏకాంబరం పాత్ర మెచ్చదగిన విధంగా సృష్టించబడింది. ఈ చిత్రానికి బొల్లిముంత మాటలను, రాజేశ్వరరావు సంగీతాన్ని సమకూర్చారు. అక్టోబరులో లక్ష్మి ద్వారా విడుదల అవుతుంది.

పండంటికాపురంలో వహీదా రెహ్మాన్

హీరో కృష్ణ, ఏనస్ పిక్చర్స్ అధినేతలు కలిసి 'పండంటికాపురం' చిత్రాన్ని హిందీలో నిర్మిస్తున్నారు. జనవరి నెలలో షూటింగు ప్రారంభమవుతుంది. ఈ చిత్రానికి ఆదుర్తి సుబ్బారావు దర్శకుడు. ప్రధాన పాత్రలను ఓం ప్రకాష్, జితేంద్ర, వహీదారెహ్మాన్, నూతన్, రాధాసలూజా పోషిస్తారు.

నూరురోజుల పండుగ

ఉషశ్రీవారి 'మానవుడు— దానవుడు' ఏడు కేంద్రాల్లో వంద రోజులు ప్రదర్శింపబడింది. శతదినోత్సవ సభ గుంటూరు సరస్వతి పిక్చర్ ప్యాలెస్‌లో జరిగింది. ఈ సభకి ఆంధ్రప్రదేశ్ ఆర్థికమంత్రి అనగాని భగవంతరావు అధ్యక్షత వహించారు. గుంటూరుజిల్లా కలెక్టర్ సతీమణి అరుణా జయ భారత్‌రెడ్డి బహుమతీ ప్రదానం చేశారు.

'గుంటూరు నా జన్మస్థలం గావడంచేత, నాకు (చిత్రానికి) జరిగే గౌరవం, పురవాసులందరికీ చెందాలన్న తలంపుతో, ఫంక్షన్ను అక్కడ జరిపాను' అన్నారు చిన్నపరెడ్డి.

నాటకానుభవం లేని నాయకుడు

ఉషశ్రీవారి 'ప్రేమ పక్షులు' షూటింగు అక్టోబరు 15 న ప్రారంభ మవుతుంది. ఈ చిత్రంలో హీరో పాత్రను ప్రకాష్ అన్న కొత్త యువకునికి దర్శకుడు చిన్నపరెడ్డి యిచ్చారు.

నాయక పాత్రధారి ప్రకాష్‌ని ఉషశ్రీ ఆఫీసులో కలిశాను. రూపం, విగ్రహం బాగానే వుంది. ఇంకా చదువు పూర్తి కాలేదు. ఇంతవరకు ఒక్క నాటకంలో కూడా నటించలేదట. ఇదే మొదటి అనుభవం అని తెలుసు కున్నాను. ఇతగాడితో చంద్రకళ, విజయలలిత పోటీ పడతారు. మొదటిఛాన్సు భలేఛాన్సు. ఇద్దరందగత్తెలతో రొమాన్స్!

కృష్ణద్వయం

'ప్రేమ పక్షులు' చిత్రంలో కృష్ణకుమారి, కృష్ణంరాజు లున్నారు. హాస్యబ్రహ్మ రేలంగి జడ్జి పాత్రను ధరిస్తారు. అతిథి వేషాలను రాజబాబు, సత్యనారాయణ, ముక్కామల పోషిస్తారు. ఈ చిత్రానికి మోదుకూరి మాటలను, సుకదేవ్ ఛాయను, అశ్వద్ధాను సంగీతాన్ని, అంకిరెడ్డి కూర్పును నిర్వహిస్తారు. అనిల్ప్రభాస్ విడుదల.

'చిలకా — గోరింక' తర్వాత కృష్ణద్వయం కలిసి నటిస్తున్న చిత్రం 'ప్రేమపక్షులు.'

ఏప్రిల్‌లో శోభన్ చిత్రం

ఉషశ్రీవారి అయిదవ చిత్రానికి కథ రెడీగా వుంది. శోభన్‌బాబు ఏప్రిల్‌లో కాల్‌షీట్లు యిస్తాను, అన్నారట. అప్పటికి 'ప్రేమపక్షులు' ఓవర్ ఫ్లో చెక్కును, చిన్నపరెడ్డి అందుకుంటారు.

ప్రజల మాట !

ఇటీవల వారం రోజులు ఆంధ్రాలో మకాం వేశాను. సినిమాలపట్ల ప్రజాభిప్రాయం ఎలా వుందో తెలుసుకున్నాను. ఏ చోటవిన్నా ఒకేమాట, ఒకే ధోరణి. అదేమిటో తెలుసా?

'మాకు ఆర్టిస్టులతో నిమిత్తం లేదు. మంచి కథలు కావాలి. నవ్యత్వం వుండాలి. అలాంటి వెరైటీ కథల్లో ఎవరు నటించినా, ఆ చిత్రం విజయం పొందడం తథ్యం'— యివి ప్రజల మాటలు.

తండ్రి, తనయుడు ఒక్కడే


అదృష్టం కలిసివస్తే, పాత్రలు వెతుక్కుంటూ వస్తాయి. 'తాసిల్దారుగారి అమ్మాయి' దగ్గర్నుండి, మొన్నటి 'మానవుడు—దానవుడు' వరకు శోభన్‌బాబు నటనకి ప్రజల్లో గిరాకీ పెరిగింది. ప్రేక్షకులు ఏవేవో వూహిస్తున్నారు వాళ్ల వూహలకి తగ్గట్టే ఆయనకి వేషాలు వస్తున్నాయి.

సమతచిత్ర నిర్మించబోయే చిత్రంలో తండ్రి, తనయుడుగా శోభన్ నటిస్తున్నారు. దర్శకుడు



'కొడుకు—కోడలు'లో నాగేశ్వరరావు, లక్ష్మి.

కె. ఎస్. ప్రకాశరావుకు, శోభన్‌బాబును ఎలా రూపొందించాలో తెలుసు. ఈ చిత్రానికి ఆదివిష్ణు రచయిత. వీరిని గూర్చి పాఠకులకు వేరే చెప్పాలా? ఇకపోతే— సంగీతాన్ని చక్రవర్తి, ఛాయను సుకదేవ్, కూర్పును అంకిరెడ్డి నిర్వహిస్తారు. నిర్మాణ సారధి చటర్జీ.



'కులగౌరవం'లో రామారావు, జయంతి.

సినిమా

కృష్ణ గురుభక్తి

'తేనెమనసులు' కథానాయకుడే నేటి 'పండంటి కాపురం' నాయకుడు. అప్పటి నుండి యిప్పటి వరకు కృష్ణ ఎన్నో విజయాలను సాధించారు. నటుడిగా అతడు ఎంతగానో రాణిస్తున్నాడు. ఆత్మధైర్యంతో జీవితాన్ని సుఖమయం చేసుకున్నారు. విశ్వాసం, గురుభావం వున్న వ్యక్తి గావడం వల్లనే, తమ చిత్రానికి ఆదుర్తిని దర్శకునిగా పెట్టుకున్నారు. ఇలాంటి గురుభక్తి ఎందరిలో వుంటుంది? ఈ కలికాలంలో!

దేవీ లలితాంబగా విజయ

'మా ఇలవేల్పు'గా సాక్షాత్కరించిన కె. ఆర్. విజయ ధరిస్తున్న మరొక పురాణ పాత్ర యిది. అభిరామా మూవీస్ తలపెట్టిన యీ చిత్రానికి శరవణా పిక్చర్స్ జి. ఎల్. వేలుమణి దర్శకుడు.

'న్యాయం, ధర్మం తన జీవిత లక్ష్యంగా గొన్న లలితాంబ, పాణిగ్రహణాన్ని కూడా తిరస్కరించి, చనిపోయిన 'జీవి'కి గమ్యస్థానం ఎక్కడుంది? చావు, బ్రతుకులు ఎందుకు వస్తున్నాయి?' అనెడి దైవ రహస్యాన్ని కనిపెట్టడంతో నిమగ్నురాలై, ఎన్నో యిడుములకు లోనవుతుంది. ఈ కథను గూర్చి వ్రాయడం కన్నా, తెరపై చూడడమే వాస్తవికంగా వుంటుంది.

దేవీలలితాంబ చిత్రానికి సముద్రాల కలం, వెంకటేష్ సంగీతం, భాస్కరరావు ఛాయాగ్రహణం, బాగా వుపకరించాయని తెలిసింది. ముఖ్యపాత్రలను జయ, ఛాయాదేవి, సలీమా, హేమలత, చంద్రమోహన్, విజయచంద్ర, ధూళిపాళ, ముక్కామల, రాజబాబు, అల్లురామలింగయ్య పోషించారు. షూటింగు కార్యక్రమం పూర్తయినట్టు త్వరలో నవయుగ ద్వారా విడుదల కానున్నట్టు పాఠకులకు తెలపమన్నారు, నిర్మాతలు.

వాణిశ్రీని బెదిరించిన అక్కినేని

సంధ్య స్నేహితురాలి పెళ్లికి కారులో పయనం అయింది. కారు వేరొక దారిని పట్టడం వల్ల, సంధ్య ఆందోళన పడింది. డ్రైవరును 'కారు ఆపు' అని మందలించింది. ఆమెకు కోపం, అనుమానం క్రోధం ఒక్కసాట్టున వచ్చాయి. అయినా అతడు ఆపలేదు సరిగదా, అంటించిన గడ్డాన్ని తీశాడు. అతడ్ని చూచి సంధ్య నిర్ఘాంతపోయింది. అతడు ఎవరో కాదు. కథానాయకుడు మాధవ్. సంధ్య బెదిరిపోయి, కారు దిగడానికి ప్రయత్నం చేసింది. మాధవ్ తన చేతనున్న పిస్తలును చూపించి, అదరగొట్టాడు. ఒకపాట కూడా మొదలెట్టాడు. ఏమని?

'చిక్కావు చేతిలో చిలకమ్మా— నీవు,
ఎక్కడికీ పోలేవు ఆగమ్మా, అహ, అహ.'

అంటూ సంధ్యను వుడికించాడు. పాపం, సంధ్య ఏం చేసిందో? తెలియాలంటే అన్నపూర్ణా ఆర్ట్ పిక్చర్స్ వారి కలర్ చిత్రం 'విచిత్రబంధం' చూడవలసిందే. పై పాటను కొసరాజు వ్రాయ, మహదేవన్ వద్ద, నూతన గాయకుడు రామకృష్ణ పాడారు.. మాధవ్‌గా అక్కినేని, సంధ్యగా వాణిశ్రీ నటించారు.. ప్రముఖ నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు నిర్మించిన యీ చిత్రానికి ఆదుర్తి సుబ్బారావు దర్శకుడు. అన్నపూర్ణా పంపిణీదారులు. 'విచిత్రబంధం' చిత్రం నవలా రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి 'విజేత' ఆధారంగా నిర్మించబడింది.



'పెద్దకొడుకు'లో శోభన్‌బాబు, కాంచన.

డాక్యుమెంటరీల ప్రదర్శన

సెప్టెంబరు 28న ఎమరాల్డు (మద్రాస్) థియేటరులో కొన్ని ముఖ్యమైన థీమ్స్ మీద తయారు చేయబడ్డ డాక్యుమెంటరీలను ఫిలిమ్స్ డివిజన్ వారు ప్రదర్శించారు. ఆ విషయాలను ఈ క్రింద వ్రాస్తున్నాను.

విద్యార్థులు సమ్మెలు, సత్యాగ్రహాలు చేయడానికి కారణాలు, వారి సమస్యలు, అభ్యర్థనలను సముచితంగా, సమంజసంగా పరిశీలించి, పరీక్షించి, పరిశోధించకపోవడం, వాటివల్ల జరిగే పరిణామాలు:

యుద్ధంలో తన ప్రాణాలను గూడ త్యాగం చేయసిద్ధమై దేశసేవలో అసువులర్పించిన అమరవీరుడు సెఖాన్‌కు పరమవీర చక్ర బిరుద ప్రదానం,

రైతు లోకానికి నూతన వ్యవసాయ పద్ధతులను, పరికరాలను అందజేసిన లేట్ లక్ష్మణరావు కిర్లోస్కర్ జీవితచరిత్ర, రోడ్లు—వాటి ప్రయోజనాలు.

దక్షిణాదిలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు, అరవింద ఘోష్ జన్మదినోత్సవం, 1972 లో జరిగిన ఒలింపిక్స్, ఉత్తరప్రదేశ్ లోని వరదల ధాటి, మ్యూనిక్‌లో ఇండియా—పాకిస్తాన్‌ల మధ్య జరిగిన హాకీ పోటీ, క్రికెట్ స్లేయర్ దిగ్రేట్ రంజిత్‌సింగ్‌ను గూర్చి, తమిళనాడు, తిరువేంద్రం, తిరునల్వేలిల మధ్య ఏర్పరుపబడిన క్రొత్త రైలు లింక్, మున్నగు ముఖ్యాంశాలను గూర్చి ప్రదర్శన లివ్వబడ్డాయి.

అన్నదమ్ములుగా జగ్గయ్య కృష్ణ

సీతారామాంజనేయ మూవీస్ నిర్మిస్తున్న 'నిండు కుటుంబం' చిత్రం సగం పూర్తయింది. 'అర్ధరాత్రి' ఫేం సాంబశివరావు దర్శకత్వంలో తయారయ్యే యీ చిత్రానికి సూరి మాటలను, అప్పారావు ఛాయను, రాజేశ్వరరావు సంగీతాన్ని, అంకిరెడ్డి కూర్పును నిర్వహిస్తున్నారు.

పై చిత్రంలో అన్నయ్యగా జగ్గయ్య, తమ్ముడిగా కృష్ణ నటిస్తున్నారు. అన్నకి జంటగా జమున, తమ్ముడికి జంటగా విజయలలిత కనిపిస్తారు. అత్యంత ప్రధానమైన రెండు పాత్రలను అంజలీదేవి, నాగభూషణం పోషిస్తున్నారు. నిర్మాత: అమరారామ సుబ్బారావు.

నాగభూషణం కుమారుడుగా శోభన్

శ్రీకాంత్ అండ్ శ్రీకాంత్ ఎంటర్‌ప్రైసెస్ వారి 'పెద్దకొడుకు'ను అక్టోబరులో విడుదల చెయ్యాలని, నిర్మాత పటేల్ సంకల్పం. ఈ చిత్రానికి కె. ఎస్. ప్రకాశరావు దర్శకుడు. మాటలను సముద్రాల వ్రాయ, సంగీతాన్ని ఆదినారాయణ

రావు సమకూర్చు, ఛాయను శ్రీకాంత్ నిర్వహించారు.

పై టైటిల్ పాత్రను శోభన్ పోషించారు. నాగభూషణం పెద్ద కొడుకు శోభన్ అయితే, చిన్న కొడుకు వివేకానందమూర్తి అవుతాడు. లారీ డ్రైవరుగా శోభన్, బటానీ పిల్లగా కాంచన నటించారు. సహాయ పాత్రలను ఎస్వరలక్ష్మి, జయ పోషించారు. ఈ చిత్రంలో హాస్యం బాగా పండిందని తెలిసింది. చక్రమియా విడుదల. ఈ చిత్రానికి రామదురై నిర్వహ, రాఘవేంద్రరావు సహాయ దర్శకత్వం చేపట్టారు.

రాజేష్ హేమా నటిస్తున్న మొదటి చిత్రం

మ్యాటనీ ఐయొడల్ రాజేష్‌ఖన్నాతో, డ్రీమ్ గరల్ హేమమాలిని యింతవరకు ఏ చిత్రంలోనూ నటించ లేదు. 'అందాజ్'లో మాత్రం కాస్సేపు కనిపించారు. స్ట్రెయిట్ రోల్సు వేసే అవకాశాన్ని సత్యచిత్ర అధినేతలు సత్యనారాయణ, సూర్యనారాయణ కలిగించారు.

'తాసిల్దారుగారి అమ్మాయి' కథను హిందీలో ప్రారంభిస్తున్నారు. కె. ఎస్. ప్రకాశరావు దర్శకత్వంలో నిర్మితమయ్యే యీ చిత్రంలో శోభన్ పాత్రను రాజేష్, జమున వేషంలో హేమమాలిని, చంద్రకళ భూమికలో మవుసమీ ఛటర్జీ కనిపిస్తారు. సంగీతాన్ని ఆర్. డి. బర్మన్ వినిపిస్తారు.

హిందీ కాగానే తెలుగు

హిందీ 'తాసిల్దారుగారి అమ్మాయి' పూర్తి కాగానే, శోభన్‌బాబుతో తెలుగు చిత్రం ప్రారంభిస్తారు సత్యచిత్ర నిర్మాతలు. దర్శకత్వం కె. ఎస్. ప్రకాశరావు.

జగపతిలో శివాజీ

ఇంతవరకు తెలుగు ప్రేక్షకుల అభిమానానికి పాత్రుడైన జగపతి రాజేంద్రప్రసాద్, త్వరలో తమిళ ప్రజకి తన టేస్టును చవి చూపించబోతున్నారు.

'మానవుడు— దానవుడు' తమిళ చిత్రంలో శివాజీ నటిస్తారు. దర్శకత్వం: వి. బి. రాజేంద్ర ప్రసాద్.

హవుస్ సర్జన్‌గా జమున !

కృష్ణకిశోర్ బ్యానర్‌ను, జోతి డిస్ట్రిబ్యూటరు నారాయణరావు కుమారుడు శేఖర్‌బాబు స్థాపించారు. పంపిణీ సంస్థను కూడా అభివృద్ధి చెయ్యడానికి తండ్రి, తనయులు పూనుకున్నారు.

పై సంస్థకి పినిశెట్టి వ్రాసిన కథను, పి-

సి ని మా

చంద్రశేఖరరెడ్డి దర్శకత్వంలో శేఖర్‌బాబు తయారు చేస్తున్నారు. ఈ చిత్రంలో డాక్టరుగా కృష్ణ, హవుస్ సర్జన్‌గా జమున నటిస్తారు. మరొక ముఖ్య భూమికను కృష్ణంరాజు ధరిస్తారు.

అక్టోబరు 1న 'నేరము—శిక్ష' ప్రారంభం

నటుడు బాలయ్య అమృతా ఫిలింస్ పేరిట సమర్పిస్తున్న 'నేరము— శిక్ష' షూటింగు అక్టోబర్ 1 న ప్రారంభం. కథను బాలయ్య వ్రాయ, మాటలను మోదుకూరి రచించారు. దర్శకత్వాన్ని కె. విశ్వనాథ్ నిర్వహింప, సంగీత సారధ్యాన్ని రాజేశ్వరరావు చేపట్టారు. కథానాయకుడిగా కృష్ణ, అత్తగాడి తండ్రిగా కాంతారావు నటిస్తున్నారు. గుడ్డివాని వేషంలో బాలయ్య, మాడరన్ గిరీశం వేషంలో సత్యనారాయణ కనిపిస్తారు.

అనుకున్న విధంగా షూటింగు జరిగితే, ఫిబ్రవరికి 'నేరము— శిక్ష' మీ ముందు వుంటుంది. నవయుగ విడుదల.

బొంబాయిలో కళాశాల

బొంబాయిలో ఒక ఫిలిం కళాశాలను స్థాపించబోతున్నారు. ఈ కళాశాలకు కరీర్ ఫిలిం యునిస్టిట్యూట్ అని పేరు పెట్టారు. అక్టోబరు నుండి పాఠాలు ప్రారంభిస్తారట. చిత్ర నిర్మాణం, టెలివిజన్ గూర్చి నేర్పుతారట.



'దున్నేవానిదేభూమి'లో విజయనిర్మల.

మీకు తెలుసా?

హిందీ నటుడు రాజేంద్రకుమార్ కనీస పారితోషికం తీసుకుని, కొత్త చిత్రాల్లో నటిస్తున్నారుట. చూశారా! కాల మహిమ!!

ముంతాజ్, ధరేంద్ర కాల్‌షీట్లను పరస్పరం మాట్లాడుకుని, నిర్మాతలకి తేదీల నిస్తారట!

హిందీ నటుడు శత్రుఘ్న సిన్హాకి, యోగితా బాలీతో స్నేహం తగ్గిందట. నటి కోమల్‌తో పరిణయం జరుగుతుందట.

ప్రముఖ దర్శకుడు శాంతారాం నిర్మించిన మరాఠీ చిత్రం 'పింజరా' రజితోత్సవం జరుపుకుంటూంది. ఈ కథ హిందీలో తయారవుతుందట.

'పండంటికాపురం'హిందీ వెర్షన్‌లో జమున పాత్రను; వహీదా ధరిస్తుందట.

విజయనిర్మల దర్శకత్వంలో రాజశ్రీ మళయాళ చిత్రంలో నటిస్తుందట.

హేమమాలిని నృత్యం

గుజరాత్ పాత్రికేయుల సంఘ సహాయార్థం, డ్రీమ్‌గరల్ హేమమాలిని నృత్య ప్రదర్శననిచ్చింది. ఈ ప్రదర్శన ద్వారా 50 వేలు వసూలయ్యింది.


జయభాదురి వద్దు !

అని తన నిర్మాతలకు హితవు చెపుతున్నాడట హిందీనటుడు రాజేష్ ఖన్నా. కారణం— 'పల్‌వరిష్' చిత్రంలో ఆమె తన చెల్లెలుగా నటించడమేనట. సోదరిగా నటించిన జయను తన ప్రక్కన శృంగార నాయికగా జనం ఒప్పుకోరు అన్నారట' రాజేష్.

రాజ్‌కి కొత్త కాంట్రాక్టు

ప్రముఖ హిందీనటుడు రాజకపూర్‌కి పాత పంపిణీదారులు దూరమయ్యారట. ప్రస్తుతం నిర్మాణంలోవున్న 'బాబీ' చిత్రానికి కొత్త డిస్ట్రిబ్యూటర్లు వస్తున్నారు.

—శ్రీనివాస్


శ్రీ లక్ష్మీ ప్రొడక్షన్స్
పాపం పసివాడు
ఈస్ట్‌మన్ కలర్
దర్శకత్వం
వి. రామచంద్రరావు
సమర్పణ
ఎ. పూర్ణచంద్రరావు
నిర్మాత: A శేషగిరిరావు
సోల్ డిస్ట్రిబ్యూటర్స్ లక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్
లక్ష్మీ ఫిలింస్ రిలీజ్

కౌగిలి సంస్కారం

(21వ పేజీ తరువాయి)

ఆగిపోయాడు.

'ఊఁ...మిమ్మల్ని' అని పైమాట కోసం తొందరపెట్టింది కరుణ.

'ఎందుకు లెండి' అని విషయం మార్చి 'అది సరేగాని ఇంత రాత్రి మీరు ఇక్కడ ఉంటే మీవారు వస్తే ఎలా?' అన్నాడు పక్కకు చూస్తూ.

'వారు పన్నెండు కాందే ఇంటికి రారు.'

'అదే అంతవరకూ ఏం చేస్తుంటారు.'

'వారికి ఈ ఊళ్లో ఒక స్నేహితురాలుంది. అర్ధరాత్రివరకూ అక్కడే గడిపి ఇంటికొస్తారు.'

'అబ్బ! ఇక చెప్పకండి. వింటేనే బాధగా ఉంది. మీరెంత తేలిగ్గా చెప్తున్నారు. ఎలా సహిస్తున్నారు' అన్నాడు ముఖంలో తీవ్రమైన సానుభూతి ఛాయల్ని ప్రదర్శిస్తూ.

'సహనం సంస్కార లక్షణానికి విరుద్ధమాండి' అంది ప్రసన్నంగా.

'విరుద్ధం కాదనుకోండి. కాని సహనానికి కూడా హద్దు ఉంటాయంటాను.'

'ఉంటాయనే అనుకుందాం. కాని నా పరిస్థితుల్లో సహనం విడిస్తే కలిగే మేలు నాకేమీ కనిపించడంలేదు. నేను చేయగలిగింది కూడా ఏమీ లేదు' అంది దైన్యంగా.

'ఆకర్షరూపిణి—ఆడది తలుచుకుంటే పరిస్థితులను తప్పక అనుకూలంగా తిప్పుకోగలదు. మీరతడిని ఎలా ఎలా భరిస్తున్నారో నా కర్థం కావడంలేదు' అన్నాడు ఆవేశంతో.

'భరించక ... ఈ రాత్రికి రాత్రే లేచి వస్తే నన్ను మీరు పెండ్లాడ్తారా?' మూర్తి మొహంలోకి సూటిగా చూస్తూ అడిగింది కరుణ.

లైన్ కెపాసిటీ విద్యుత్తు జలజలా నరాలలో పారినట్లనిపించింది మూర్తికి.

'అబ్బే!... మీరు తొందరపడుతున్నారు' అని ఇంకా మరేమీ అనడం తోచక 'గొంతు ఆరిపోతుంది. ఫ్లాస్కులో కాఫీ ఉందేమో చూస్తాను. కాస్త తాగి మాటాడదాం' అని లేచి వంటింట్లోకివెళ్ళి ఫ్లాస్కు తెచ్చాడు.

కరుణ అతని చేతిలోనుండి ఫ్లాస్కును తీసుకొని 'మీరు కూర్చోండి, ఆడవాళ్ళున్నప్పుడు మగవాళ్ళు ఇలాంటి పనులు చేయకూడదు' అంటూ రెండు కప్పుల్లో కాఫీ పోసింది.

సూటిగా మూర్తి కళ్ళల్లోకి చూస్తూ చిరునవ్వు నవ్వుతూ అతనికి కప్పు అందించింది.

వంగిన ఆమె ముఖంలోని సౌందర్యం ట్యూబ్‌లైట్ కాంతిలో జిగేల్‌మని మెరసిపోతోంది. నిండు అవయవాలు బిగువైన రవికనుండి పొడుచుకు వస్తున్నాయి.

కాఫీ కప్పు అందుకుని కదలకుండా చూశాడామెను. కరుణ వాల్జడలోని విరజాజుల ఘుమాయింపుకు మూర్తికి మత్తెక్కిపోయింది.

లేచి నిలుచున్నాడు. ఆమె ముఖంలోనే చూపులు నిలిపి పిచ్చివానిలా చూశాడు.

హఠాత్తుగా కరెంట్ ఆఫ్ అయిపోయింది.

అతని అంతరాంతరాలలో నిద్రపోతున్న నరాల బిగువు ఆ చీకటిలో ఒక్కసారిగా మేల్కొంది.

అమాంతం కరుణను గట్టిగా కౌగలించుకున్నాడు. ఆమె శరీరమార్దవాన్ని కొన్ని క్షణాలపాటు అనుభవించాడు.

తాగినవాడి కళ్ళమీద వెలుతురు పడినట్లుగా వెంటనే మళ్ళీ కరెంట్ వచ్చేసింది.

ఒక్కసారిగా బెదిరిపోయి కరుణను విడిచిపెట్టి కుర్చీలో వాలిపోయాడు.

కరుణలో ఎలాంటి సంచలనం లేదు.

'మీ సంస్కారం ఇంతవరకు వచ్చిందన్న మాట' అని మెల్లిగా అంది.

మూర్తి ముఖం పక్కకు పెట్టి '[illegible] కరుణా...నీవు నన్ను...'

'అపార్థం చేసుకుంటున్నానంటారు. అంతేనా' అని అతనికి జవాబు నందించింది కరుణ.

'అవును. నా ప్రవర్తనలో నాకేమీ దురుద్దేశ్యంలేదు. 'నేను' అనేదేదైనా మనలో ఉంటే అదిచేసిన పని కాదిది.'

కరుణ ఒక్కసారిగా నవ్వింది.

'అబ్బ. మీ అంతటి సమర్థ రామదాసులను ఇంతవరకూ చూడలేదండీ' అంది.

'వాస్తవాన్ని సమర్థించుకోవడంగా అనుకుంటే మీ ఇష్టం' అన్నాడు.

ఇంతలో 'అన్నయ్యా!' అంటూ సంధ్య ఇంట్లోకి వచ్చింది. వాళ్ళిద్దర్నీ చూసి నిర్ఘాంతపోయింది.

'సరే వస్తానండీ, వస్తా సంధ్యా' అంటూ వెళ్ళిపోయింది కరుణ.

ఆనాటినుండీ ఒకవారం రోజులవరకూ కరుణ మూర్తి ఇంటికి రాలేదు.

ఒకనాడు ఉదయం ఒక చిన్నఅమ్మాయి వచ్చి మూర్తికి ఒక చీటీయిచ్చి వెళ్ళిపోయింది: చీటీ విప్పాడు మూర్తి.

'ప్రియమిత్రులు మూర్తిగార్కి,

హృదయాంజలి.

అత్యవసరమైన పనివల్ల మా వారిని మరో ఊరికి బదిలీ చేశారు. మేం ఈరోజు సాయంత్రమే వెళుతున్నాం. ఇక నేను మళ్ళీ కనపడనేమో.

నిజంగా మీరు నన్ను అపార్థం చేసుకున్నారు. నేను నా అభిమాన కథలన్నీ, నిజాయితీకి ఇచ్చిన విలువను స్త్రీ పురుష సంబంధాల కివ్వను. ఆ రహస్యాలూ, దాపరికాలూ నాకు గిట్టవు, సాహిత్యమంటే నాకు ఎంతో ఇష్టం, అలాంటి సాహిత్య గోష్ఠిని కోరే నేను మీ స్నేహాన్ని కోరాను.

కాని మీ ధోరణికి నేను కూడా ఎంతవరకు బాధ్యురాలను అని ఇప్పుడాలోచిస్తున్నాను.

అయినా మీ స్నేహాన్నీ, సహవాసాన్నీ ఎప్పటికీ ఆహ్వానిస్తాను.


నేను మిమ్మల్నేమీ కోరలేదు. ఈ ఒక్క కోరికను తీరుస్తారనుకుంటా, నామీద మీరు ఓపాట రాసి పంపండి.

ఇంతే—

మీ

'కరుణ'

ఉత్తరం చదవగానే నీటి అలలలో లేచిపోయే సమాంతర వృత్తాలు స్ఫురించాయి మూర్తికి. ఒకదాని చలనానికి మరొకటి ప్రేరకమైనా అవి కలియవు అంతే—



వారఫలం

27-10-1972 శుక్రవారం మొదలు

2-11-1972 గురువారం వరకు

మేషం : వృత్తిలో సాటివారి పోటీ తగ్గుతుంది. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. మీ మంచితనమే మీకు ఇబ్బందిని కలిగిస్తుంది. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. విలాస వస్తువులు కొంటారు.

వృషభం : రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. వారం ఆఖరులో మీ మంచితనమే మీకు ఇబ్బందిని కలిగిస్తుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. సాటివారిలో గౌరవం లభిస్తుంది.

మిథునం : అన్ని వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. భాగస్వాములతో కలసిచేసే వ్యాపారాలు బాగుంటాయి. ప్రయోజనంగల పరిచయాలు ఏర్పడతాయి. కోర్టు వ్యవహారాల్లో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

కర్కాటకం : కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. వారం మధ్యలో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. విద్యా వైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి, అధిక వ్యయం జరుగుతుంది.

సింహం : వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వారం మధ్యలో అధిక వ్యయం జరుగుతోంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టంవస్తుంది. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి బాగుంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కన్య : వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. స్థిరాస్తి వ్యవహారాలు బాగుంటాయి. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. వారం ఆఖరులో లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. పుణ్య కార్యాలు చేస్తారు.

తుల : మీ కార్యక్రమాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. ప్రయోజనంగల పరిచయాలు ఏర్పడతాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. శుభ కార్యాల విషయంలో అభివృద్ధిని సాధించగలరు.

వృశ్చికం : అనవసరమైన శ్రమ కలుగుతుంది. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం మధ్యలో అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. అన్ని వ్యవహారాల్లోను గౌరవం బాగుంటుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో చికాకులు ఏర్పడతాయి. బంధు మిత్రులను కలుసుకొంటారు.

ధనుస్సు : ప్రయత్నించిన ప్రతి పని సులువుగా నెరవేరగలదు. సాటివారిలో గౌరవం బాగుంటుంది. వారం మధ్యలో ఆందోళన కలుగుతుంది. ప్రయాణాల్లో శ్రమకు గురి కాగలరు. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

మకరం : వ్యాపారంలో శ్రమమీద అనుకూలత లభిస్తుంది. సాటివారితో మాట పట్టింపులు తగవు. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు బాగుంటాయి. ప్రయోజనంగల పరిచయాలు ఏర్పడతాయి. వారం ఆఖరులో అనవసరమైన శ్రమ కలుగుతుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. ఆడంబరంకోసం వ్యయం జరుగుతుంది.

కుంభం : వృత్తి వ్యాపారాలో ఆదాయం బాగుంటుంది. మిత్రుల సహాయం లభిస్తుంది. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. ఇతరుల నిమిత్తం ప్రయాసకు గురి కాగలరు. వారం ఆఖరులో ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. సాటివారితో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్య కళా రంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

మీనం : ఆదాయంకంటె ఖర్చులే అధికంగా ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో ఇబ్బందులు తగవు. వారం మధ్యలో వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో అనవసరమైన సందేహాలు కలుగుతాయి.

స్త్రీలకు—బంధు మిత్రులను కలుసుకొంటారు, నూతన విషయాలను తెలుసుకొంటారు.

—సుభాష్

పాలన పోషణ సరిగా చెయ్యండి
పిల్లలకు బోర్న్‌విటా ఇవ్వండి !





చదువుల్లో ఆటల్లో హరింపు అయే శక్తిని పిల్లలకు తిరిగి సమకూర్చకపోతే వారి మానసిక శారీరక వికాసానికి ఆటంకం కలుగుతుంది. ప్రతి దినం వారు బోర్న్‌విటా త్రాగటం వలన పిల్లల శక్తి పెరుగుతూ ఉంటుంది. పుష్టికరమైన కోకో, పాలు, మాల్ట్ మరియు పంచదారలతో తయారైన బోర్న్‌విటా రుచికరమైనది.

శక్తి, ఉత్సాహం మరియు రుచికోసం క్యాడ్‌బరిస్ బోర్న్‌విటా !



జరిగిన కథ

రామ్మూర్తికి ఇద్దరు కొడుకులూ, ఒక కుమార్తె. పెద్దవాడు ప్రసాద్ ఉద్యోగం చేస్తున్నాడు. రెండవ వాడు కొంచెం అల్లరిచిల్లరగా తిరుగుతుంటాడు. కుమార్తె లక్ష్మి పెళ్ళికి ఎదిగి ఉంది. భార్య శాంతమ్మ రోగిష్టిది. కాంచన ప్రసాద్ ఆఫీసులోనే పని చేస్తున్నది. ప్రసాద్ కాంచనా ప్రేమలో పడ్డారు. అందుచేత తండ్రి తెచ్చిన సంబంధానికి ప్రసాద్ ఇష్టపడలేదు. ప్రసాద్, కాంచనలు మరింత దగ్గరయ్యారు. పెళ్ళి చేసుకున్నారు.

4

సత్యనారాయణ కుమార్తె విమలకు రామ్మూర్తి కుమారుడు ప్రసాద్‌కు వివాహం జరగబోతున్నదనే విషయం బజారు అంతటా తెలిసిపోయింది. తెలిసిన వాళ్ళందరూ రామ్మూర్తి 'అదృష్టవంతుడు' అన్నారు.

'షావుకారు కూతురిని, గుమాస్తా కొడుకుకు యిచ్చి పెళ్ళిచేయడమా?' అని ఆశ్చర్యపోయిన వాళ్ళుకూడా లేకపోదు. 'వేలకువేలు కట్నంపోసి ముక్కూమొగం తెలియనివాడికి పిల్లను యివ్వడంకంటే, గుమస్తాకొడుకు అయినా, చదువుకున్నవాడు, బుద్ధిమంతుడు అయితే, అతనికే పిల్లను యివ్వడం మంచిది' అని చాలా మంది అన్నారు.

బజార్లో వాళ్ళందరూ రామ్మూర్తిని యిదివరకటికంటే యెక్కువగా గౌరవించడం ప్రారంభించారు. ఇక వాళ్ళ కొట్లో సంగతి వేరే చెప్పవలసిన అవసరం లేదు. మిగిలిన గుమాస్తాలు, బంట్రోతులు రామ్మూర్తిని, సత్యనారాయణతో సమానంగా గౌరవిస్తున్నారు.

సాయంత్రంపూట అప్పుడప్పుడు సత్యనారాయణకు యింటివద్దనుంచి టిఫిన్ వస్తుంది. ఈ పెళ్ళిసంబంధాన్ని ప్రస్తావించినప్పటినుంచీ సత్యనారాయణ యింటి వద్దనుంచి యిద్దరు మనుష్యులకు సరిపోయే టిఫిన్ కొట్టువద్దకు రావడం ప్రారంభం అయింది.

సత్యనారాయణతోకలిసి టిఫిన్ చేయడానికి రామ్మూర్తి మొదట యిష్టపడలేదు కాని సత్యనారాయణ మరీ బలవంతం చేయడంవలన రామ్మూర్తి కూడా అతనితో పాటు టిఫిన్‌చేయక తప్పలేదు.

ఒకనాటిరాత్రి కొట్లో పని అయిపోగానే రామ్మూర్తికూడా అందరితోపాటు వెళ్ళిపోవడానికి లేచాడు.

'మీరు ఉండండి' అని సత్యనారాయణ అనగానే రామ్మూర్తి కొట్లో ఉండిపోయాడు. మిగిలినవాళ్ళందరూ వెళ్ళిపోయారు.

'రేపు ఉదయం మా తోడల్లుడుగారి కుటుంబం మా యింటికి వస్తుంది. ఎల్లుండిసాయంత్రం అయిదుగంటలకు విమలను చూడడానికి మీరు మా యింటికి రండి. ఆమర్నాడు సాయంత్రం మేమందరం లక్ష్మిని చూడడానికి మీ యింటికి వస్తాం' అన్నాడు సత్యనారాయణ.

'అలాగే, బాబూ!' అన్నాడు రామ్మూర్తి యెంతో సంతోషంగా.

తరువాత సత్యనారాయణ, రామ్మూర్తి యెవరి యిళ్ళకు వారు బయల్దేరారు.

రామ్మూర్తి వెంటనే యింటికి వచ్చేద్దాం అనుకొన్నాడు. కాని కొంతమందికి తెలిసిన వ్యక్తులు దారిలో పలకరించడం వలన అతను యింటికి రావడం కొంచెం ఆలస్యం అయింది.

'ప్రసాద్ యింటికి వచ్చాడా?' అని శాంతను అడిగాడు రామ్మూర్తి యింటికి రాగానే.

'ఆ! వచ్చాడు, భోజనంచేసి మళ్ళా వెళ్ళాడు.'

'మళ్ళా యెక్కడకు వెళ్ళాడు?'

'ఆఫీసుకే వెళ్ళాడు. ఆఫీసులో పని యెక్కువగా ఉన్నదని పదిరోజులనుంచి రాత్రిపూట మళ్ళా ఆఫీసుకు వెళ్ళి, పన్నెండుగంటలకు తిరిగి వస్తున్నాడు.'

'అలాగా?'

'ఈవేళ జీతం తెచ్చియిచ్చాడండీ!'

'ఎంత?'

'మూటయ్యాభయ్యే యిచ్చాడు' అన్నది శాంత నిరుత్సాహంగా.

'మూటయ్యాభయ్యే యిచ్చాడా?'

'అవునండీ! మిగిలిన డబ్బు యేం చేశావు?' అని అడిగాను.

'ఏమిటి అన్నాడు?'

'ఖర్చు అయిపోయింది' అని మాత్రం అన్నాడు. ఇంకేం చెప్పలేదు' అన్నది శాంత.

'అయితే, వీడు యిప్పటినుంచీ అక్కాధికారి అల్లుడులాగ ఖర్చువెయ్యడం ప్రారంభించాడన్నమాట.'

దానికి శాంత యేమీ మాట్లాడలేదు.

'అన్నట్లు, చెప్పడం మరచిపోయాను. వెల్లుండి సాయంత్రం అయిదుగంటలకు విమలను చూడడానికి వాళ్ళయింటికి మనల్ని రమ్మనమని సత్యనారాయణగారు యిప్పుడు చెప్పారు' అన్నాడు రామ్మూర్తి.

'అయితే మన లక్ష్మిమాట యేం చెప్పారు?'

'ఆ మర్నాడు సాయంత్రం లక్ష్మిని చూడడానికి వాళ్ళ తోడల్లుడుగారి కుటుంబం, వారూ మన యింటికి వస్తామని చెప్పారు.'

'ఎలాగో, ఈ రెండు పెళ్ళిళ్ళు అయిపోతే మన ప్రాణాలు సుఖంగా ఉంటాయి.'

'ఆ వెంటనే రాజుకు యేదో ఒక ఉద్యోగం చూసి, తరువాత వాడి పెళ్ళి కూడా చేసివేస్తే మన బాధ్యత పూర్తిగా తీరిపోతుంది'

'అంతా భగవంతుని దయ'

'ఆ తరువాత మనం యిద్దరం కొత్త పెళ్ళికొడుకు, కొత్త పెళ్ళికూతురు ఉన్నంత స్వేచ్ఛగా ఉండవచ్చును' అన్నాడు రామ్మూర్తి యెంతో ఉత్సాహంగా.

'ఆ! మీరు మళ్ళీ కొత్త పెళ్ళికొడుకు అవుదురుగాని, ముందు భోజనానికి లేవండి. నాకు తలనొప్పిగా ఉంది. జ్వరంకూడా వచ్చిందేమో' అని అంటూ శాంత వంటింట్లోకి వెళ్ళిపోయింది.

'నీకు జ్వరం రావడం యేమిటి? ఒకప్పుడు అది నిన్ను వదిలింది గనుగనా?' అని రామ్మూర్తి లేచాడు.

ఆ రాత్రి శాంతకు జ్వరం వచ్చింది. మర్నాడు ఉదయం ఆమెకు నీరసంగా ఉండడం వలన ఆమె కాఫీతాగి చావిట్లో మంచంమీద మళ్ళా పడుకున్నది. ఇంటి పనులన్నీ లక్ష్మి చేస్తున్నది.

ఆ ఉదయం ప్రసాద్ మామూలు వేళకంటే ముందుగానే స్నానంచేసి, తన గదిలో బట్టలు వేసుకొంటున్నాడు.

చావిట్లో తన మామూలు కుర్చీలో కూర్చున్న రామ్మూర్తి 'ప్రసాద్' అని కేకవేశాడు.

'ఏమండీ?' అని అంటూ ప్రసాద్ తన గదిలోనుంచి బయటకు వచ్చాడు.

'ఏమిటి, యీవేళ యింత తొందరగా బయలుదేరుతున్నావు?'

'ఆఫీసులో అర్జంటుపని ఉన్నదండి! అందుచేత త్వరగా వెళ్ళాలి'

'అయితే, సరేకాని రేపు సాయంత్రం నువ్వు ఆఫీసుకు శలవుపెట్టు!'

'ఆఫీసుకు శెలవా? యెందుకండి?'



'రేపు సాయంత్రం విమలను చూడ్డానికి వాళ్ళ యింటికి మనలను రమ్మనమని సత్యనారాయణగారు చెప్పారు'

'విమలను చూడ్డానికా?' అని ప్రసాద్ యేదో అనబోయి ఊరుకున్నాడు.

'ఏమిటి సందేహిస్తున్నావు, చెప్పు' అన్నాడు రామ్మూర్తి ఆతృతగా.

'ఏమీలేదు. నాకు యీ పెళ్ళి వద్దండి' అన్నాడు ప్రసాద్ నెమ్మదిగా.

ఆ మాటవిని శాంతా, రామ్మూర్తి యిద్దరూకూడా తెల్లబోయారు.

'ఎందుచేత నీకు పెళ్ళివద్దు?' అని శాంత నీరసంతోనే ప్రశ్నించింది.

ప్రసాద్ యేమీ మాట్లాడలేదు.

'పోనీ, కొన్నాళ్ళ వరకు నీకు పెళ్ళి చేసుకోవాలని లేకపోతే, ఆ సంగతి సత్యనారాయణగారితో చెబుతాను' అన్నాడు రామ్మూర్తి ప్రాధేయపూర్వకంగా.

'నేను పెళ్ళి చేసేసుకున్నాను' అన్నాడు ప్రసాద్ అది యేదో అతిసామాన్య విషయం అయినట్లుగా.

'ఆ!' అని శాంత, రామ్మూర్తి నిర్ఘాంతపోయాడు. వారికి ప్రపంచం అంతా ఒక్కసారిగా చీకటి అయిపోయింది. 'ఎవరో తమను ఒక అగాధంలోనికి తోసి వేసినట్లుగా' వారికి అనిపించింది.

ఆ మాటతో రామ్మూర్తి ఒకేసారి పంచప్రాణాలు పోయినవాడిలాగ నిశ్చేష్టుడై పోయాడు.

'ఎవర్ని చేసుకున్నావు?' అని ప్రశ్నించింది శాంత దడదడ కొట్టుకుంటున్న గుండెలతో.

'మా ఆఫీసులో పనిచేస్తున్న కాంచన అనే అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాను' అన్నాడు ప్రసాద్ యేమీ తొణకకుండా.

'ఏమిటి నువ్వు చెబుతున్నది నిజమేనా?' అని ప్రశ్నించింది శాంత. ఇదంతా నిజమో కలో ఆమెకు తెలియడంలేదు. తాను చెప్పిందీ అంతా అబద్ధమేనని ప్రసాద్ అంటాడుగదా!' అని ఆమె ఆశించింది కాని ఆమె ఆశ యెంతసేపో నిలవలేదు.

'నిజమే' అని అంటూ ప్రసాద్ తన గదిలోనికి వెళ్ళి, ఒక ఫోటో తీసికొనివచ్చి; శాంత చేతికి యిచ్చాడు. రిజిష్టరుమేరేజి చేసికొన్నప్పుడు, ప్రసాద్, కాంచన పూల దండలు వేసుకొని తీయించుకొన్న ఫోటో.

అనగనగా...

ఆ ఫోటో చూసి శాంత యేమీ మాట్లాడలేకపోయింది.

'ఎప్పుడు పెళ్ళి చేసికొన్నావు?' అని ప్రశ్నించాడు రామ్మూర్తి ఓడిపోయిన వానివలె.

'పదిరోజులు అయింది.'

'కనీసం నువ్వు పెళ్ళి చేసుకొనేటప్పుడైనా మాతో చెప్పనక్కరలేదా?' అని ప్రశ్నించింది శాంత లేని ఓపిక తెచ్చుకొని.

'నా పెళ్ళి నా వ్యక్తిగతమైన విషయం దానిని గురించి ఒకరితో చెప్పవలసిన అవసరం నాకు యేమీ లేదు' అన్నాడు ప్రసాద్ ఖచ్చితంగా.

తన పెళ్ళి విషయంలో తల్లితండ్రులకు చెప్పవలసిన మాటలను యిదివరకే ఆలోచించుకుని ఉండడంవలన, అతను సమాధానం చెప్పడానికి యేమీ తడుముకోవలసిన అవసరం లేకపోయింది.

శాంత మళ్ళీ యేమో అనబోయింది కాని అంతలో ప్రసాద్ 'నాకు ఆఫీసులో పని ఉంది' అంటూ రివ్వున సైకిలు తీసుకొని వెళ్ళిపోయాడు.

శాంత 'అమ్మా' అంటూ తల పట్టుకుని మంచంమీద పడిపోయింది.

'శాంతా!' 'శాంతా!' అంటూ రామ్మూర్తి కుంటుకుంటూనే వేగంగా ఆమె మంచం వద్దకు వెళ్ళాడు.

ఈ సంభాషణ నంతటినీ వింటూ కొయ్యబొమ్మవలె ఉండిపోయిన లక్ష్మి కూడా 'అమ్మా! అమ్మా!' అంటూ శాంత మంచంవద్దకు వెళ్ళింది.

శాంత యేమీ మాట్లాడలేదు.

రామ్మూర్తి వెంటనే మంచంమీద కూర్చుని శాంత చెయ్యి పట్టుకొని చూశాడు.

'కొంచెం మంచినీళ్ళు తీసుకొనిరా! లక్ష్మీ!' అని రామ్మూర్తి అనగానే లక్ష్మి లోపలకువెళ్ళి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి యిచ్చింది. రామ్మూర్తి శాంత ముఖంమీద కొంచెం నీళ్ళు చల్లాడు.

మంచం పక్కనే నిలబడి లక్ష్మి విసనకర్రతో విసురుతూ, 'అమ్మా! అమ్మా!' అని యెంతో దీనంగా పిలవడం ప్రారంభించింది.

కొద్దిసేపట్లో శాంత కళ్ళు తెరచి చూసింది. మంచంమీద యెదురుగా రామ్మూర్తి, పక్కను నిలబడి, విసనకర్రతో విసురుతున్న లక్ష్మి ఆమెకు కనిపించారు.

'ఇదంతా నిజమా, కలా చెప్పండి!' అని ఆమె అతినీరసంగా భర్తను ప్రశ్నించింది.

రామ్మూర్తి యేమి మాట్లాడలేకపోయాడు.

శాంత తరువాత లక్ష్మి ముఖంలోనికి చూసింది. లక్ష్మికూడా శాంత ముఖంలోనికి విచారంగా చూడడం తప్ప యింకేమీ చేయలేకపోయింది.

'ఏమండీ! మీరు చెప్పండి! ఇదంతా 'కల' అని చెప్పండి!' అని అంటూ రామ్మూర్తి చేతులు పట్టుకొన్నది శాంత ప్రాధేయపడుతున్నట్లుగా.

'లేదు శాంతా! ఇదంతా 'కల' అని నీకు చెప్పేఅంత అదృష్టం నాకు లేదు. జీవితంలో మనం పొందుతున్న కష్టాలు యెంత నిజమో యిదీ అంత నిజం' అని అంటూ రామ్మూర్తి మంచంమీద ఉన్న ఫోటోతీసి, తాను ఒకసారి చూసి శాంత చేతికి యిచ్చాడు.

శాంత ఆ ఫోటోచూసి, ఒకసారి నిట్టూర్చింది. తరువాత కొంచెం సేపటి వరకు ఆమె మాట్లాడలేకపోయింది. తల్లి మంచంమీద పెట్టేసిన ఫోటోను లక్ష్మితీసి, తానూ ఒకేసారి చూసి ప్రక్కను ఉన్న బల్లమీద పెట్టింది.

'ఏమండీ! మీరు చెప్పండి. వాడి పెళ్ళి వాడి వ్యక్తిగత విషయమా, మీరు చెప్పండి' అని అంటూ శాంత రామ్మూర్తి చేతులు పట్టుకొంది.

రామ్మూర్తి యేమీ మాట్లాడలేదు.

'వాడిని కని, పెంచి, పెద్దవాడిని చేసిన మనకు వాడు తన పెళ్ళిని గురించి చెప్పవలసిన అవసరం లేదా చెప్పండి! వాడికి యెప్పుడైనా కొంచెం ఒళ్ళు వేడిగాఉంటే చాలు. మనం తిండీ, నిద్రా మానివేసి, వాడికి రాత్రింబగళ్ళు సేవచేశామే, అటువంటి మనకు వాడు తన పెళ్ళిసంగతి చెప్పవలసిన అవసరం లేదా చెప్పండి!' అని రామ్మూర్తిని అడిగింది శాంత కళ్ళలో నీరు తిరుగుతుండగా,


మనసు మురిపించే ఫ్రెస్కా
Beauty Talc
fresca
ఫ్రెస్కా బ్యూటీ టాల్కు—
మనోహరమైన, తీయని గాలికి
సువాసనను, వ్యక్తమైన సౌందర్య
మును మీ మీద వెదజల్లును.
ఫ్రెస్కా, దాని ప్రత్యేకమైన
మృదుత్వముతో మీ రూపమునకు
మెరుగులు దిద్దును.
ఫ్రెస్కా మృదువైనది, సువాసన
గంధి—మీకు తాజా పూరితమైన
ఉత్సాహమును గొల్పును.
అందువలన ఫ్రెస్కాతో
రమణీయంగా వుండండి.
రెండు సైజులలో లభించును—
ఫ్రెస్కా
బ్యూటీ టాల్కు
గోద్రెజ్
తయారీ
సాటిలేని తాజాదనమునకు ఫ్రెస్కా!
Interpub/GSF/8/72 Tel.

'ఊరుకో, శాంతా, ఊరుకో' అంటూ రామ్మూర్తి శాంతను ఓదార్చడం ప్రారంభించాడు.

'వాడు యెప్పుడైనా యింటికి రావడం ఆలస్యం అయితేచాలు. గుమ్మంవద్దనే నిలబడి, గంటలకొద్దీ వాడికోసం యెదురు చూశాం. అటువంటి మనకు వాడు తన పెళ్ళిని గురించి చెప్పవలసిన అవసరంలేదా చెప్పండి! ఇప్పటి విషయంలో యెందుకు? మొన్నవాడు పరీక్షకు వెడుతున్నప్పుడు ఫీజు కట్టడానికి డబ్బు లేకపోయింది. అప్పుడు లక్ష్మి తాలూకు గొలుసు, ఉంగరం తాకట్టుపెట్టి, ఆ డబ్బుతో వాడి పరీక్ష ఫీజు కట్టాం. దానికైనా మనకు వాడు తన పెళ్ళి గురించి చెప్పవలసిన అవసరం లేదా, చెప్పండి !'

'అదంతా మన బాధ్యత అంతే.'

'వాడి ఆరోగ్యం, చదువు, ఉద్యోగం యివన్నీ మన బాధ్యత, మనకు సంబంధించిన విషయాలు. వాడి పెళ్ళిమాత్రం వాడి వ్యక్తిగతమైన విషయం. అంతేనా? వాడు తన యిష్టం వచ్చినట్లుగా పెళ్ళి చేసుకోవడంవలన వాడి చెల్లెలి పెళ్ళి ఆగిపోయింది. అయినా వాడి పెళ్ళి వాడి వ్యక్తిగత విషయమేనా చెప్పండి. వాడి పెళ్ళి గురించి మనకు చెప్పవలసిన బాధ్యత వాడికి లేదా చెప్పండి!'

'ఉంది శాంతా! ఉంది. వాడి పెళ్ళి గురించి మనకు చెప్పడం వాడి బాధ్యతే.

అనగనగా...

మన బాధ్యతను మనం నిర్వర్తించాం. కాని వాడి బాధ్యతను వాడు నిర్వర్తించలేదు. దానికి మనం యేం చెయ్యగలం చెప్పు' అన్నాడు రామ్మూర్తి శాంతను సముదాయిస్తూ.

'ఇలాగ వాడు మనతో చెప్పకుండా, పెళ్ళిచేసుకోవడం మనకు యెంత తలవంపో వాడు ఆలోచించాడా? నేను యింట్లో ఉండేదాన్ని. నామాట వదిలేయండి. కాని పదిమందిలో యిది మీకు యెంత అవమానమో వాడు ఆలోచించాడా?' అన్నది శాంత ఆయాసపడుతూ.

'శాంతా! నువ్వు మనల్ని గురించే ఆలోచిస్తున్నావు. వాడికి మనం తల్లితండ్రులం కాబట్టి వీడిమూలంగా మనం అవమానం పొందడంలో ఆశ్చర్యం లేదు. పాపం యిది ఆ సత్యనారాయణగారికి యెంత అవమానమో ఆలోచించు. తన గుమాస్తా కొడుకు అనే ఆలోచన కూడా లేకుండా, వీడికి తన కూతుర్ని యిచ్చి పెళ్ళి చెయ్య డానికి ఆయన సిద్ధపడ్డాడు. ఈ సంగతి అందరికీ తెలిసిపోయింది. ఇప్పుడు యీ పెళ్ళి తప్పిపోవడం, ఆయనకు యెంత తలవంపో ఆలోచించు. ముందు ఆయనవద్దకు వెళ్ళి, ఈ విషయం చెప్పాలి. ఈపాటికే ఆయన యేవో యేర్పాట్లు చేస్తుంటారు.'

'అవునండీ! ముందు మీరువెళ్ళి వారికి యీ సంగతి చెప్పండి. మనమూలంగా వారికికూడా అవమానం కలుగుతున్నది' అన్నది శాంత.

'నేను వెడతానుగాని ముందు నువ్వు లేచి, కొంచెం కాఫీతాగు.'

'కాఫీ' అని తండ్రి అనగానే, కాఫీ తేవడానికి లక్ష్మి వంటయింట్లోకి వెళ్ళింది.

'నేను కాఫీ తాగడానికి తొందర యేముంది? ముందు మీరు సత్యనారాయణగారి వద్దకు వెళ్ళండి.' అని రామ్మూర్తిని తొందర చేసింది శాంత.

'నువ్వు కాఫీ తాగిన తరువాతనే నేను యిక్కడనుంచి వెళ్ళడం. అదుగో లక్ష్మి కాఫీ తెచ్చింది కూడాను' అని రామ్మూర్తి లక్ష్మి చేతిలోనుంచి కాఫీగ్లాసు తీసికొని శాంతకు యిచ్చాడు.

శాంత మెల్లమెల్లగా కాఫీ తాగింది. తరువాత రామ్మూర్తి సత్యనారాయణ వద్దకు బయల్దేరాడు.

రామ్మూర్తి యింటి వద్దనుంచి బయల్దేరేసరికి తొమ్మిదిన్నర అయింది.

ఆ వేళ గురువారం. ప్రతి గురువారం నాడు ఉదయం సత్యనారాయణ యింటి వద్ద పూజచేస్తాడు. అందుచేత పదిన్నరకు గాని అతను కొట్టువద్దకు రాడు.

'ఇలాంటి విషయం సత్యనారాయణ గారితో కొట్టుదగ్గర చెప్పడం కంటే, యింటి దగ్గరనే చెప్పడం మంచిది' అని రామ్మూర్తి అనుకోవడంలో, అతను సత్యనారాయణ యింటికి వెళ్ళాడు.

రామ్మూర్తి వెళ్ళేసరికి సత్యనారాయణ పూజ పూర్తిచేసికొని కాఫీ తాగుతున్నాడు. అతను రామ్మూర్తిని చూడగానే 'రండి, రండి' అని ఆహ్వానించాడు.


రామ్మూర్తి లోపలకు వస్తూనే, 'బాబూ' నన్ను క్షమించాలి అని అంటూ సత్యనారాయణ రెండు చేతులూ పట్టుకొన్నాడు.

'రామ్మూర్తిగారూ! ఏమిటీ యిది? ఏమిటీ అయింది?' అని సత్యనారాయణ ఆతృతగా ప్రశ్నించాడు.

'బాబూ! ప్రసాద్' అని రామ్మూర్తి ఆ తరువాత యేమీ చెప్పలేకపోయాడు.

'ప్రసాద్‌కు యేమిటి జరిగింది? త్వరగా చెప్పండి' అన్నాడు సత్యనారాయణ మరింత ఆతృతగా.

'ప్రసాద్‌కు పెళ్ళి జరిగిపోయింది,



బాబూ!' అన్నాడు రామ్మూర్తి అతి కష్టంమీద.

'ఆ!' అని సత్యనారాయణ అలాగే కుర్చీకి జారపడిపోయాడు.

'అవును బాబూ! ప్రసాద్ ఈమాట చెప్పగానే మొదట నేనుకూడా నమ్మలేక పోయాను కాని తరువాత పెళ్ళి ఫోటో చూపించడంవలన నమ్మ వలసివచ్చింది.

'పెళ్ళి యెప్పుడు జరిగింది?' అని ప్రశ్నించాడు సత్యనారాయణ తన కోపాన్ని అతికష్టంమీద అపుకొంటూ.

'అప్పుడే పదిరోజులు అయిందట ... బాబూ!'

'పదిరోజుల క్రిందటే మీ అబ్బాయి పెళ్ళి జరిగిపోతే, యింతవరకూ మీరు ఈ సంగతి నాతో యెందుకు చెప్పలేదు?

'ఇప్పటివరకు నాకు కూడా తెలియదు బాబూ! ఈ ఉదయం వాడు చెపితేనే నాకు తెలిసింది. వెంటనే నేను మీ దగ్గరకు వచ్చాను.'

'అయితే, మీ అబ్బాయి మీకుకూడా తెలియకుండానే, పెళ్ళి చేసికొన్నాడన్నమాట' అని అన్నాడు సత్యనారాయణ వెటకారంగా.

'అవును బాబూ! నాకుకూడా తెలియకుండానే వాడు పెళ్ళి చేసికొన్నాడు'

'రామ్మూర్తిగారూ! ఇంక మీ అబద్ధాలు చాలించండి' మీ అబ్బాయి మీకు తెలియకుండానే పెళ్ళి చేసికొన్నాడు. అనే మాట నమ్మమంటారా? మా అమ్మాయికి మీ అబ్బాయికి వివాహం జరగడం మీకు యిష్టం లేకపోతే, ఆ మాట ముందు గానే, చెప్పవచ్చునుగదా! దానికి మీరు యిన్ని అబద్ధాలు ఆడడం యెందుకు? ఈ నటన అంతా యెందుకు?

'ఇది నటనకాదు బాబూ! ఇందులో కొంచెంకూడా అబద్ధం లేదు. నా మాట నమ్మండి.'

'ఒక అబద్ధం చెప్పిన తరువాత దానిని సమర్థించడానికి యెన్ని అబద్ధాలైనా చెప్పవలసి ఉంటుంది; మీ అబ్బాయికి మా అమ్మాయిని పెళ్ళి చేసికొమ్మని నేనేమి మిమ్మల్ని బలవంతం చెయ్యలేదు. అప్పుడే మీకు ఇష్టం సంబంధం యిష్టంలేదు'

అని చెప్పివట్లయితే యే సమస్యా ఉండేది కూడా మీకు తెలియదేటయిన్నా కాదు. అప్పుడేమో యెంతో వినయంగా అంతేనా?' మీ అంగీకారాన్ని తెలిపారు. ఇప్పుడేమో, దానికి రామ్మూర్తియేమీ మాట్లాడ మీ అబ్బాయి పెళ్ళి జరిగిన సంగతి లేకపోయాడు.

కొన్ని సామాన్య వ్యాధులకు పథ్యాపథ్యములు

వ్రణములు గలవారికి

పథ్యములు : ప్రాతబియ్యపు అన్నం, గోధుమ అన్నం, వెదురు బియ్యపు అన్నం తినవచ్చును. కందిపప్పు, మసరపప్పు, పెసరపప్పు— వీని కట్టు అన్నంలో కలుపుకొని నెయ్యి వేసుకొని తినవచ్చును. పేలాల జావ త్రాగవచ్చును. తియ్యని పళ్ళు తినవచ్చును. పొట్లకాయకూర, బీరకాయకూర, పొట్టి కాకరకాయకూర, ములుదోసకాయ కూర లేతముల్లంగికూర, చిర్రికూర తినవచ్చును. మేకమాంసం, అడవి మృగపక్షుల మాంసములు తినవచ్చును. రోజూ తగుమాత్రం తేనె త్రాగవచ్చును. పంచదార తినవచ్చును. బాగా మరిగించి చల్లార్చిన నీళ్ళు త్రాగుతూండాలి.

అపథ్యములు : క్రొత్తబియ్యపు అన్నం, చల్దన్నం తినకూడదు. ఎక్కువగా పులుపు కారం, ఉప్పు, చల్లదనం గల పదార్థాలను అన్నంలో కలుపుకొని భుజించకూడదు. అట్టి రసాలను త్రాగకూడదు. గట్టిగా మాట్లాడకూడదు. రాత్రులందు నిద్ర పోకుండా మేల్కొకూడదు. అధికంగా సంచారం చెయ్యకూడదు. మైథునం మానెయ్యాలి. కష్టమైన పనులు చెయ్యకూడదు. విచారం, కోపం, ఆందోళన యిత్యాది మానసికోద్రేకాలకు లోనుకాకూడదు.

మేహవాత రోగులకు

కీళ్ళ వద్దగాని, శరీరములో ఏభాగము వద్దనైనా గాని నొప్పులు కలిగి వుండు రోగమును 'మేహవాతం'(రొమేటిజమ్)అనిఅంటారు.

పథ్యములు : ఈ రోగం గలవారు మంచి ప్రాతబియ్యపు అన్నం తింటూండాలి. మసరపప్పు, కందిపప్పు, పెసరపప్పు— వీటి కట్టు అన్నంలో కలుపుకొని తగుమాత్రం ఆవు నెయ్యి వేసుకొని తినవచ్చును. బీరకాయ కూర, పొట్లకాయకూర, లేతముల్లంగి దుంపలకూర, పెరుగుతోటకూర, మెంతి కూర తినవచ్చును. ఆవుమజ్జిగ అన్నం తినవచ్చును. ఆవిరి మీద వండిన మినపకుడుములు తినవచ్చును.

అపథ్యములు : బాగా కాకవేసే పదార్థాలేవీ, తినకూడదు. చేపలు, మాంసం తినకూడదు. ఉలవపప్పుతోను, సెనగపప్పుతోను, మూలు పప్పుతోను చేసే పదార్థాలేవీ తినకూడదు. పులుపు, ఆవపెట్టిన ఎండు కూరలు తిన కూడదు. ఆవకాయ, ఆవకూరలు తిన కూడదు. గుమ్మడికాయకూర, మునగకాయ కూర, వంకాయకూర తినకూడదు. అన్నంలో నూనె వేసుకోకూడదు. జబ్బు తగ్గేటంత వరకూ నూనె పిండి వంటలు తినడం మానెయ్యాలి.

మూర్ఛరోగులకు

పథ్యములు : ఈ రోగం గలవారు లఘువుగా వుండే మంచి ప్రాతబియ్యపు అన్నం, ప్రాత బార్లీ బియ్యపు అన్నం తినవచ్చును. పెసరపప్పూ అన్నం తినవచ్చును. పెసరగంజి, బటాణీల గంజి, పేలాల గంజి త్రాగవచ్చును. ఆవుపాలు పంచదార కలుపుకొని త్రాగవచ్చును. బీరకాయకూర, పొట్లకాయకూర, అరటి కాయకూర చిర్రికూర తినవచ్చును. మేక మాంసం, నిర్జల ప్రదేశపు మృగపక్షుల మాంసములు తినవచ్చును. శరీరానికి పలుమార్లు మంచి చందనాన్ని పూసుకోడంవల్ల రోగం ఉపశమిస్తుంది. చల్లని గాలి శరీరానికి తగులుతూండాలి. ఇంపైన కథలు, కమ్మని సంగీతం వింటూండడం వల్లా— వింతగొలిపే వస్తువులను చూస్తూండడం వల్లా యీ రోగం తగ్గే అవకాశం ఉన్నది. సోమరిపోతులాగ కూర్చొనే కంటే ఏదైనా శ్రమతో కూడిన పని చేస్తూండడం మంచిది.

అపథ్యములు : క్రొత్తబియ్యపు అన్నం, బాగా ఉడకని అన్నం, విరుద్ధాన్నం, చల్దన్నం తినకూడదు. మినపప్పుతో చేసే పదార్థాలు కందిపప్పుతో చేసే పదార్థాలు తినకూడదు. వంకాయకూర, ముదరదొండకాయకూర తిన కూడదు. పథ్యములో చెప్పిన ఆకుకూరలు తప్ప తక్కిన ఆకుకూరలు తినకూడదు. చేపలు తినకూడదు. మిక్కిలి కారంగల పదార్థాలు తినకూడదు. అన్నంలో నూనె వేసుకోకూడదు. వేపుడు కూరలు తినకూడదు. మద్యపానం మానెయ్యాలి. మైథునం మానెయ్యాలి. దుఃఖం, భయం, క్రోధం, విచారం యిత్యాది మనోద్రేకాలకు లోను కాకూడదు. ఆకలి, దప్పి, నిద్ర వీటిని బలవంతంగా ఆపుకోకూడదు. మలమూత్రముల వేగాన్ని నిరోధించకూడదు. నీళ్ళలో దిగి స్నానం చెయ్యకూడదు.

సేకరణ: ఆకుండి నారాయణమూర్తి

అనగనగా...

'ఇంతకాలం మీరు నన్ను నమ్మించి యిప్పుడు మోసం చెయ్యడంవలన నలుగురిలో నాకు యెంత చిన్నతనమో ఆలోచించారా? వాళ్ళ గుమస్తా కొడుకే వాళ్ళ అమ్మాయిని పెళ్ళి చేసికొనడానికి యిష్టపడలేదంటే. అది నాకు యెంత అవమానమో ఆలోచించారా? ఇందులో మిమ్మల్ని నిందించ వలసిన అవసరంకూడా లేదు. మీవంటి దౌర్భాగ్యునితో సంబంధం చెయ్యాలని అనుకోవడం నాదే పొరపాటు' అన్నాడు సత్యనారాయణ కోపంగా. తనకు నలుగురిలో జరగబోయే అవమానాన్ని తలుచుకొంటున్న కొద్దీ అతనికి ఉద్రేకం పెరిగిపోతున్నది.

'అవును బాబూ! నేను దౌర్భాగ్యుణ్నే. లేకపోతే లక్ష్మీదేవివంటి విమల మా యింటికి వస్తానంటే కాదనడం దౌర్భాగ్యం కాక పోతే యేమిటి?' అన్నాడు రామ్మూర్తి నిస్సహాయంగా.

'ఈ నక్క వినయాలతోనే యింత వరకు నన్ను మోసంచేశారు ఇంతకూ మీరు మా సంబంధాన్ని చేసుకొనక పోవడానికి కారణం, మా చెల్లెలు వర్ణాంతర వివాహం చేసుకోవడమేనా? ఇప్పుడు మా సంబంధాన్ని చేసుకొంటే మీ కులం చెడి పోతుందని అనుకొన్నారు అంతేనా?'

'లేదు బాబూ! అసలు నాకు ఆ విషయమే జ్ఞాపకం లేదు. ఇది అంతా మా అబ్బాయి తొందరపాటువల్ల జరిగినది తప్ప మరొకటి యేమీకాదు. మిమ్మల్ని అవమానించాలని చేసింది యిందులో యేమీ లేదు.'

'మీ సంబంధం చెయ్యాలని అనుకోవడం వలన నాకు కలిగింది మాత్రం అవమానమే' అని సత్యనారాయణ అంటుండగా వాళ్ళ యింటి గుమ్మంలోనికి కొంత మంది బంధువులు వచ్చారు.

వాళ్ళను చూడగానే సత్యనారాయణ రామ్మూర్తితో 'యిక మీరు వెళ్ళవచ్చును' అన్నాడు.

రామ్మూర్తి దీనంగా కుంటుకుంటూ యింటి ముఖం పట్టాడు.

(ఇంకా ఉంది)



ఒక వారం విపరీతం
ఫాలాక్షుడు

రైల్వేల సేవ

ఏటి ఏమైనా, భారతదేశంలోని రైళ్ళ ప్రమాదాల సందర్భంగా చనిపోయే వారి సంఖ్య చాలా స్వల్పమని రైల్వేశాఖామంత్రి శ్రీ పాయ్ అన్నారట. భారత దేశంలోని రైల్వేలు ప్రతిరోజూ సుమారు 11 వేల రైళ్ళలో 65 లక్షల మంది ప్రజలను ఏడు వేల స్టేషన్లకు చేరవేస్తున్నాయని ఆయన అన్నారట.

సెలవు తీసుకున్న ప్రాణం

ఢిల్లీ విదేశ వ్యాపార కార్యాలయంలో సీనియర్ ఇన్వెస్టిగేటరుగా పని చేస్తున్న 32 ఏళ్ళ త్యాగరాజన్ 29 వ తేదీన ఆఫీసుకువెళ్ళి, తనకు ఒంట్లో బాగు లేదని, సెలవు కావాలని పై అధికారిని కోరి, అనక



బాత్ రూములోకి వెళ్ళి, అక్కడ నుంచి ఆ అయిదంతస్థుల భవనంమీదుంచి క్రింది దూకి, ఆత్మహత్య చేసుకున్నాడట. 'నా చావుకి ఎవరూ కారణంకాదు' అని రాసిన చీటీ ఆయన జేబులో వుందట. ...కాని కారణం ఏమిటో మాత్రం రాయలేదు.

ముగ్గురు యువకుల ఆత్మహత్య

కేరళకు చెందిన పట్టసిర్తై అనే వూరిలోని ఓ పొలంలో 18 ఏళ్ళ జాన్, 18 ఏళ్ళ జార్జి, 26 ఏళ్ళ కుంజాకుడి అనే ముగ్గురు యువకుల శవాలు దొరికాయుట. వారి పక్కనున్న ఓ కుండలో కొంచెం కల్లుందట. దాన్ని పరీక్షించి చూస్తే అందులో విష పదార్థ మేదో కలిపినట్లుందట. దీన్ని బట్టి వీరు ముగ్గురూ విషం త్రాగి ఆత్మ హత్య చేసుకుని వుండి వుండాలని పోలీసు ఓ అభిప్రాయానికి వచ్చేసిందట.

ఒకేయింట్లో మూడు హత్యలు

ముత్తుసామి గవుండర్ అనే ఆయన ఇళువం గాడు తోట్టం అనే వూరిలోవున్న తన అన్నగారింటికి తెలతెలవారుతూండగా వెళ్ళి తలుపు తట్టాడట. ఎవరూ తీయకపోయే సరికి సరితెల్లారని అనుకుని కూర్చున్నాడట. కానీ, ఎంత తెల్లారినా తలుపులుమాత్రం తెరుచుకోకపోయేసరికి బల ప్రయోగంతో తానే ఆ పని చేసి, లోపల కెళ్ళి చూసి ఆశ్చర్యపోయాడట. లోపల తన అన్న రామసామి గవుండర్, ఆయన భార్య ఇళ్ళైయ్యమ్మాళ్, మనవడు రాజన్ ముగ్గురూ చచ్చిపడున్నారట. ముగ్గురి తలమీదా పెద్ద పెద్దగాయాలున్నాయట. రక్తం మడుగు కట్టి వుందట.

అనుమానం - హత్య - ఆత్మహత్య

మైసూరు రాష్ట్రానికి చెందిన కనకపురంలో నలుగురు పిల్లల తండ్రి మునయ్య తన భార్య వెంకమ్మ ప్రవర్తనలో సందేహాన్ని పెంచుకుని, ఆమెను కడతేర్చాలని నిర్ణయించుకుని, హారోహళ్ళి మఠ అనే ఓ అడవికి తీసుకువెళ్ళి అక్కడ ఆమెను గొడ్డలితో నరికి చంపేసి, ఆనక తను ఓ చెట్టుకు వురి పోసుకుని చనిపోయాడట.

ఆకాశరామన్న

'అక్టోబరు ఒహటో తేదీ తరువాత తమరు యిక భూమిమీద వుండరు. ఒహవేళా తేది తప్పినా, వెల ముగిసేలోగా తమ కథ క్కడా ముగుస్తుంది' అని టాని ఒరిస్సా ముఖ్యమంత్రి నందినీశతపథి గారికెవరో ఓ ఆకాశరామన్న హెచ్చరిక చేశాడట—వాని ఎడ్రసేమి! ఆకాశరామన్నల కెడ్రసులుండవు.



గర్భవతి అయిన అవివాహిత ఆత్మహత్య

బొంబాయిలో పని చేయవచ్చిన ఓ కేరళ అమ్మాయి తత్సంబంధమైన అతిథి గృహంలో వుండిందట. అవివాహితయైన ఆమె గర్భవతైన విషయం గ్రహించిన అధికారు లామెను అక్కడ నుంచి పొమ్మన్నారట. దాంతో ఆమె మొన్న 21 వ తేదీన విషం తాగి ఆత్మహత్య చేసుకుందట. 'నా వస్తువులన్నీ నా చెల్లెలి కివ్వండి. నా శరీరాన్ని మాత్రం నా ప్రియున కివ్వండి ఈ శరీరము అతనిదే' అని ఓ ఉత్తరంలో రాసిందట. ఆ ప్రకారం వివాహితుడైన ఆమె ప్రియుడు ముందుకు రానందువల్ల పోలీసులు శవాన్ని ఆమె మరదికిచ్చారట.

రోడ్డు ప్రమాదాలు

బెంగళూరు నగరంలో రోడ్డు ప్రమాదాల మూలంగా ఏటికి 150 మంది చనిపోతున్నారని, ఎంతలేదన్నా 1500 మందైనా గాయాలు తగ్గలేని



కుంటున్నారని పోలీసు కమిషనర్ ఆమన్న ట్రాఫిక్ వీక్ సందర్భంలో అన్నారట. 30వ తేదీ నరసింహ రాజా రోడ్డులో సైకిలుమీదపోతున్న 45 ఏళ్ళ మునియప్ప అనే ఆయన్ను ఓబస్సుగుద్ది, పొట్టనె పెట్టుకుందట.

పెట్రోలుబంకులో అగ్నిప్రమాదం ముగ్గురు యువకుల మరణం

బెంగళూరుకు 25 కిలో మీటర్ల దూరంలో వున్న దొడ్డ బళ్ళాపూరు అనే వూరిలో 21 న తేది ఉదయం ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో విద్యుత్ ప్రవాహంవలని లోపంవల్ల అగ్నిప్రమాదం సంభవించిందట. తత్ఫలితంగా 20 ఏళ్ళ నరసింహమూర్తి, అతని తమ్ముడు మాధవ, ఓ హోటల్లో పనిచేసే కుర్రాడు వెంకటేష్ — యీ ముగ్గురు కాలి చనిపోయారట అక్కడి కక్కడే. మరో ముగ్గురు విపరీతమైన గాయాలతో ఆసుపత్రిలో చేర్పబడ్డారట.

ఏ రాయైతేనేం...?

సిమ్లాలో పెద్ద పోస్టాఫీసు రెండో అంతస్తు కిటికీలోంచి 23 వ తేదీ డబ్బు నోట్లు జలజల రాల నారంభించాయట. ఉత్సాహవంతులైన ప్రజలు కాలం కోసం కాలం వృథా చేయకుండా చేతి కందిన కాడికి నోట్లు ఏరుకుని, పరారై పోయారట. అన్నీ పది, అయిదూ రూపాయల నోట్లే నట ఆ డబ్బు పోస్టాఫీసు సీనియర్ సూపరింటెండెంటుదట. పని మాయా భద్రతకోసం ఆఫీసులో దాచు కున్నారట. ఆరోజు అగ్ని ప్రమాదం సంభవించే సరికి ధైర్యవంతుడైన వో వ్యక్తి ఆ డబ్బు కాలకుండా అలా బైటికి విసిరేశాడట—ఏ రాయైతేనేం!!



ఒకవారం విపరీతం

గుడిసెలో మూడు శవాలు

కోయంబత్తూరుకు సుమారు 100 కిలో మీటర్ల దూరంలో వున్న కంగ్యం అనే వూరిలో వో గుడిసెలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తుల శవాలు దొరికాయుట. ఈ మూడుశవాలు శరీరాలనిండా విపరీతమైన గాయాలున్నాయుట. ఈ కుటుంబంలో గత కొన్నాళ్ళుగా వున్న ఒక వ్యక్తి కనుపించడం లేదట. 15 వ తారీఖున వుదయం యీ శవాలను పోలీసులు శవ పరీక్షకు తీసుకున్నారట.

రిక్షాని ఢీకొన్న సిటీబస్సు

17 వ తేదీ ఉదయం 9 గంటలకు విజయవాడ నాగేశ్వరరావు పంతులు రోడ్డులో హిందూ హైస్కూలు సెంటరు వద్ద 18 వ నెంబరు సిటీ బస్సు రివ్వున వెళ్లి వో రిక్షాను యీడ్చి ఢీ కొందట. ఆ రిక్షాలో సత్యనారాయణ పురానికి చెందిన వో తల్లీబిడ్డా వున్నారట. బస్సు గుద్దిన వూపుకు రిక్షా వెళ్లి యాభై గజాల దూరంలో పడ్డదట. రిక్షావాడు, రిక్షాలో పెద్దావిడా ఎగిరి అవతల పడ్డారట. 8 ఏళ్ళ పిల్ల లూసిమేరీ హాప్కిన్స్ మాత్రం యీ ప్రమాదంతో చిక్కుకు పోయిందట. బస్సు ఆమె తల మీదుగా పోయిందట. ఆమె అక్కడికక్కడే [illegible] చనిపోయిందట.

ఫ్యాక్టరీలో ప్రమాదం

హైదరాబాదు సింథటిక్ డ్రగ్స్ ఫ్యాక్టరీలో 16 వ తేదీన సి షిఫ్టులో పని చేస్తున్న రామమూర్తి అనే ఆయన యంత్రాగారంలో పని చేస్తుండగా అందులో (సెంట్రిఫ్యూజ్) ఆయన చేయిపడి, చేయి మొత్తం తుత్తునియలై పోయిందట. ఈ సంగతిని తగు సమయంలో చూడనందువల్ల ఆయన ఆ ప్రదేశంలో పడి, చని పోయారట.

తాత మరణం విన్న మనవడి ఆత్మహత్య

రాజకోటకు 200 కిలోమీటర్ల దూరంలో వున్న జానఘడ్‌లో 14 ఏళ్ళ పాప్పత్‌లాల్ మంగన్‌లాల్ అనే కుర్రాడు తన తాతగారి మరణవార్తను విని, భరించలేక, ఆత్మహత్య చేసుకున్నాడట. ఆ కుర్రవాని తాత తన జబ్బు భరించలేక విషం తిని ఆత్మహత్య చేసుకున్నాడట. ఈ వార్తను విని, మనస్సు చెదిరిన ఆ కుర్రాడు మొన్న శనివారం (16 వ తేదీ) తనమీద మస్తుగా కిరసనాయిలు పోసుకుని, నిప్పంటించుకుని, ఆత్మహత్య చేసుకున్నాడట.



ఫారిన్ రిటర్న్డ్ లేక స్వదేశీ ఉద్యోగ పర్వాలకు అతీతులు

లేళ్ళపల్లి వెంకటలక్ష్మీనారాయణ



అయిదో కథ

మధ్యనిద్ర

పద్మనాభం గదిలో కూర్చుని నిద్ద రోతున్నాడు. ఆక్రితం రాత్రి క్రొత్తగా వచ్చిన వో ఫారిన్ రిటర్న్డు విదేశీ పోనీయుం యిచ్చి తెల్లవారేక గానీ రూముకు పోనీయలేదు. ఆ 'హేంగోవర్' యింకా పద్మనాభా న్నొదల్లేదు. ఆ ప్రొద్దున డిపార్ట్‌మెంట్ కొస్తూనే వలుగుర్తోనూ రాత్రి చేసిన ఘనకార్యం చెప్పాడు. ఫారిన్ రిటర్న్డు వాళ్లలోవున్న సుగుణాలలో యిదొకటి, రాసిన పేపర్ల గురించి చెప్పినట్టే కోసిన జబ్బ సంగతి చెబుతాడు. ఫారిన్ వెళ్లని వాళ్లలా కాదే! మందు వేసుకున్నా పదిమంది ముందూ చెప్పరు, తప్పుచేసి నట్టు తలొంచుక్కూర్చుంటారు—'హేంగోవర్' పోయినాసరే.

ఇలా నిద్దరోతున్న పద్మనాభానికి ప్రొఫెసర్దగ్గర్నుంచి పిలుపొచ్చింది. ఆ మర్రోజున ఆ డిపార్ట్‌మెంట్‌లోకి తీసుకోబోయే రిసర్చి స్కాలర్ల సెలెక్షన్ జరగబోతోంది. ఎంతమందిని తీసుకోవాలో నిర్ణయించుకునేందుకుగ్గాను తన కొలీగ్సుతో అలోచిస్తానిగ్గాను ఒక్కొక్కళ్లనీ ప్రొఫెసర్ గారు పిలుస్తున్నారు. ప్రొఫెసర్ రావుగారు కూడా ఫారిన్ రిటర్న్డు. కానీ యీయన పిసలైన ఫారిన్ రిటర్న్డు. రెండు మూడేళ్లకో తడవ ఫారిన్ వెళ్తొస్తూ వుంటాడు. రాగానే తన డిపార్ట్‌మెంట్ లోని స్టాఫ్ నందర్నీ పిలిచి వో మీటింగు పెడతాడు. మీటింగ్‌లో తను వెళ్ళిన దేశాల్లో తను చూసొచ్చిన ప్రదేశాల్సంగతి చెప్పకుండా ఆయా యూనివర్సిటీలలో సిలబస్ యెంత త్వరగా మారుస్తూ వుంటారన్న సంగతి, అలా మార్చాల్సిన ఆవశ్యకత గురించి, అక్కడ జరుగుతున్న రిసర్చి విషయాల గురించి వివరించి చర్చిస్తారు. వినేవాళ్లలోని ఫారిన్ రిటర్న్డు వ్యక్తులు మిగతా విషయాల గురించి కూడా ప్రొఫెసర్‌గారు చెబితే వినాలని ముచ్చటపడుతున్నట్టూ, అందువల్ల ఆ విషయాలు ముచ్చటించాలని చూచిస్తారు గానీ ప్రొఫెసర్ గారు 'అవి ప్రయివేట్‌గా మాట్లాడుకుందాం మీకంత మోజాగా వుంటే' అని నిక్కచ్చిగా చెప్పటంతో మాట్లాడకుండా కూర్చుంటారు.

పద్మనాభం సిగరెట్టు ముట్టించి ప్రొఫెసర్ యెదురుగా కూర్చున్నాడు ఇలాంటి పనులు ప్రొఫెసర్‌గారి ముందు చెయ్యగల స్వామత ఫారిన్ తిరిగిరావటంతో సద్య శాభం సంపాదించాడు...

'ఆ ఫీల్డులో రిసర్చి డాక్టర్ రెడ్డి చేస్తున్నాడు. అందువల్ల ఆ ఫీల్డులో విద్యార్థులను అతనికే వదిలి వెయ్యటం విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా మంచిది అని నా అభిప్రాయం' అన్నారు రావుగారు.

పద్మనాభం మాట్లాడలేదు.

'అంతగా మీకూ అదే ఫీల్డులో యింటె

న్ని యితే మీరూ ఆ ఫీల్డులోనే గైడ్ చెయ్యటానికి నాకేం అభ్యంతరం లేదు. కానీ మీ డాక్టరల్ థీసిస్ మరో ఫీల్డులో గదా ? ఆ ఫీల్డులోనే మీరు రిసర్చి స్కాలర్లను తీసుకుంటారనుకున్నాన్నేను' అన్నారు రావుగారు.


పద్మనాభం మాట్లాడకుండా సిగరెట్టు కాలుస్తున్నాడు.

'డాక్టరేట్ తీసుకున్న తర్వాత రెడ్డిగారి ఫీల్డులో మీరేమన్నా రిసర్చి పేపర్లు పబ్లిష్ చేశారా ?' అన్నారు రావుగారు మళ్ళీ.

పద్మనాభం సిగరెట్టు నేలమీద పడేసి కాలో్త్రొక్కాడు. కాలుతున్న సిగరెట్టు కాలి క్రిందపడి ఆరిపోయింతర్వాత అరికాలిమంట నెత్తికెక్కింది. తన పేపర్ల సంగతి సెలక్షనప్పుడే యెవ్వరూ అడగలేదు. 'ఇప్పుడు నువ్వా అడిగేది' అని ప్రొఫెసర్ మీద మండిపడ్డాడు.

'డాక్టరేట్ తీసుకున్న తర్వాత యే ఫీల్డులోనైనా రిసర్చి చేయించగల సామర్థ్యం వుందండి ... ఆ శక్తి లేకపోతే డాక్టరేటుకు విలువే లేదు. పైగా నే తీసుకున్నది అమెరికన్ యూనివర్శిటీ డాక్టరేటు, ఇండియాలో డాక్టరేట్ తీసుకున్న రెడ్డి ఒకే ఫీల్డుని కూర్చొని ఏడుస్తాడు. అంతే చెయ్య గలడు ? నా సంగతల్లా కాదే ! ... నేను దేంట్లోనైనా రిసర్చి చేయించగలను' అన్నాడు పద్మనాభం.

'అయామ్ సారీ డాక్టర్ పద్మనాభం ! మీరు అమెరికాలో చదువుకుని కూడా యిలా మాట్లాట్టం విచిత్రంగా వుంది. అమెరికాలో స్పెషలైజేషన్‌కు అధిక ప్రాముఖ్యత యిస్తారుగదా. ఇలా అన్ని విభాగాలు నావేనని అక్కడెవ్వరూ చెప్పుకోరు. స్పెషలైజేషన్‌కంత ప్రాముఖ్యం యివ్వబట్టే వారు ప్రతి విషయం క్షుణ్ణంగా పరిశీలించి



ఫారిన్...

పరిశోధించ గలుగుతున్నారేమోనని నేనను కుంటూ వుంటాను...మీరిట్లా మాట్లా ట్టం సబబుగా లేదు' అన్నాడు ప్రొఫెసర్ రావు.

పద్మనాభం కొంచెం తగ్గాడు. నిదర్శ నగా కుర్చీలో వెనక్కి వాలాడు.

'కానీ రెడ్డి చేస్తున్న విభాగానికిప్పుడు ప్రపంచంలో పెద్ద ప్రాముఖ్యం వుందని మీరే కదా చెప్పారు. రెడ్డి లెక్చరర్‌గా వుంటున్నాడు; అతగాడి కదప్పగించటం బాగుండదని నా వుద్దేశ్యం ... అలాంటి ఫీల్డులో మనలాంటి ప్రొఫెసర్లం చెయ్యాలి (పద్మనాభం అసిస్టెంటు ప్రొఫెసరైనా ప్రొఫెసర్ పద్మనాభం అని పిలిపించు కుంటూ వుంటాడు; డాక్టర్ పద్మనాభం అని యెవరన్నా పిలుస్తే పరువునష్టం దావా వేసేదా అన్నట్టు చూస్తాడు); విదే శాల్లో చదివిన మనలాంటివాళ్ళు దాంట్లో రిసర్చి చేస్తే ఆ ఫీల్డుకు స్టేటస్ కూడా వస్తుంది' అన్నాడు పద్మనాభం. ప్రొఫె సర్ రావుగారికి కోపం వచ్చింది. కానీ కోపానికి పద్మనాభానికి మధ్య ప్రొఫెసర్ గారి సభ్యత అడ్డొచ్చి వారి కోపం పద్మ నాభానికి కనిపించలేదు...

ఇక్కడ డాక్టర్ రెడ్డి సంగతి కొద్దిగా చెప్పాలి. రెడ్డి యేడెనిమిదేళ్ల క్రితం యిండియాలోని పక ప్రముఖ విద్యా సంస్థలో పిహెచ్. డి. డిగ్రీ తెచ్చు కున్నాడు. ఇంతవరకూ అయిదుగురు విద్యా ర్థులు రెడ్డివద్ద పనిచేసి డాక్టరేట్లు తెచ్చు కున్నారు. తనదగ్గర పనిజేసే విద్యార్థుల రిసర్చి విషయాల గురించి ఆ విద్యార్థుల కంటే తనే యెక్కువగా ఆలోచిస్తాడనీ, వాళ్లకంటే యెక్కువగా తనే పని చేస్తా డనీ పేరుతెచ్చుకున్నాడు రెడ్డి. తన ఫీల్డులో విదేశాల్నుంచొచ్చే ప్రముఖ జర్న ల్సులో పేపర్లు ప్రచురించాడు. అతని పేర్లు విదేశాలు వెళ్లి నిలబడ్డాయ్ గానీ యితగాడు మాత్రం విదేశాలు వెళ్లలేదు. అందుకే లెక్చరర్‌గానే వుంటున్నాడు. లెక్చ రర్‌గా చేరిన రెండేళ్లనుంచీ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు ప్రకటన పడ్డప్పు డల్లా దరఖాస్తు పడేశాడు ఇంతవరకూ మూడు నాలుగు తడవలు యింటర్వ్యూ క్కూడా వెళ్లాడు; కానీ యింటర్వ్యూలో—

'ముద్ర వేసుకున్నావా?' అనడిగేవాళ్ళు.

రెడ్డి వేసుకున్న కోటుమీద ఫారిన్ రిటర్న్డ్ ముద్రలేదు. కోటు వెనకాలేమన్నా వేయించుకున్నాడేమోనని—

'మీరిప్పుడు చేస్తున్న రిసర్చి ప్రాబ్లెం గురించి బోర్డుమీద రాసి చెప్పండి' అని బోర్డుదగ్గరకు పంపించే వాళ్ళు. అలా బోర్డు దగ్గరకు వెళ్లేటప్పుడు కోటు వెనక భాగంమీద 'ముద్ర' వుంటే బోర్డు దగ్గర వో అయిదు నిముషాలు నిలబెట్టి మళ్లీ కుర్చీలో కూర్చోబెట్టి ఆ పోస్టు కట్టబెడతారు. 'ముద్ర' లేదని తెల్సుకుంటే బోర్డుదగ్గరే వో గంట నిలబెట్టి చివరకు 'అడిగేవాడికి చెప్పేవాడు లోకువ' అన్న సూత్రాన్ని పూర్తిగా వుపయోగించుకుని బయటకు పంపిస్తారు. రెడ్డికీ యిలాగే జరిగింది. రెడ్డి యింటర్వ్యూకు వెళ్ళి నప్పుడల్లా యిలా 'ముద్ర' వేసుకున్న అభ్య ర్థులు కనీసం యిద్దరు ముగ్గురైనా వచ్చేవాళ్ళు. వాళ్లు యింటర్వ్యూలకు రాకబోయినా వాళ్ల దరఖాస్తులను చూసి వాళ్లని లాక్కొచ్చేవాళ్ళు. క్రిందటిసారి రెడ్డి యింటర్వ్యూకు వెళ్లినప్పుడు పద్మ నాభం దరఖాస్తు యింటర్వ్యూకొచ్చింది. పద్మనాభం వచ్చిచేరబోతున్నాడన్న చాటింపు డిపార్టుమెంట్‌లో వేశారు మిగతా ఫారిన్ రిటర్న్డ్ వాళ్ళు. 'అమెరికాలోని ఫలానా యూనివర్సిటీ నుంచి మన డిపార్టు మెంటు కొస్తున్నాడాయన' అంటూ దండోరా వేసేవాళ్ళు రోజూ. డిపార్టు మెంట్‌లోని మిగతా వాళ్లందరూ 'విష్వరో యీ మహానుభావుడ' ని కనిపెట్టుకుని కట్టకట్టుకుని కూర్చుంటారు. (పూర్వపు రోజుల్లో రాజకుమార్తె చేత కత్తికి కంకణం కట్టించి పెళ్లిళ్లు చేసేవార్ట. పెళ్ళయ్యాక వెళ్లిచూస్తే భర్త మూడేళ్ల పిల్లవాడనో, లేదా మంచంలోంచి లేవలేని శాపగ్రస్తుడనో తెల్సుకునేది రాకుమార్తె. ఇలాంటి కథలు విన్న మిగతా రాకుమార్తెలు యిలాంటి పెళ్లిళ్లు చేసుకోవటం జరిగితే భర్తలాంటివాడా అని ఆదుర్దాతో యెదు ర్చూసూ వుండేవారు. డిపార్టుమెంటు లోని మిగతావాళ్ళు కూడా ఫారిన్ రిటర్న్డ్‌కోసం అంత ఆదుర్దాగాను యెదు



తప్పక చూడండి!
విశ్వజ్యోతి చిత్రము
మాతృమూర్తి
దర్శకత్వం:
మానాపురం అప్పారావు
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్:
దాసరి నారాయణరావు
చెడిపోయిన
యువకుణ్ణి
బాగు చెయ్యడం
సాధ్యమా?
పెంచిన తల్లి
కట్టుకున్న భార్య
అతన్ని ఎలా
మార్చగలిగారు?
శ్రీ ఫిలింస్

ఖ్యాపేవారు!

పద్మనాభం వచ్చిన పదిరోజులకు రెడ్డి పద్మనాభాన్ని కలిశాడు.

'మీరు ఫలానా యూనివర్సిటీ నుంచా రావటం?' అన్నాడు రెడ్డి.

'య్యా' అన్నాడు పద్మనాభం; అవి ఆ యూనివర్సిటీ హిస్టరీ, జాగ్రఫీ రెండూ చెప్పాడు. కానీ రెడ్డికక్కడ జరిగే రిసర్చి విషయాలు కావాలి.

'ఫలానా జర్నలు ఆ యూనివర్సిటీ నుంచే వస్తోంది' అన్నాడు రెడ్డి.

'ఐథింక్ సో' అన్నాడు పద్మనాభం.

'మీరేమన్నా ఆ జర్నల్లో ప్రచురించారా?' అన్నాడు రెడ్డి.

'ఎక్కడండి? తీరికేది? అక్కడ డాక్టరల్ ప్రోగ్రాం అంటే ఇండియాలో మాదిరి ఆషామాషీ గాదు. వచ్చేంత పని... పేపర్ పబ్లికేషన్‌కు టైం దొరకదు' అన్నాడు పద్మనాభం.

'అయినా ప్రతి థీసిస్‌లోంచి కనీసం రెండు మూడు పేపర్లన్నా వస్తాయ్ గదా... అవి పబ్లిష్ చెయ్యకపోయ్యారు' అన్నాడు రెడ్డి.

రెడ్డి చెప్పింది కరెక్టే. అయినా పద్మనాభం అమెరికా వెళ్ళి ఇండియాలోని తన రాష్ట్రంలోని తన జిల్లా వ్యవహారాలమీద యేదో 'డిస్క్రిప్టివ్' పద్ధతిలో థీసిస్ రాశాడు. థీరిటికల్ ప్రాబ్లంగానీ, ఎనలిటికల్ పద్ధతిగానీ దాంట్లో లేదు. ఇలాంటి వాటికి ప్రముఖ విదేశీ జర్నల్సులో ప్రవేశం వుండదు. అయినా పద్మనాభం తన థీసిస్‌లోని ఆరు చాప్టర్లలోంచి ఆరు పేపర్లు రాసి అమెరికాలోని జర్నల్సుకు అమెరికా నుంచే పంపాడు.

'ఈ పేపరు మీ దేశం అంతటిలోనూ మీ రాష్ట్రంలోని మీ జిల్లాకు యెంతో వుపయోగం. అందువల్ల మీ జిల్లానుంచొచ్చే జర్నల్లో ప్రచురిస్తే యెంతో నయం. ఇండియాకు వెళ్ళాక ఆపని తప్పక చెయ్యగలరని ఆశిస్తున్నాం' అంటూ రాసిన వుత్తరాలతో తిరిగొచ్చినయ్ పేపర్లు.

పద్మనాభం చదివిన యూనివర్సిటీ నుంచొచ్చే జర్నల్లో రెడ్డి అయిదారు పేపర్లు ప్రచురించాడు. తన పేపర్లలో అంతవరకూ చలామణి అవుతున్న కొన్ని సిద్ధాంతాల్ని రెడ్డి ఖండించాడు. ప్రొఫెసర్ మిల్లర్ అనే ఆయన సిద్ధాంతంమీద వ్యాఖ్యానించాడు ఒక పేపర్లో, ఆ విషయం మాట్లాడుతో —


'ప్రొఫెసర్ మిల్లర్ 1966 లో ప్రతిపాదించిన సిద్ధాంతంమీద మీ వుద్దేశ్యమేమిటి?' అంటూ పద్మనాభాన్నడిగాడు.

'ఓ ప్రొఫెసర్ మిల్లర్ కదూ! ... య్యా ... ఆయన మాకు క్లాసుల్ తీసుకునే వాడు ... బాగా చెబుతాడు .... ఒకసారి క్లాసులో నేనో ప్రశ్న వేశాను...' అంటూ చెప్పుకుపోతున్న పద్మనాభాన్ని ఆపి—

'అది కాదండీ... ఆయన సిద్ధాంతాల మీద మీ అభిప్రాయం యేమిటి?' అన్నాడు రెడ్డి.

'అదే చెప్పబోతున్నాను... ఆ సిద్ధాంతాల గురించి మా కెప్పుడూ క్లాసులో చెప్పలేదే ఆయన' అన్నాడు పద్మనాభం.

పద్మనాభం క్లాసుల్లో చెప్పింది తప్ప జర్నల్సుచూసి తెలుసుకుంది తక్కువ. కొన్ని ప్రధాన విషయాలు 'కోర్సువర్కు'తో చెప్పి మిగతావి విద్యార్థి తనంత తాను తెల్సుకునేందుగ్గాను వదలివేస్తారు. రిసర్చి పట్ల వ్యాసక్తలకున్న అభిరుచిని తెల్సుకునేందుగ్గాను యీ పద్ధతి వుపయోగా


10%
నైజమైన తగ్గింపు
ఈ దీపావళికొలకై
అక్టోబరు ఒకటినుండి నవంబరు 9, 1972 వరకు
కో-ఆప్‌టెక్స్
చేనేత వస్త్రాలు
Criterion Co 2779 TE A

గిస్తారు. విద్యార్థి 'ప్రాబ్లెం' యెన్నుకున్న తర్వాత ఆ 'ప్రాబ్లెం' యొక్క స్వభావాన్నిబట్టి విద్యార్థి శక్తి తెల్సుకుని అట్లాగే అతగాడి వర్కు కానిచ్చి డిగ్రీయిచ్చి పంపిస్తారు. ఇంతవరకూ అనేక థీసిస్‌లకు పిహెచ్.డి డిగ్రీలొచ్చినయ్. పిహెచ్.డి డిగ్రీవచ్చిన ప్రతి థీసిస్ వున్నతమైనది కానక్కర్లేదు. కొన్ని దేశాలలో అక్కడకొచ్చే విదేశీ విద్యార్థులపట్ల కొంత సానుభూతి వుంటుంది. ఈ సానుభూతికి కారణాలనేకం. అందులో వకటి— మన దేశం (అంటే ఆ విదేశం)లో పనిచేసే వాళ్లకి చాలా సామర్థ్యం కావాలి. 'మన ఆర్థిక వ్యవస్థ అట్లాంటిది. కానీ ప్రపంచంలోని కొన్నిదేశాలలో మనకు కావల్సినంత సామర్థ్యం లక్కర్లేదు. అందువల్ల అలాంటి దేశాలనుంచి వచ్చే విద్యార్థులకు డిగ్రీ లిచ్చేటప్పుడు మన విద్యార్థుల నుంచి ఆశించినంత సామర్థ్యం ఆశించకండి; వాళ్ల ఆర్థిక వ్యవస్థ వేరు, వాళ్లని అవస్థపెట్టకండి' అన్న ధోరణి అని కొందరంటారు. అందరూ యిలాంటి డిగ్రీల్తెచ్చుకుంటున్నారని చెప్పటం

ఫారిన్ ...

వుద్దేశ్యం కాదు. ఇలాంటివాళ్లు కొందరుంటారు. ఇలాంటివారిలో పద్మనాభం వకడు. అయినా వుద్యోగవ్యవహారాల్లో మాత్రం మిగతా ఫారిన్ రిటర్న్డ్ వ్యక్తుల మాదిరే వున్నాడు.

అసలు పద్మనాభం ఫారిన్ వెళ్లటంలో వుద్దేశ్యమే ముద్రవేసుకొద్దామని.

'పోస్టుగ్రాడ్యుయేటు వయ్యావుగదా! ఎటువేపుకన్నావెళ్లి వో ముద్ర వేసుకొస్తే సరిపోతుందింక... ప్రయత్నించు' అన్నారు పద్మనాభం మిత్రులు.

యు. ఎస్.ఏ వెళ్లిందగ్గర్నుంచి 'ముద్ర రెక్కడ వేస్తారా' అని అన్వేషణ మొదలెట్టాడు పద్మనాభం. కానీ యెక్కడా కనిపించలేదది. తను యిండియాకు రావాల్సిన సమయం దగ్గర పడుతున్నకొద్దీ పద్మనాభానికాదుర్దా యెక్కువ కాసాగింది. కొందరు మిత్రులు వీడ్కోలు పార్టీ యిస్తూండగా పద్మనాభం బాపురుమన్నాడు. ఇక్కడ కొచ్చిన పని జరగలేదన్నాడు.

మిత్రులందరూ 'యేమిటేమిట'న్నారు. పద్మనాభం గోడు విన్నారు; గోడకు చేరగిలమన్నారు.

'మీరొచ్చేటప్పుడు పేపర్లలో 'పై చదువులకు పై దేశాలకు ప్రయాణం' అని రాయించుకోకుండా వచ్చేశారా?' అన్నారు మిత్రులు.

'అవున' న్నాడు పద్మనాభం.

'అదీ మీర్చేసిన పొరపాటు. ఫారిన్ రిటర్న్డ్ ముద్ర యిండియాలోనే కొడతారు. ఇండియా నుంచి బయటకొచ్చేటప్పుడొక తడవ పేపర్లో, మళ్లీ తిరిగొచ్చేటప్పుడు మరోతడవ పేపర్లలో కొట్టించుకుంటారు. ఈ రెండు పనులూ చేయించుకుంటే యీ ఫారిన్ రిటర్న్డ్ ముద్ర పడుతుంది' అన్నారు మిత్రులు.

'నేనొచ్చేటప్పుడు పేపర్లలో ఫోటో వేయించుకోలేదు కాబట్టి నాకిప్పుడు ఫారిన్ రిటర్న్డ్ ముద్రపడదా' అన్నాడు దిగులుగా పద్మనాభం.

'అంతే మరి' అన్నారు మిత్రులు విచారంగా.

పద్మనాభం తల వేలాడేశాడు.

ఇంతలో వకమిత్రుడికో ఆలోచనొచ్చింది. అందరి జేబుల్లోంచి డబ్బుల్తీసుకుని బజారెళ్లి తిరిగొచ్చాడు. ఓ ప్యాకెట్టు తీసుకొచ్చాడు.

'నువ్వు బొంబాయిలో ప్లేన్ దిగంగానే యీ ప్యాకెట్టు విప్పు...యీ లోగా విప్పకు ... విప్పావంటే ఫారిన్ రిటర్న్డ్ ముద్దర ఆశ వదులుకోవాల్సిందే' నన్నారు.

పద్మనాభం భద్రంగా ఆ ప్యాకెట్టు బొంబాయిలో ప్లేన్ దిగంగానే విప్పదీశాడు. దాంట్లో వో కోటుంది. కోటుకు ముందూ వెనకాల 'ఫారిన్ రిటర్న్డ్' అన్న ముద్రల్నున్నయ్. ఫారిన్‌వెళ్లిన ఆనందం బొంబాయి తిరిగొచ్చాగ్గానీ రాలేదు పద్మనాభానికి;

ఇంటికి చేరాక చుట్టాలూ, పక్కాలూ, పక్కవాళ్లూ — మొత్తానికి సాధించావ్ ... ముద్ర వేసుకొచ్చావ్; చాలీ జీవితానికి; యింక చాలీచాలని జీతాలో బాధపడక్కర్లేదు' అన్నారు.

'మిగతా గ్రహాలమీద యూనివర్సిటీ లొచ్చేంతవరకూ ఫర్వాలేదు. అప్పడ్దాకా ఈ ముద్దరొ కొట్టుకుంటూ, నెట్టుకుంటూ పోవచ్చు' అనుకుంటూనే ఈ డిపార్టుమెంట్‌లో చేరాడు.

* * *

పద్మనాభం యిండియాకు తిరిగొచ్చి అయిదారేళ్లయ్యింది. ఫారిన్ రిటర్న్డ్ ముద్దర లక్షయపాత్రమాదిరి అన్నీ ప్రసాదిస్తూనే వున్న దింతవరకూ. పద్మనాభం సీనియర్ ప్రొఫెసరయ్యాడు. ఇప్పటికీ నిద్రలో లేపి అడిగినా ఈ క్రిందిసలహా యిస్తూంటాడు:


'ఎటో అటు పోయి వో ముద్దరేసుకు రండి; ఆ తర్వాత నిద్దరోయినా కావల్సిన వన్నీ మీ దగ్గరకొస్తూ వుంటయ్'

(అయిపోయింది)

అంకితం: ఆదర్శ అధ్యాపకునిగా అందరి అభిమానాన్ని, అనేక గౌరవాల్ని అందుకున్న హిందూ కాలేజి (గుంటూరు) మాజీ ప్రధానోపాధ్యాయులు కీ. శే. వల్లభజోస్యుల సుబ్బారావుగారిని స్మరిస్తూ—

విజ్ఞానాన్ని సంపాదిస్తూ, దాన్ని పెంపొందిస్తున్న విజ్ఞులందరకూ (ఫారిన్ వెళ్లయినా, వెళ్లకుండానయినా) ఈ కథలను అంకితం చేస్తున్నాను—

—రచయిత.



ఏటేటా వచ్చే దురద

దానికి నివారణ ఏమిటి ?




చెమటకాయలతో దురద దురదని ఎంతో చికాకు పడతారు. గోకితే చర్మము పొరలు లేచి అసహ్యముగా ఉంటుంది. జాన్సన్స్ ప్రిక్లీ హీట్ సబ్బు మరియు ప్రిక్లీ హీట్ పౌడరు ఎండ వేడితో చెమట కాయలు రాకుండా త్వరగా రక్షణ కలిగిస్తాయి అవి రెండూ చెమటకాయలనుండి రక్షణ ఇచ్చుటకు నేడు లభిస్తున్న తయారులలో ఎంతో పొదుపైనవి.

మొదట, ఔషధములు చేరిన జాన్సన్స్



ప్రిక్లీ హీట్ సబ్బుతో స్నానము చేయండి. అది వాచిన చర్మ రంధ్రములకు ఉపశమనము కలిగించి, అంటురోగములను పోకనీయదు.

తరువాత, చెమ్మను పీల్చి చర్మమునకు హాయిని కలిగించే జాన్సన్స్ ప్రిక్లీ హీట్ పౌడరును ఒంటిమీద జల్లుకోండి. దానిలో చెమటకాయలనుండి రక్షణనిచ్చే ఒక ప్రత్యేకమైన అంటిసెప్టిక్ పదార్థముంది. దానితో వెంటనే గుణము కనిపిస్తుంది. చెమటకాయల బాధనుండి తప్పించుకొనే పద్ధతి ఇదే.




జాన్సన్స్*

ప్రిక్లీ హీట్ పౌడరు మరియు సబ్బు



జాన్సన్ అండ్ జాన్సన్ లిమిటెడ్ *ట్రేడ్ మార్కు



'చిల్లర లేదండీ...!'

ఆఫీసుకు అప్పటికి లేటైపోయిందని పంచరయిన సైకిల్‌ని ఇంట్లోనే వదిలి రిక్షాలో ఆఫీసు చేరుకొని రెండురూపాయలనోటు అందించగా, ఏదో గొప్ప సత్యాన్ని చెబుతున్నట్లుగా రిక్షావాడు చెప్పినమాట ఇది.

అప్పుడేం చెయ్యాలి...!

సినిమా మొదలైపోయింది! ఆ కళాఖండం ఆరోజే వచ్చింది! ఒక్కరోజే వుంటుంది! ఎక్కువరోజులు ఆడితే కళాఖండాలు ఎలా అవుతాయి! అందుకని హడావిడిగా చూద్దామని వెళ్ళేసరికి సినిమా మొదలు పెట్టేశారు! పదిరూపాయలనోటు అందించి 'త్వరగా ఒక టిక్కెట్టు ఇవ్వండి!' అన్నాను.

'చిల్లర లేదండీ...'

తాపీగా సమాధానం వచ్చింది.

అప్పుడెలా వుంటుంది!

* * *

ఈమధ్య ఒకరోజు ఆఫీసుకి వెడుతూ వుండగా సైకిల్ వెనకచక్రంలో గాలి పూర్తిగా లేదని దార్లో గుర్తించాను. ఈ సైకిల్ మామగారు పెళ్ళిలో ఇచ్చారు. ఆయన ఇచ్చిన రెండు వస్తువులూ అత్యవసర పరిస్థితుల్లోనే మొండికెత్తుతాయి. ఒకటి మా ఆవిడ. రెండోది ఈ సైకిల్. అటూ ఇటూ చూశాను. దగ్గర్లోవున్న సైకిల్‌షాపుకెళ్ళి 'తొందరగా గాలి కొట్టవయ్యా...' అన్నాను. గాలికొట్టడం అయ్యాకా పర్సుతీసి చూద్దునుగదా... రెండురూపాయలనోటు వుంది. 'ఇంద' అన్నాను. 'ఐదుపైసలకోసం రెండురూపాయల చిల్లర ఎక్కడనుంచి తెమ్మంటారూ!' అన్నాడు. 'అదే అర్ధరూపాయికోసం అయితే తెస్తావా...' అందామనుకున్నాను. ఎందుకు లెమ్మనుకొని— 'మరేం చేద్దాం? ఎక్కడైనా మార్చుకురా...' అన్నాను.

'ఎవరిస్తారండీ ... ఏం కొనకుండా పూరికే అసలివ్వరు!' అన్నాడు విసుగ్గా. ఇక లాభం లేదనుకొని దగ్గర్లోనే వున్న కిళ్ళీ కొట్టుకెళ్ళి ఒక వక్కపొడి పొట్లం, ఒక సిగరెట్టు ఇమ్మన్నాను. నేను ఎప్పుడూ సిగరెట్లు రెండూ, మూడూ కొంటాను ప్యాకెట్లు కొంటే మా మిత్రబృందంలో నిర్మొహమాటస్తులు చాలామంది వున్నారు. అందులో మా సర్వంపాం మరీనూ! సరిగ్గా నేను సిగరెట్టు వెలిగించే వేళకి దగ్గరకివచ్చి ఒక సిగరెట్టు అడక్కుండానే తీసుకొని నా అగ్గిపెట్టెతోనే అంటించుకొని హాయిగా కాల్చుకుంటాడు! ముందే నోటు చూస్తే చిల్లర లేదంటాడేమోనని—సిగరెట్టు తీసుకొని అంటించి మరీ నోటు అందించాను.

'చిల్లర లేదు సార్!' తల ఎత్తకుండానే అన్నాడు.

ఆఫీసుకి లేటైపోతోంది!

ఏం చెయ్యడం?

'సరే...ఒక అరపెట్టె సిగరెట్లు ఇచ్చి చిల్లర తగలెయ్య' మన్నాను. 'అరపెట్టె అయితే చిల్లర చాలదేమోనండి'... అంటూ పెట్టె సిగరెట్లు, చిల్లరా ఇచ్చాడు...

తప్పదుగా మరి!

* * *

ఒకరోజు సాయంత్రం మామూలుగా ఆఫీసునుంచి ఇంటికొచ్చాను. బట్టలు మార్చుకోడం, మొహం కడుక్కోడం అన్నీ అయ్యాయి. ఈజీఛెయిర్లో కూలబడ్డాను—

'కాఫీ—ఎంతకీ రాదేం!'

మా ఆవిడ కాఫీ తీసుకొని చిరునవ్వులు చిందిస్తూ రాలేదు—

'రాధా...కాఫీ...' అన్నాను.

'ఇవాళ కాఫీ లేదండీ... !' వంట గది లోంచే జవాబు.

సమ్మె చేస్తోందా ఏమిటి...!


'అదేమిటి...ఇలా రా...' అన్నాను.

వచ్చింది. 'పాలు లేవండీ...' అని చెప్పింది. 'ఏం...ఎందుకని...' అడిగాను నేను.

'ఆ పాల బూత్‌లో చిల్లర తెచ్చుకోపోతే పాలు ఇవ్వనంటున్నాడట. పనిమనిషి తిరిగి వచ్చేసింది!'

'చిల్లర ఇచ్చి పంపలేకపోయావా...'

'ఎక్కడుంది చిల్లర...! ఎలాగో చిల్లర సంపాదించి వెళ్ళమని దాన్ని బతిమాలాను. అది విసుక్కుంటూ తిరిగి తిరిగి చిల్లర తీసుకొని వెళ్ళేసరికి పాలు అయిపోయాయి. 'అందుకే మిమ్మల్ని — నోట్లు వద్దు... చిల్లర ఇవ్వండీ...అంటే మీరివ్వరు!' చిల్లర ఇవ్వనందుకు కాఫీ ఇవ్వకపోవడమే శిక్ష— అన్నట్లుగా చెప్పి వంటింట్లోకి వెళ్ళిపోయింది రాధ! ఆ రోజునుంచి నాకేమిటో



చిల్లర అంటూ ఏమైనా, విప్పడైనా వుంటే పూలకోసమని రాధ నన్ను అడక్కుండానే తీసుకుంటోంది!

* * *

ఆ రోజు బాగా వర్షం పడింది. అసలు మామూలుగానే మా మహాపట్టణం రోడ్ల మీద సైకిల్ తొక్కడం అంటే సర్కస్ ఫీట్సులాంటిదే! ఇక వర్షం పడితే వేరే చెప్పాలా. అందుకని సిటీబస్సులో ఆఫీసుకు వెళ్దామనే సదుద్దేశంతో బస్సు ఎక్కాను. పర్సుతీస్తే రెండురూపాయల నోటు ప్రత్యక్షం! రాత్రి పర్సులోవున్న చిల్లర పొద్దున్న పాలబూత్ పాలయి వుంటుంది. సరే! 'సెంటర్‌కి ఒకటివ్వండి!' నోటు అందిచ్చాను.

'చిల్లర లేదండీ...!' విసుక్కున్నాడు కండక్టర్.

'మరెలా ... నాదగ్గరకూడా లేదు.' అన్నాను.

'హోల్డాన్ ... అయితే దిగండి...!' బస్సు ఆపి మరీ దింపేశాడు నిర్దాక్షిణ్యంగా! తర్వాత బస్సు ఎక్కాలన్నా చిల్లర కావాలిగా! చిల్లర వేటలో పావు గంట పట్టగా ఆఫీసుకి అరగంట ఆలస్యం! షరా మామూలే ... కోం చూపులు. చివాట్లు!

* * *

'రా గురూ...కాఫీతాగుదాం...' ఆఫీసు నుంచి ఇంటికి పోతుంటే రంగనాథం పిలిచాడు. లక్ష్మీ హోటల్‌కి వెళ్లాము. 'స్పెషల్ కాఫీ' ఆర్డరిచ్చాడు రంగనాథం. కాఫీతాగాకా—బిల్లు వాడు పుచ్చుకుంటాడేమోనని కొంచెం సేపు చూశాను. ఎగిరిపోతున్న బిల్లుని పట్టుకొని—నీళ్లతో నాకు దగ్గరగా బల్లమీద అంటించాడు రంగనాథం,

ఇక తప్పదనుకొని బిల్లు తీసుకొని కౌంటర్‌దగ్గర కొచ్చి పర్సుతీశాను. ఐదు రూపాయల నోటు వెక్కిరించింది. ప్రొప్రయిటర్ బల్లమీద '50 పైసల లోపు చిల్లర తెచ్చుకోవలెను' అని పెద్ద అక్షరాల్తో బోర్డువుంది. అయినా ధైర్యంగా నోటు బల్లమీద పెట్టాను.

'చిల్లరవుంటే ఇవ్వండి...' అన్నాడు బట్టతల.

'లేదు' అంటూ రంగనాథంవైపు చూశాను—


[illegible] 'నా కెందుకు పిలుస్తాను?' అన్నట్టు చూశాడు రంగనాథం.

'మరెలా?' అన్నాను. ఇంకొంచెం సేపుంటే 'నే మారుస్తా' నంటూ రంగనాథం 'సిగరెట్లు' అవీ కొనేస్తాడు నా డబ్బుల్తో—

ఇంతలో బట్టతల ఏదో ఆలోచించి—నా ఐదురూపాయలనోటు తీసుకొని రెండు రూపాయలనోట్లు రెండు ఇచ్చాడు. ఒక కాయితంమీద డెబ్బయిపైసలు అని రాసి ఆ కాయితంముక్క నాకు ఇస్తూ 'మళ్లీ వచ్చినప్పుడు ఇది ఇవ్వండి...' అన్నాడు!

* * *

ఆరోజు మాబాస్ ఊరు వెళుతున్నాడు. ఏవో ఫైళ్ళు స్టేషన్‌కితీసుకురమ్మన్నాడు. హడావిడిగా స్టేషన్ చేరుకునే సరికి



షెడ్యూల్ టైమ్ ఐదునిముషాలుందన్నాడు. ఇందాకా ఫోన్‌చేస్తే అరగంట లేటు అన్నాడు. ఇప్పుడు ఐదునిముషాలు ముందే వచ్చేసింది! వెనకటి రోజుల్లో చెప్పిన లేటుకంటే ఇంకా లేటుగా వచ్చేవి రైళ్ళు, ఇప్పుడు ముందే వచ్చేస్తున్నాయి కాబోలు!'

కంగారుపడుతూ వెళ్లి రూపాయి నోటు ఇస్తూ 'ఒక ప్లాట్‌ఫారం టిక్కెట్టు ఇవ్వండి!' అన్నాను. జేబులోవున్న చిల్లర కాస్తా అంతకుముందే రిక్షావాడి పాలైందిగా మరి!

'ఇరవై పైసలుంటే ఇవ్వండి...!' బుకింగ్‌లోవున్న వ్యక్తి తల ఎత్తకుండానే రూపాయి నోటు వంక చూస్తూ అన్నాడు.

'లేవు' అన్నాను.

'మార్చుకు రండి' అన్నాడు.

ఏం చెయ్యడం ?!

బుకింగ్ ఆఫీసుల దగ్గర్నించి బయటికి వచ్చాను.

'సోడా సార్...' అన్నాడు సోడా కుర్రాడు.

'రూపాయి చిల్లర వుంటే సోడా ఇవ్వు!' అన్నాను.

వాడు చిల్లరంతా లెక్క చూసి 'తొంభై పైసలే వుంది. నిమ్మకాయిసోడా తాగండి. లేకపోతే రెండు సోడాలు తాగండి!' అన్నాడు.

ఏం చేస్తాం!...తప్పదుగా మరి!

ప్లాట్‌ఫారం మీదకు వెళ్లేసరికి మా బాస్ కంపార్ట్‌మెంటు దగ్గర నిలబడి నా వైపు కొర కొరా చూశాడు. ఫైళ్ళు అందిస్తూ 'హి...హి...బండి మరీ బిఫోర్ టైమ్‌కే వచ్చేసింది సార్!' అన్నాను. 'ఊఁ' అన్నాడు. నువ్వు ఇంకా బిఫోర్‌గా రావాలి...అన్నట్టుగా చూశాడు!

అసలు మా బాస్‌కంటే ముందే స్టేషన్‌కి వెళ్లి బాస్‌ని కాకాపట్టి — మా అబ్బాయి బారసాలకి సెలవు సంపాదించాలనుకున్నాను. ఆ చిల్లర గొడవ నా ప్లానంతా పాడు చేసేసింది!

* * *

ఇలా ప్రొద్దుట్నుంచి రాత్రిదాకా ఈ చిల్లర తెచ్చే చిక్కులు ఎన్నో వున్నాయి. మీరు ఈపాటికి స్వానుభవంమీద గ్రహించే వుంటారు!

మన పవిత్ర భారతదేశం పేదదేశమని ఎవరన్నారు? ఇప్పుడు ప్రతివారి దగ్గరా నోట్లే తప్ప చిల్లర ఎవరిదగ్గరా ఉండటం లేదు. మరి దేశంలో చిల్లరంతా ఏమైందో! ఏమో ?

—గీతా శివర్ప

పుస్తకాలు

ప్రకృతి ప్రబంధము

రచయిత శ్రీ వేకూరి—చెన్న కృష్ణయ్య, డెమ్మీ సైజు 33 + 296 పేజీలు. వెల పది రూపాయలు. ప్రతులకు శ్రీ వేకూరి— చెన్న కృష్ణయ్య, లక్ష్మీ కేశవ నిలయము, 12, బాగ్‌లింగంపల్లి కాలనీ, హైదరాబాదు—2.

ఏ భాషలో నయినా సరే, ప్రకృతి వర్ణన లేని ప్రబంధమే ఉండదు. రచన నవీన మయినా ప్రాచీన మయినా ప్రకృతి వర్ణన లేకపోతే రాణించదు.



ఈ వర్ణన ఆ యా సందర్భాలను అనుసరించి అక్కడక్కడ చేర్చబడుతూ ఉంటుంది. మహాకావ్యంలో అష్టాదశవర్ణన లుండాలని అలంకారికులు అభిప్రాయ పడ్డారు. ప్రాచీన ప్రబంధాల్లో, కథాంశం తక్కువగా ఉండడం వల్ల ఎక్కువ వర్ణనం అవసరం ఉండేది, కవి తన సామర్థ్యాన్ని ప్రదర్శించడానికి. ప్రకృతి వర్ణనలలో అతిశయోక్తులకు అవకాశం లేనందున నవ్య కవులుకూడా ప్రకృతి వర్ణనను ప్రధానంగా గ్రహిస్తారు.

ఈ వర్ణనలు అక్కడక్కడ మాత్రం గోచరిస్తాయి. వీటి నన్నిటినీ సమీకరించి సమీక్షించడం సులభమైన పని కాదు. దానికి ఎంతో ఆసక్తి రసగ్రహణ పారీణత, భాషా వాఙ్మయాలతో ప్రగాఢమైన పరిచయం ఉండాలి. చెన్న కృష్ణయ్యగారు అణుమాత్రమూ తీరిక ఉండని రక్షక శాఖలో బాధ్యతగల ఉద్యోగాన్ని నిర్వహిస్తున్నా, విద్యార్థిదశనుండీ అవిచ్ఛిన్నంగా కొనసాగిస్తున్న వాఙ్మయుపతన, పరిశీలన వల్ల ప్రకృతి వర్ణనల, పరిశీలనాత్మకమైన ఈ ప్రబంధాన్ని అంటే — గ్రంథాన్ని (ప్రబంధమనే పదం గ్రంథ సామాన్య పరమని, సహృదయులకు ఎరుకయే) రచింప గలిగారు. రచయిత, ప్రాచ్య నవ్య కవుల గ్రంథాలను అయిదు వందలకు పైగా పరిశీలించి ఆంగ్లకవుల భావాలను కూడా ఆయాచోట్ల జోడించి, చక్కని ఉదాహరణలను చేర్చి యీ పెద్ద విమర్శ గ్రంథాన్ని రచించారు.

ఇందు, కావ్య, ప్రబంధ యుగాల్లో ప్రకృతి వర్ణన, ఆధునిక యుగంలో వర్ణ్యయు, గోగోప జీవన వర్ణనల స్థానం ప్రభాతాది కాల వర్ణన, సూర్యోదయాస్తమయచంద్రోదయాది వర్ణన, సముద్ర—కాసార— నదీ— వన—అరణ్య-పర్వత— ఆశ్రమ—ఋతువర్ణన— మున్నగునవి క్రమంగా వివరింపబడినవి. ఇది రచయిత ఒనర్చిన ప్రకృతి పరిశీలనను వ్యక్తపరుస్తుంది. ఇది నేటిసాహిత్యంలో సమాలోచన విభాగాని కొక నూతనాలంకారం!

సుప్రసిద్ధ విద్వత్కవి విమర్శకులు శ్రీ శివశంకర స్వాములు డాక్టర్ దివాకర్ల వారు, వాఙ్మయ మహోధ్యక్ష వడ్లమూడివారు, డాక్టర్ నారాయణ రెడ్డిగారు శతావధాని వెంకటాచార్యులుగారు, నిడుదవోలువారు, కళా ప్రపూర్ణ వీర రాఘవా చార్యులుగారు, డాక్టర్ చెన్నారెడ్డిగారు, ఇచ్చిన ప్రశంసా పత్రాలు దీని వైశిష్ట్యాన్ని తెలియ పరుస్తున్నవి. ఇట్టి గ్రంథం సాహిత్య అకాడమీవారి పారితోషికాన్ని పొందడంలో వింత లే దు.

రసతపస్వి కృష్ణరావు

సంకలన కర్త, ప్రచురణ కర్త: శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య, డెమ్మీ సైజు 294 పుటలు, వెల 10 రూ. ప్రతులకు—దేశీ—బుక్ డిస్ట్రిబ్యూటర్స్, అరండల్ పేట, విజయవాడ—2.

కృష్ణాపత్రికకు సంపాదకులై, పత్రికకూ తనకూ భేదం లేనట్లు ప్రవర్తించి ఆంధ్రులందరి గౌరవాభిమానాలను పొందిన ఆదర్శ మహా పురుషుడు, జగమెరిగిన ప్రజ్ఞాశాలి శ్రీ ముట్నూరి—కృష్ణారావుగారు. ఆయనతో పరిచయం ఉన్న వివిధ వ్యక్తులు వ్రాసిన వ్యాసాలన్నీ సంఘటీకరించి, ఇది ఒక మహత్తర జీవిత చరిత్రగా తీర్చిదిద్ద బడినది. జీవిత చరిత్ర రచనలో ఇది ఒక కొత్త పద్ధతి.

దీన్ని సంకలనం చేసిన శ్రీ వెంకటసుబ్బయ్య గారు ఇదివరకు ఎన్నో జీవిత చరిత్రలను రచించారు. వారి రచనలలో సాహిత్య పరులనీ, రాజకీయ వేత్తలనీ, సంఘ సంస్కర్తలనీ, విద్యా వేత్తలనీ ఉన్నారు. ఆయన జీవిత చరిత్ర రచయితలలో అందె వేసిన చేయి అనే పేరు గడించారు.

కృష్ణారావుగారి విషయంలో మాత్రం శ్రీ వెంకట సుబ్బయ్యగారు వేరే మార్గం త్రొక్కారు. 'కృష్ణారావుగారు తత్వవేత్త. ఆయననిజతత్వాన్ని నేనేకాదు, యెవరూ యెరుగరు. ఆయన సన్నిహితులైన డాక్టరు పట్టాభి, కోట సుబ్బారావు, అవటపల్లి నారాయణరావుగార్లే యెరుగుదురు' అని సంకలన కర్త వ్రాస్తున్నారు. వ్యక్తియొక్క మహత్త్వాన్ని తెలియకుండా ఆయన జీవిత చరిత్రను వ్రాయడంలో అర్థం లేదు. అందువల్లనే ఉచితజ్ఞులైన శ్రీ వెంకట సుబ్బయ్యగారు శ్రీ ముట్నూరివారి జీవిత చరిత్రను వ్రాయబూనుకోకుండా వారిని గురించి యితరులు వ్రాసిన విషయాలను అర్థశతాబ్దం నాటివి సంపాదించి ఒకచోట చేర్చడం వల్ల వీటినన్నిటినీ చదివి అర్థం చేసుకుంటే కృష్ణారావుగారి జీవిత చరిత్ర తనంత తానే వారి హృదయ దర్పణంలో ప్రతిబింబిస్తుంది.

శ్రీ కృష్ణారావు గారు, బహుముఖ ప్రజ్ఞాశాలి. మౌన ముద్రాలంకారులు. ఆయనకు తెలియని విషయం లేదు. సాహిత్యం, కవిత్వం, చిత్రకళ, శిల్పం, సాంఘికం, సంప్రదాయం, శాస్త్రం, సనాతన ధర్మం, రాజకీయం, ఒకటేమిటి—ఆయనను కదిపితే చాలు—అనేక విషయాలు వాటంతటవి ఉబికి బైట పడతాయి. ఆయన ప్రసంగం వినడమే ఒక విజ్ఞానం. ఈ విషయంలో రచయిత కృషి ఎంతో ప్రశంసింపదగినది.

ఇందులో ఇతరుల వ్యాసాలే కాకుండా కృష్ణారావుగారి వ్యాసాలూ ఉన్నాయి. వారి పరిచితులను గురించిన విషయాలూ ఆయా పత్రికలనుండి సేకరించి, చేర్చబడ్డాయి. ఈ గ్రంథం చదివితే కృష్ణరావుగారి రసతపస్విత సువ్యక్తమవు తుంది. ఆంధ్రులందరూ తప్పక పఠించ వలసిన ఉత్తమ గ్రంథం యిది.


—అంగీరస



Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1, and at Andhra Patrika Press, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada 3.
Editor : S. Radhakrishna.

నిరుద్యోగ పర్వం:


-గీతా




NO VACANCY
ఖాళీలు లేవు
ఇదేం ఆఫీసో బోర్డు లేదు కానీ- ఈ బోర్డు మాత్రం వుంది-
సారీ! ఈ ఉద్యోగానికి నీ చదువు ఎక్కువై పోయింది! పెద్ద ఉద్యోగానికి- ఈ రికమండేషన్ వీక్‌గా వుంది!
అబ్బాయికి ఉద్యోగం లేదన్నారు! మా అమ్మాయి మంచి ఉద్యోగం చేస్తోంది! కట్నం లేకుండా చేసుకుంటారా?
నిరుద్యోగ సమస్యా పరిష్కారానికి ఎంతో ప్రయత్నిస్తున్నాను- నేను మంత్రి నయ్యాక- మావాళ్ళకే చాలామందికి ఉద్యోగాలు వేయించా!
ఇదివరకు తమరు ఎక్కడ పని చేశారు?
ఎక్కడా లేదు! నిరుద్యోగ సమస్య మీద సినిమా తీశాను!
ఇక్కడ సినిమా హాలు వుందా?
లేదు! ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజి ఆఫీసు వుంది!!


అందరూ నన్ను అంటారు 'బాబు వస్తాదు' అని...

ఈ 6 నెలల వయసు గల
అమృత్ — అతని ఆకారం.
బరువు చూసి అందరూ
అతను ఎన్ని నెలలో పెద్ద అని
అనుకుంటారు. ఇంత గొప్ప
పెరుగుదలకు మూల
కారణం— అమూల్ స్ప్రే



నేను మీకు ఒక మంచి మాట చెప్పుతా





నా కాలివ్రేళ్ళు తాకి చూపించనా?

అమూల్ స్ప్రే కొద్ది కాలంలోనే ప్రజల విశ్వాసం పొందింది మరియు ఎంత త్వరగా విక్రయం పొందిందంటే ప్రవేశ పెట్టబడిన రెండు సంవత్సరాలలోనే భారతదేశంలో సర్వాధిక విక్రయంగల శిశు అహారంగా తయారైంది. మొట్టమొదటి వారం నుంచీ మీరు మీ శిశువుకు అమూల్ స్ప్రే ఇవ్వటం ఆరంభించవచ్చును. సులభంగా జీర్ణం అయ్యే అమూల్ స్ప్రే సంతులిత పోషకత్వం కలిగిస్తుంది. అవుసరమైన విటమిన్లు, ఖనిజాలతో. గరిష్ఠ పెరుగుదల కోసం అధికమై మేలైన నాణ్యతగల ప్రొటీన్లు ఉన్నాయి.



అమూల్ స్ప్రే తల్లి పాలకు ఆదర్శవంతమైన ప్రత్యామ్నాయం.

ASP/AS 21